www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
04-10-2024
సంపుటి : 01 । సంచిక : 152 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# సన్న వడ్లకు క్వింటాకు ₹500 బోనస్



## 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ

- రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు
- సన్నాల పేరిట జరిగే గోల్‌మాల్ కు కట్టడి
- ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డి



> తెలంగాణ రైతులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. 48 గంటల్లోపే ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పినట్లు ప్రకటించారు. ఈ వానాకాలంలో రాష్ట్రంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు.ప్రతి రోజు జిల్లాలో జరుగుతున్న కొనుగోళ్ల ప్రక్రియను కలెక్టర్లు సమీక్షించాలని సీఎం సూచించారు.

**విశ్వంభర, హైదరాబాద్ :**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత సీజన్ లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లో డబ్బులు ఇచ్చామని, ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. గురువారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు జిల్లాల నుంచి ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పినట్లు ప్రకటించారు. ఇప్పటికే గుర్తించిన కేంద్రాలు కాకుండా.. ఎక్కడైనా కొనుగోలు కేంద్రం అవసరమని కలెక్టర్లు భావిస్తే అక్కడ కొత్త కేంద్రం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో

మిగతా2లో...




## జైలు ఖైదీల మధ్య కులవివక్ష సరికాదు

- కులం ఆధారంగా పనిని కేటాయించడం ఆమోద యోగ్యం కాదు
- పనివిషయంలో సమాన హక్కు కల్పించాలి
- మూడు నెలల్లోగా నియమావళిని సవరించాలి
- ఆయా రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు




## అన్ని రంగాలను గాడినపెట్టి ఆర్థిక వృద్ధి సాధించాలి

- 15 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో పనిచేయాలి
- ప్రజలపై అదనపు భారం లేకుండా ప్రభుత్వ ఆదాయం పెంచే విధానాలను అమలు చేయాలి
- అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

## నేటి నుంచి తిరుమల వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి
- భక్తుల రద్దీ దృష్ట్యా పలు ఆర్జిత సేవలు రద్దు
- బ్రేక్ దర్శనాన్ని పరిమితం చేశాం
- అక్టోబర్ 8న బ్రేక్ దర్శనాలు రద్దు
- ప్రతి రోజూ 24వేలు సర్వదర్శనం టోకెన్లు
- సిఫార్సు లేఖలపై గదులు కేటాయించబడవు
- మీడియా సమావేశంలో ఈవో జె.శ్యామలరావు




## కొండా సురేఖపై నాగార్జున పరువునష్టం దావా

- తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీశారని ఫిర్యాదు
- సురేఖ వ్యాఖ్యలపై మండిపడుతున్న సినీ ప్రముఖులు




## ఇరాన్ హిట్ లిస్ట్‌లో నెతన్యాహు

### మరి కొందరి పేర్లతో వైరల్ అవుతున్న జాబితా

### ఇజ్రాయెల్ సీనియర్ నేతలే టార్గెట్

**టెల్ అవీవ్:**

పశ్చిమాసియాలో మొదలైన తీవ్ర ఘర్షణలు ఏస్థాయికి చేరతాయోనని ప్రపంచమంతా తీవ్ర ఆందోళన చెందుతోంది. ఇరాన్ కీలక నేతలనూ అంతమొందించాలన్న అంశంపై ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్‌లో చర్చ జరిగిందని, ఆ జాబితాలో సుప్రీం నేత అయాతుల్లా ఖమేనీతో పాటు రివల్యూషనరీ దళంలోని కీలక కమాండర్ల పేర్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఇరాన్ హిట్ లిస్ట్ అంటూ కొన్ని పేర్లు వైరల్ అవుతున్నాయి. వారిలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేరు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ దేశ రక్షణ మంత్రి యోవ్ గాలంట్, ఆర్మీ, నావీ,



మిగతా2లో...




చెంచులు.. గిరిజనులకు

## మెరుగైన వైద్యం కోసం చర్యలు

- గిరిజన ప్రాంతాలలో స్థానిక భాష తెలిసిన సిబ్బందిని నియమించాలి
- 108 సేవలు లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు మంత్రి రాజ నర్సింహా ఆదేశం..!

## పేదలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రతాపం

### హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపాలని విజ్ఞప్తి చేశాం

- విధ్వంసాన్ని ఆపాలని సీఎంకు లేఖ రాశా
- ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకోవాలి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు
- ఫోన్ ట్యాపింగ్‌లో సెలబ్రిటీలను టార్గెట్ చేశారు...
- గతంలో కేసీఆర్ మొదలు పెట్టారు.. రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారు
- ఫోన్ ట్యాపింగ్ అనేది పెద్ద నేరం..
- వ్యక్తిగత విషయాలు రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదు
- సురేఖ వ్యాఖ్యలపై స్పందించిన కిషన్ రెడ్డి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** పేదలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రతాపం చూపుతున్నారని బిజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపాలని సీఎంకు విజ్ఞప్తి చేశామన్నారు. నాంపల్లిలోని బిజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 112 | రిటైల్ ₹ 134 |
| స్కిన్ ₹ 194 | స్కిన్ లెస్ ₹ 221 |

## వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే

### పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం..

- పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం : కేటీఆర్
- సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి సీఎం రేవంత్ రెడ్డికి లేదు
- దిద్దుబాటు చర్యలు కనుచూపు మేరలో కనిపించడం లేదు
- ఎక్స్ వేదిక కేటీఆర్ వ్యాఖ్యలు



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ఖజానాకు తగ్గుతున్న ఆదాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం.. పరిపాలన వైఫల్యానికి నిదర్శనం.. అనుభవ రాహిత్యంతోనే ఈ అనర్థం.. అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి.. సీఎం రేవంత్ రెడ్డికి లేకపోవడంతో అసలు సమస్య ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే

మిగతా2లో...



## రైల్వే ఉద్యోగులకు బోనస్

- 5భాషలకు ప్రాచీన హోదా..
- రైతుల ఆదాయం పెంపుదలకు.. ఆహార భద్రత కోసం పీఎం రాష్ట వికాస్ యోజన
- చెన్నై మెట్రో ఫేజ్ IIకు ఆమోద ముద్ర
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రైల్వే ఉద్యోగులకు బోనస్ ప్రకటించడంతో పాటు 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబిల్ ఆయిల్- ఆయిల్ సీడ్స్ 'కు ఆమోదం తెలిపింది. దేశంలో మరో ఐదు భాషలకు ప్రాచీన హోదా కల్పించేందుకు ఆమోద ముద్ర వేసింది. దీంతో మరాఠీ, పాళి, ప్రాకృతం, అస్సామీ,

మిగతా2లో...

## ఇకపై గీత దాటితే వేటు తప్పదు

### సీఐలు, ఎస్ఐలపై వేటు వేసిన ఐజీ..!

- ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైనట్లు వెల్లడి
- లూప్ లైన్‌లోకి ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలు
- తదుపరి చర్యలు పీడీఎస్ బియ్యం మీద ఉంటాయి
- మల్టీజోన్ 2 ఐజీ వి.సత్యనారాయణ



## జైలు ఖైదీల మధ్య కులవివక్ష సరికాదు

**ఢిల్లీ:** జైల్లో ఖైదీల మధ్య కులవివక్ష చూపడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. తమ నిబంధనల ప్రకారం ఖైదీలతో ఆయా రాష్ట్రాలు ప్రవర్తిస్తున్న తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఖైదీలను కులవివక్ష ఆధారంగా వేరుగా చూడరాదని కోర్టు చెప్పింది. అన్ని కులాలకు చెందిన ఖైదీలను మానవత్వంతో, సమానంగా చూడాలని కోర్టు తెలిపింది. కారాగారంలో కులం ఆధారంగా వివక్ష, పని విభజన ఉందంటూ ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్ పై విచారణ చేపట్టింది.కులం ఆధారంగా ఊడ్చడం, శుభ్రం చేయడం వంటి పనులను అప్పగిస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. వీటిలో ఊడ్చడం, మురుగు శుభ్రం చేయడం వంటి పనులను అట్టడుగువర్గాలకు అప్పగిస్తున్నారని.. వంట చేయడం లాంటి ఇతర పనులను అగ్ర వర్ణాలకు కేటాయిస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది.కులం ఆధారంగా పనుల్లో వివక్ష చూపడం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 15ను అతిక్రమించడమేనని వ్యాఖ్యానించింది. ఇలాంటి నిబంధలను అమలుచేస్తున్న ఆయా రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఓ కులానికి చెందిన వ్యక్తులనే స్వీపర్లుగా ఎంపిక చేయడం సరైన విషయం కాదు అని కోర్టు చెప్పింది. అలాంటి పనులు విభజనకు దారితీస్తాయని.. కులం ఆధారంగా పనులు కేటాయించడం ఆమోదయోగ్యం కాదని హితవు పలికింది.ఇది సమానత్వానికి వ్యతిరేకమని తెలిపింది. ప్రమాదకర పరిస్థితుల్లో ఖైదీలను మురుగు ట్యాంకులు శుభ్రం చేయడానికి అనుమతించరాదని పేర్కొంది. దీనిపై వివరణ ఇవ్వాలని కేంద్రంతో పాటు యూపీ, పశ్చిమబెంగాల్ సహా 11 రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వివక్షకు సంబంధించిన కేసులను పరిష్కరించడంలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించింది. ఖైదీలకు న్యాయప్రకారం.. పనులను కేటాయించాలని సుప్రీం ఆదేశించింది. ప్రమాదకర పరిస్థితుల్లో ఉండే సీవేజ్ ట్యాంక్‌లను ఖైదీలు శుభ్రం చేసే అనుమతి ఇవ్వకూడదని కోర్టు చెప్పింది. జైళ్లలో ఉన్న ఖైదీలకు పని విషయంలో సమాన హక్కు కల్పించాలని కోర్టు వెల్లడించింది.రాష్ట్ర జైలు మాన్యువల్స్‌లో ఉన్న అభ్యంతరకర రూల్స్‌ను కోర్టు కొట్టిపారేసింది. మూడు నెలల్లోగా ఆ నియమావళిని సవరించాలని ఆయా రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. అందుకోసం మూడు నెలల డెడ్ లైన్ విధించింది.

## వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ దుస్థితి ఉంటే.. వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప.. దిద్దుబాటు చర్యలు కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన పాపం.. మార్పు మార్పు అంటూ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ దుయ్యబట్టారు.

## పేదలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రతాపం

**(మొదటి పేజీ తరువాయి)**

గతంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం..మూసీ సుందరీకరణ చేయాలని ఆలోచించింది. ప్రజల నుంచి వ్యతిరేకత రాగానే వెనక్కి తగ్గింది. డ్రైనేజీ సమస్య పరిష్కరించకుండానే మూసీ సుందరీకరణ చేయాలని చూస్తున్నారు. తాగునీరు, డ్రైనేజీ కలిసి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చవద్దని ప్రభుత్వాన్ని కోరాం. విధ్వంసాన్ని ఆపాలని సీఎంకు లేఖ రాశాను. ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం న్యాయం కాదని కిషన్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా కిషన్‌రెడ్డి స్పందించారు. ఆమె వ్యాఖ్యలను ఖండించారు. మహిళలు, కుటుంబాల గురించి మాట్లాడటం బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలకు అలవాటైందని విమర్శించారు.

**ఫోన్ ట్యాపింగ్‌లో సెలబ్రిటీలను టార్గెట్ చేశారు...**

నాగ చైతన్య-సమంత విడాకుల గురించి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. మర్యాదపూర్వకంగా మాట్లాడని నేతలను మీడియా సంస్థలు బహిష్కరించాలని అన్నారు. కుటుంబ వ్యవహారాలు , వ్యకిగత విషయాలు రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని కిషన్‌రెడ్డి అన్నారు. మర్యాదపూర్వకంగా మాట్లాడని నేతలను మీడియా సంస్థలు బహిష్కరించాలన్నారు. కుటుంబ వ్యవహారాలు, వ్యకిగత విషయాలు రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని కిషన్ రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది పెద్ద నేరమని, ఒకరి సంభాషణను వినడం తప్పని అన్నారు. భార్య భర్తలు , వ్యాపార వేత్తలు, సెలబ్రిటీలను టార్గెట్ చేశారని ఆరోపించారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ మొదలు పెట్టారని, సీఎం రేవంత్ ఇప్పుడు కొనసాగిస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కొడుకుకు అయితే అడ్డూ అదుపు లేదని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

## రైల్వే ఉద్యోగులకు బోనస్..



**(మొదటి పేజీ తరువాయి)**

బెంగాలీ భాషలకు ప్రాచీన హోదా దక్కనుంది. ఇప్పటికే తెలుగు సహా ఆరు భాషలకు ప్రాచీన హోదా ఉన్న విషయం తెలిసిందే. రాబోయే ఆరేళ్లలో నూనెగింజల ఉత్పత్తికి రూ.10,103 కోట్లు ఖర్చు చేయనుంది. వంట నూనె దిగుమతులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది.

**రైల్వే ఉద్యోగులకు బోనస్..**

పండగల నేపథ్యంలో రైల్వే ఉద్యోగులకు బోనస్ చెల్లించేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక అనుసంధానిత బోనస్ గా రూ.2028.57 కోట్లు చెల్లించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

**చెన్నై మెట్రో ఫేజ్ IIకు ఆమోద ముద్ర...**

చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ట్రాఫిక్కు సులభతరం చేయడంతో పాటు ఆర్థిక వృద్ధిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఫేజ్-2లో భాగంగా రూ.63,246 కోట్లతో దాదాపు 119కి.మీల మేర ఈ భారీ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కింద మూడు కారిడార్లుగా మొత్తం 120 స్టేషన్లు నిర్మించనున్నారు. 2027 నాటికి పూర్తి ఈ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఫేజ్-II పూర్తయి ఆపరేషన్లోకి వస్తే.. చెన్నై నగరంలో మొత్తంగా మెట్రో రైల్ నెట్వర్క్ 173 కి. మీకు చేరుకోనుంది. వ్యవసాయ సంబంధిత పథకాలన్నింటినీ రెండు ప్రత్యేక స్కీమ్లు కిందకు తీసుకొచ్చింది. పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన , కృషోన్నతి యోజన పథకాల ద్వారా సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత సాధించేందుకు రూ. లక్ష కోట్లతో అమలు చేయనుంది. పీఎం ఆర్కేవీవై పథకం సుస్థిర వ్యవసాయన్ని ప్రోత్సహించగా.. కృషోన్నతి యోజన ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధికి తోడ్పడనుంది. మొత్తం 18 పథకాలను ఈ రెండు స్కీమ్లు కింద రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తారు.

- దేశీయ అవసరాల్లో దాదాపు 50శాతానికి పైగా వంట నూనెల కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీంట్లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్రం ప్రణాళిక రూపొందించింది.2022-23 నాటికి 39 మిలియన్ టన్నుల నూనెగింజలను దేశంలో ఉత్పత్తి చేస్తుండగా.. 2030- 31 నాటికి 69.7 మిలియన్ టన్నులకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, సాగును అదనంగా 40 లక్షల హెక్టార్లు పెంచేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

# సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్

**(మొదటి పేజీ తరువాయి)**



ఈ వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని సీఎం చెప్పారు.

**తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**

సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి తప్పుడు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని అన్నారు. సన్నవడ్ల సేకరణకు వీలుగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు, లేదా కొనుగోలు కేంద్రాల్లో వేర్వేరు కాంటాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. సన్న వడ్లు కొనేటప్పుడు నిర్దేశించిన ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అధికారులను అప్రమత్తం చేశారు. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. సన్న వడ్ల సేకరణలో అప్రమత్తంగా లేకపోతే గోల్‌మాల్ జరిగే ప్రమాదముందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అటువంటి తప్పులు, అ వకతవకలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని చెప్పారు.

**ప్రతి కేంద్రానికి ఓ నంబరు..**

ప్రతి కేంద్రానికి ఒక నంబరు కేటాయించాలని, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నంబరు తప్పకుండా వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో ఏ తప్పు జరిగినా, ఏ దశలో గోల్ మాల్ జరిగినా ఎక్కడ జరిగిందో సులభంగా తెలుసుకునే వీలుంటుందని చెప్పారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని ముఖ్యమంత్రి పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని మార్గాల్లోనూ పకడ్బందీగా నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు తాలు ,తరుగు, తేమ పేరు తో రైతులను మోసం చేసే వారిని సహించవద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎం చెప్పారు. రైతులు ఎక్కడ కూడా దోపిడీకి గురి కాకూడదని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలని కోరారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడే సంఖ్యలో గోనె సంచులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

**గంటకోసారి వాతావరణ శాఖ సూచనలు**

కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంట వెంటనే తరలించేందుకు తగిన రవాణా ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలని, దానికి అనుగుణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి రోజు కలెక్టర్లు తమ జిల్లాలో జరుగుతున్న కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలని, ప్రతి రోజు ఉదయం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. పాత పది జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

**ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం**

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమస్యలుంటే ఏ రోజుకారోజు పరిష్కరించాలని, సివిల్ సప్లయిస్ విభాగంలో 24X7 కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.ఈ ఏడాది రాష్ట్రంలో వరి సాగు చేసిన విస్తీర్ణంలో 58 శాతం సన్న రకాలు సాగయ్యాయి. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకంతో వచ్చే ఏడాది నుంచి సన్నాల దిగుబడి మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమంగా రాష్ట్రంలో వంద శాతం సన్న వడ్లు పండించే రోజులు వస్తాయన్నారు. దొడ్డు వడ్లకు మార్కెట్లో డిమాండ్ లేదని, ఎఫ్సీఐ వద్ద కూడా భారీగా నిల్వలున్నాయని, అందుకే సన్న రకపు వరి సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈసారి దిగుబడి అయ్యే 146 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ట్రేడర్లు, మిల్లర్లు, కొనుగోలు చేసే ధాన్యం, రైతులు తమ అవసరాలకు ఉంచుకునే నిల్వలు పక్కనపెడితే.. 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. అందులో 44 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకాలు ఉంటాయని చెప్పారు. అన్ని జిల్లాల్లోనూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చే విషయంలోనూ కలెక్టర్లు నిబంధనలను పాటించాలని చెప్పారు. డిఫాల్ట్ లేని మిల్లర్లకు ధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశం లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సివిల్ సప్లయిస్ ఎండీ డీఎస్ చౌహాన్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

**డీఎస్సీ అభ్యర్థులకు దసరాలోపు నియామక పత్రాలు**

అన్ని జిల్లాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనను 5వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. మొత్తం 11062 మంది ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగలోపు నియామక పత్రాలను అందిస్తామని ప్రకటించారు. అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 9090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు సీఎంకు వివరించారు.

## నేటి నుంచి తిరుమల వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**విశ్వంభర, తిరుమల:** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వా మి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 12 వరకు జరగనున్నాయి.గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణం జరిగింది. తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో జె. శ్యామలరావు ..అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీలోని అన్ని విభాగాల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వాహనసేవను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. విశేష ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తకోటికి టీటీడీ అనేక ఏర్పాట్లను చేసిందన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తిరుమల శ్రీవారి ఆలయంలో పలు ఆర్జితసేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. బ్రేక్ దర్శనం స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేశామని, గరుడసేవ రోజు అక్టోబరు 8న బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దు చేసినట్లు వివరించారు.

**ప్రతిరోజు 24 వేలు సర్వదర్శనం టోకెన్లు ..**

భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోజుకు 7 లక్షల లడ్డూలను నిల్వ ఉంచామన్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు 1. 32 లక్షల రూ.300ను దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. తిరుపతిలో ప్రతిరోజూ సర్వదర్శనం టోకెన్లు 24 వేలు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 1, 250 మంది టీటీడీ నిఘా భద్రతా సిబ్బంది, 3,900 పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. లక్షలాది భక్తులు వాహనసేవలు వీక్షించేందుకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో గ్యాలరీలు సుందరంగా తీర్చిదిద్దామన్నారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో 9 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ఏర్పాట్లు చేశామని వివరించారు. తిరుమలలో సామాన్య భక్తుల కోసం 6,282 గదులు అందుబాటులో ఉన్నాయి. సాధారణ రోజుల్లో 1,580 గదులు ఆన్‌లైన్‌లో భక్తులకు కేటాయిస్తామని, బ్రహ్మోత్సవాల్లో వీటిని 50 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. స్వయంగా వచ్చే కాటేజి దాతలకు మాత్రమే గదులు కేటాయించడం జరుగుతుంది. అక్టోబరు 8న గరుడసేవ సందర్భంగా అక్టోబరు 7, 8వ తేదీలలో కాటేజి దాతలకు కూడా ఎలాంటి గదుల కేటాయింపు ఉండదన్నారు. అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు ఎలాంటి సిఫార్సు లేఖలపై గదులు కేటాయించబడదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జేఈవోలు గౌతమి, వీర బ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## కొండా సురేఖపై నాగార్జున పరువునష్టం దావా

**విశ్వంభర, హైదరాబాద్:** మంత్రి కొండా సురేఖపై హీరో అక్కినేని నాగార్జున పరువునష్టం దావా వేశారు. తమ కుంటుంబ సభ్యుల గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. కాగామంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో తెలుగు చిత్ర పరిశ్రమను రాజకీయాల్లోకి లాక్కొచ్చారు. ముఖ్యంగా సమంత, నాగచైతన్య, నాగార్జున పేర్లను ప్రస్తావించడం, వారి వ్యక్తిగత విషయాలను మీడియా ముఖంగా మాట్లాడడంతో అవి కాస్త వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో కొండా సురేఖ వ్యాఖ్యలను ఇప్పటికే అటు అక్కినేని కుటుంబం, ఇటు సమంత ఖండించారు.

**సినీతారల ఆగ్రహం**

తాజాగా మంత్రి వ్యాఖ్యలపై చిత్ర పరిశ్రమలోని నటీనటులు స్పందిస్తున్నారు. ఆమె వ్యాఖ్యలపై ఇప్పటికే కొందరు నటులు స్పందించగా తాజాగా చిరంజీవి, మహేశ్‌బాబు, రవితేజ, మంచు మనోజ్, సంయుక్త మేనన్, తేజ సజ్జా, విజయ్ దేవరకొండ ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. వ్యక్తిగత జీవితాలను తీసుకురావడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ అని ఎన్టీఆర్ మండిపడ్డారు. ఆధారాల్లేని ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే మౌనంగా చూస్తూ కూర్చోబోమని హెచ్చరించారు. కొండా సురేఖ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని మరో నటుడు నాని కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.

> “ కొండా సురేఖగారు వ్యక్తిగత జీవితాలను బయటకులాగడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ. ప్రజా జీవితంలో ఉన్న మీలాంటి ముఖ్యమైన వ్యక్తులు హుందాగా, గౌరవంగా గోప్యతను పాటించేలా వ్యవహరించాలి. బాధ్యతారాహిత్యంగా చిత్ర పరిశ్రమపై నిరాధార ప్రకటనలు చేయడం నిజంగా బాధాకరం. ఇతరులు మాపై ఇలాంటి ఆరోపణలు చేస్తే చూస్తూ కూర్చొనేది లేదు. ఒకరినొకరు గౌరవించుకోవడం, పరిధులు దాటి ప్రవర్తించకుండా ఉండేందుకు ఈ అంశాన్ని కచ్చితంగా లేవనెత్తుతాం. ప్రజాస్వామ్య భారతంలో నిర్లక్ష్యపూరిత ప్రవర్తనను మన సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ హర్షించదు. - ఎన్టీఆర్

> “ మా సినీ కుటుంబానికి చెందిన ప్రముఖులపై మంత్రి కొండా సురేఖ గారు చేసిన వ్యాఖ్యలు నన్నెంతో బాధించాయి. ఒక కుమార్తెకు తండ్రిగా ఒక భార్యకు భర్తగా ఒక తల్లికి కుమారుడిగా ఒక మహిళా మంత్రి మరో మహిళపై చేసిన ఈ ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యలు తీవ్రంగా కలచివేశాయి. ఇతరుల మనోభావాలను దెబ్బతీయనంత వరకూ వాక్ స్వేచ్ఛను ఉపయోగించు కోవచ్చు. ఇలాంటి చౌకబారు, నిరాధారమైన ఆరోపణలను నేను తీవ్రంగా ఖండిస్తున్నా. అలాగే సినీరంగాన్ని టార్గెట్‌గా చేసుకుని వ్యాఖ్యలు చేయొద్దని కోరుతున్నా. మన దేశంలో ఉన్న మహిళలతోపాటు సినీ ప్రముఖులను గౌరవమర్యాదలతో చూడాలి. -మహేశ్‌బాబు

> “ రాజకీయ నాయకులు అర్థంపర్థంలేని వ్యాఖ్యలు చేయడం చూస్తుంటే అసహ్యం వేస్తోంది. బాధ్యత లేకుండా మీరు మాట్లాడుతున్న తీరు చూస్తే, మీ ప్రజల పట్ల మీకు బాధ్యత ఉందా? అనిపిస్తోంది. ఇది కేవలం సినిమా నటులు, చిత్ర పరిశ్రమ, రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదు. గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. సమాజంపై చెడు ప్రభావాన్ని చూపే ఇలాంటి చర్యలను అంతా ఖండించాలి. - నాని

## ఇరాన్ హిట్ లిస్ట్‌లో నెతన్యాహు

**(మొదటి పేజీ తరువాయి)**

ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన కమాండర్లు ఆ జాబితాలో ఉన్నారని తెలుస్తోంది. ఈ విషయంలో ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేనప్పటికీ.. నెతన్యాహు కాకపోయినా, ఇతర ఇజ్రాయెల్ సీనియర్ నేతలు టార్గెట్ కావొచ్చని తెలుస్తోంది. చీఫ్ జనరల్ స్టాఫ్ హెర్జ్ హాలేవి, ఆయన డిప్యూటీ అమీర్ బరమ్ ఆ జాబితాలో ఉన్నారు. ఇంకా ఉత్తర, దక్షిణ, సెంట్రల్ కమాండ్ మేజర్ జనరల్స్ , మిలిటరీ ఇంటిలిజెన్స్ చీఫ్ ఆహరాన్ హలివా వంటివారి పేర్లు ఉన్నాయి.

హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా హతమవడం, తన దేశంలోనే హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియాను మట్టుపెట్టడంవంటి పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీంతో రగిలిపోతున్న నెతన్యాహు సేనలు ఎలా ప్రతిస్పందిస్తాయన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇరాన్‌పై భారీ దాడికి ఇజ్రాయెల్ సమాయత్తమవుతున్న సంకేతాలు స్పష్టంగా వెలువడుతున్నాయి. ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిన ఇజ్రాయెల్ ప్రధాని జెరూసలెంలోని ఓ బంకర్‌లో భద్రతా క్యాబినెట్‌తో సమావేశమయ్యారు.

## ఇకపై గీత దాటితే వేటు తప్పదు

**విశ్వంభర, వికారాబాద్:** తెలంగాణలో పోలీస్ ప్రక్షాళన షురూ అయ్యింది. అక్రమ దందాకు వత్తాసు పలుకుతున్న పోలీసు అధికారులపై వేటు పడింది. మల్టీజోన్-2 లోని తొమ్మిది జిల్లాలలో అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను వీఆర్ లో పెడుతూ మల్టీజోన్-2 ఐజీపీ వి. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే సదరు అధికారులను బదిలీ చేయడం జరిగింది.

ప్రస్తుతం వేటు పడినవాళ్ళలో సంగారెడ్డి రూరల్, తాండూర్ రూరల్, తాండూరు టౌన్ సీఐలతోపాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్ పహాడ్, వాడపల్లి, హాలియా, ఎస్ఐలను వీఆర్ లో పెట్టారు. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్ష సహకారం ఉండటంతో వారిపై డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. త్వరలో వీరిని లూప్ లైన్‌కు ట్రాన్స్‌ఫర్ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర ఎంక్వయిరీల ఆధారంగా ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఇప్పటికే అడవిదేవులపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లి, చండూర్, మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, అచ్చంపేట్, బొంరాస్‌పేట్, తాండూర్, చిన్నంబావి ఎస్‌లను బదిలీ చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. అదేవిధంగా వాగుల్లో, నిషేధిత నది ప్రాంతాలలో ఎక్కడబడితే అక్కడ విచక్షణ రహితంగా ఇసుకను తవ్వకాలు జరుగుతున్నాయి. అదేవిధంగా పర్యావరణ సమతుల్యానికి భంగం వాటిల్లే అవకాశం ఉండటంతో ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండడంతో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని ఐజీ తెలిపారు. ఇప్పటి నుండి ఎక్కడ కూడా ఇసుక అక్రమ రవాణా జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే, కొండమల్లేపల్లి హోంగార్డు, జడ్చర్ల హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ అక్రమ ఇసుక రవాణాలో వసూళ్లు పాల్పడటంతో డీఎఆర్ కు అటాచ్ చేయడం జరిగింది. ఇక తదుపరి చర్యలు పీడీఎస్ రైస్ అక్రమ రవాణా మీద ఉంటుందని ఐజీ హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే రహస్య విచారణ జరుగుతోందన్నారు. పీడీఎస్ రైస్ అక్రమ రవాణాలో స్థానికులే కాకుండా, అంతర్రాష్ట్రంగా చేసే ప్రధాన నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీలకు ఐజీ సత్యనారాయణ ఆదేశించారు. పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, అక్రమ ఇసుక రవాణా, గాంబ్లింగ్, మట్కా పూర్తిగా బంద్ కావాల్సిందేన్నారు. గాంబ్లింగ్, మట్కా జరిగితే సంబంధిత పోలీసు అధికారులపై కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికే వికారాబాద్‌లోని మర్పల్లిలో గెస్ట్ హౌస్ లో పేకాట నిర్వహిస్తున్న ప్రభాకర్ సేట్, రఫిక్‌లకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు ఐజీ సత్యనారాయణ. రఫీ మీద సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేయడం జరిగింది. పేద, మధ్య తరగతి వ్యక్తుల నుండి దోపిడి చేసే ఈ గాంబ్లింగ్ పట్ల ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని ఆయన స్పష్టం చేశారు. మల్టీజోన్-2 లో గాంబ్లింగ్ వాసనే రాకూడదు. జిల్లాల్లో ఎక్కడ కూడా గాంబ్లింగ్ జరగకుండా చూసే బాధ్యత అయా జిల్లాల ఎస్పీలదే అని ఐజీ సత్యనారాయణ స్పష్టం చేశారు.

**వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్..!**

ఇదిలావుంటే, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే సహించేదీలేదన్నారు ఐజీ సత్యనారాయణ. ఈ క్రమంలోనే వికారాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు వేశారు. సీఐ నాగరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో అలసత్వం, దర్యాప్తులో అవకతవకలకు పాల్పడినందుకు సస్పెండ్ చేశారు..

## ఇరాన్ చమురు కేంద్రాలే ఇజ్రాయెల్ టార్గెట్..!

**వాషింగ్టన్:** ఇరాన్ చమురు కర్మాగారాలపై ఇజ్రాయెల్ దాడులు చేసే అవకాశం ఉందని, ఇదే అంశంపై చర్చిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. అయితే, తక్షణమే ఇజ్రాయెల్ ఈ దాడులు మొదలుపెడుతుందని అనుకోవడం లేదన్నారు. వైట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. చమురు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడులకు మద్దతిస్తారా?అన్న ప్రశ్నకు జో బైడెన్ ఈ విధంగా స్పందించారు. బైడెన్ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయిల్ ధరలు ఐదు శాతం పెరగడం గమనార్హం. ''మొదటి విషయమేంటంటే.. ఇజ్రాయెల్ దాడులను మేం అనుమతించం. ఈ రోజు మాత్రం అటువంటిదేం జరగదు'' అని జో బైడెన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేయడాన్ని సమర్థించనన్నారు.ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఇటీవల పెద్ద ఎత్తున క్షిపణి దాడులు చేయడాన్ని బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇందుకు ప్రతీకారం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఇరాన్‌పై ఏ క్షణమైనా దాడులు చేయవచ్చనే ఆందోళనలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఇరాన్‌లోని చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దీనిపై కొంత క్లారిటీ ఇవ్వడం గమనార్హం.

## చెంచులు.. గిరిజనులకు
# మెరుగైన వైద్యం కోసం చర్యలు..

- అధికారులకు మంత్రి రాజ నర్సింహా ఆదేశం



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఐటీడీఏ పరిధిలో నివసించే చెంచులు, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధి లో నివసించే చెంచులకు, గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య భవన్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఐటీడీఏ పరిధిలోని ఉట్నూరు, భద్రాచలం, ఏటూరు నాగారం, మున్ననూరు లతో పాటు ఇతర జిల్లాలలో ఉన్న గిరిజనులకు, చెంచులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన విషయమై మంత్రి దామోదర్ రాజ నర్సింహా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో చెంచులు, గిరిజనులకు వైద్య వసతుల కల్పనపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖల అధికారులకు మంత్రి రాజ నర్సింహా దిశానిర్దేశం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి చెంచు పెంట, గిరిజన గూడెంలో నివసించే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్యం అందేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, అటవీ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. భౌగోళికంగా ఐటీడీఏ పరిధిలో అత్యవసర పరిస్థితుల్లో అరగంట లోపే వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రులకు చేరుకునేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు. గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు భౌగోళికంగా నెట్వర్క్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని దామోదర్ రాజ నర్సింహా చెప్పారు.

అవసరమైన చోటా కొత్తగా ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలోని ఆసుపత్రులలో సిబ్బంది, డాక్టర్లు మందులు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా వర్షాకాలంలో ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ (ఈడీడీ) కంటే వారం ముందు గర్భిణీలను ఆసుపత్రికి తరలించి వారిని బర్త్ వెయిటింగ్ రూమ్ లలో ఉంచేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజ నర్సింహా పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాలలో స్థానిక గిరిజన భాష తెలిసిన సిబ్బందిని నియమించాలన్నారు. తద్వారా వారి సమస్యలను విని పరిష్కరించేందుకు దోహదపడుతుందన్నారు. అటవీ ప్రాంతంలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలు అందించేందుకు బైక్ అంబులెన్స్ ను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఐటీడీఏ ప్రాంతాలలో సీజనల్ వ్యాధుల నివారణ పై మంత్రి దామోదర్ రాజనర్సింహ చర్చించారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి గిరిజన వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల సీజన్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమీక్ష లో గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి శరత్, హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఫ్యామిలీ హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ వాసుదేవ్ రావు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ప్రజా ఆరోగ్యశాఖ సంచాలకులు డా. రవీంద్రా నాయక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా. అజయ్ కుమార్, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

## మూసీ బాధితులు నిన్ను మెచ్చుకుంటే..

**ముక్కు నేలకు రాసి రాజకీయాల నుంచి తప్పకుంటా..: రేవంత్‌కు ఈటల సవాల్**



**విశ్వంభర, హైదరాబాద్ :** మూసీ నది ప్రక్షాళన విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. మూసీ బాధితులను కావాలనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రెచ్చగొడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. మూసీ బాధితులను తాను రెచ్చగొడుతున్నాను కదా.. మీరు చేస్తున్నది మంచి పని అని మూసీ బాధితులు మిమ్మల్ని మెచ్చుకుంటే బహిరంగంగా ముక్కు నేలకు రాసి, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని రేవంత్ రెడ్డికి ఈటల రాజేందర్ సవాల్ విసిరారు.రేవంత్ రెడ్డికి సవాల్ చేస్తున్నా.. నీకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే.. ఎలాంటి భద్రత లేకుండా మన ఇద్దరం కలిసి మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటిద్దాం. నీవు ఇవాళ ఏ ఇండ్లు అయితే కూలగొడుతున్నావో.. అక్కడికి ఇద్దరం కలిసి పోదాం. మీరే తేదీ చెప్పండి.. తప్పకుండా పోదాం. చైతన్యపురి, ఫణిగిరి కాలనీల ప్రజలు కన్నీళ్లు పెడుతున్నారు. రేపోమాపో డెలివరీ అయ్యే ఓ తొమ్మిది నెలల గర్భిణీ స్త్రీని పట్టుకుని.. నువ్వు ఈ ఇల్లును ఖాళీ చేసి వెళ్లిపోవాలని అధికారులు ఆదేశించారు. ఒక వేళ ఇల్లు ఖాళీ చేయకపోతే ఇప్పుడిస్తున్న డబుల్ బెడ్రూం ఇల్లు కూడా రాదని ఆ గర్భిణిని భయభ్రాంతులకు గురిచేస్తూ పోలీసులు బలవంతంగా నెట్టేశారు. మరి నేను డెలివరీ ఎక్కడ కావాలని కాళ్ల మీద పడితే.. పోలీసులు కనికరించలేదు. చైతన్యపురి, కొత్తపేట, రామంతాపూర్.. ఎక్కడికి వస్తావో రా పోదాం. శభాష్ రేవంత్ రెడ్డి అని మూసీ బాధితులు అంటే నేను రాజకీయాల నుంచి తప్పుకుని, బహిరంగంగా క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాస్తా అని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## కేటీఆర్, హరీశ్‌రావులపై సైబరాబాద్‌లో కేసు నమోదు



**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై సైబరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో కొండా సురేఖతో ఉన్న ఫొటోలపై ట్రోలింగ్ చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలు యూట్యూబ్ ఛానల్స్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

### సికింద్రాబాద్ నుంచి గోవాకు
## రైలుకు ఆమోదం తెలిపిన రైల్వే బోర్డు



**విశ్వంభర, సికింద్రాబాద్ :** గోవా వెళ్లాలనుకునే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. సికింద్రాబాద్ నుంచి గోవాకు వెళ్లేందుకు కొత్తగా రైలును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపింది. సికింద్రాబాద్ - వాస్కోడిగామా - సికింద్రాబాద్ మధ్య కొత్తగా బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని ప్రవేశపెట్టేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపిందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ నెల 6న రైలును ప్రారంభించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. సికింద్రాబాద్ - వాస్కోడగామా (07039) వన్ వే స్పెషల్ రైలును ఉదయం 11.45 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఈ నెల 9 నుంచి రెగ్యులర్ సేవలు మొదలవుతున్నాయని పేర్కొంది.సికింద్రాబాద్ - వాస్కోడిగామా (17039) రైలు ప్రతి బుధవారం, శుక్రవారాలు అందుబాటులో ఉంటుందని.. వాస్కోడిగామా - సికింద్రాబాద్ (17040) రైలు గురువారం, శనివారాల్లో అందుబాటులో ఉంటుందని చెప్పింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉదయం 10.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 5.45 గంటలకు వాస్కోడిగామాకు చేరుకుంటుందని పేర్కొంది. రైలు కాచిగూడ, షాదర్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుంతకల్, బళ్లారి, హోస్‌పేట్, కొప్పల్, గదడ్, హుబ్బలి, దర్వాడ్, లోండా, మడగాన్ మీదుగా వాస్కోడిమాకు చేరుకుంటుందని వివరించింది. రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పింది.

# గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై విచారణ

- హైకోర్టుకు టీజీపీఎస్సీ వివరణ




**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రూప్ 1 పరీక్షలకు సంబంధించిన కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వీటిని ఆయా సబ్జెక్టుల వారీగా నిపుణుల కమిటీకి పంపి.. వారు ఆమోదించిన తరువాతే ఫలితాలు విడుదల చేసినట్టు టీజీపీఎస్సీ హైకోర్టుకు నివేదించింది. త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నందున ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంది.

గ్రూప్ 1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కార్తీక్ ఈ పిటిషన్లపై విచారణ చేపట్టారు. పరీక్షలు రాసిన దాదాపు 3లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలను స్వీకరించినట్లు టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వీటిపై నిపుణుల కమిటీ పరిశీలించిందని, ప్రధానంగా ఉన్నవాటిని పరిగణనలోకి తీసుకుని కమిటీ సిపారసుల మేరకు రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామన్నారు.

ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేశారన్నారు. మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏ నిర్ణయమైనా తీసుకునే అదికారం కమిషన్‌కు ఉందని తెలిపారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాలు చేసిన అభ్యర్థితోపాటు, కీని సవాలు చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్‌కు అర్హత సాధించారన్నారు. ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని, ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పులైనట్టు కాదన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని ఈ పిటిషన్లను కొట్టియాలని కోరారు. వాదనలు పూర్తికాకపోవడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS విశ్వంభర తెలుగు దినపత్రిక
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Project By GNR
ANVAYA
Premium luxury villa
KONGARAKALAN
Creating A Beautiful Home For You And Your Family
Marketed By South Icon Group
NO Pre EMI's UPTO 24 Months
PRICE 5499/- Per Sft
200 Yards@ 1.5 Cr
400 Yards @ 2.5 Cr
Approved By hmda
80% Loan Available From All Leading Banks



52,000 sqft Iconic Club House With Forest View
30 Ac Area Villa Project With 320 Premium Luxury Villas
Evergreen Surroundings for A Life Time Beside Forest

AMENITIES
- Gym
- Aerobics
- Indoor Games
- Olympiad Size Swimming pool,
- Badminton court
- Squash Court
- Banquet halls
- Multi-purpose & conference hall
- Creche
- Spa and Saloon
- Bar and Lounge
- Supermarket
- Canteen
- Clinic
- Billiards pool table
- Library

LOCATION HIGHLIGHTS
- 28 ACRES BIGGEST GATED COMMUNITY BT ROAD FACING LAYOUT
- 30 MIN DRIVE FROM KOKAPET/FINANCIAL DISTRICT THROUGH TSPA JUNCTION
- PROXIMITY TO 19000 ACERS PHARMA CITY
- PROXIMITY TO TCS ADIBATLA, AEROSPACE AND FABCITY.
- PROXIMITY TO EDUCATIONAL INSTITUTIONS
- 30 MIN DRIVE FROM HI-TECH CITY, GACHIBOWLI
- 15MIN DRIVE FROM RGIA AIRPORT

South Icon Group Your Trust Our Legacy
Corp Office : Plot No. 63P & 62 (NP) 3rd Floor, Samatha nagar Nagole 'X' Roads, Hyderabad - 500 068.
CONTACT FOR MORE DETAILS
9652167668

STUDENT VISA ASSISTANCE



BP TECH INDIA, USA
- Training By Real Time Experience
- Hands on Based Training
- Job Assistance
- Personality Development

.NET | Java | python | DevOps | Power BI | Selenium | SOFTWARE TESTING | aws

FIRST TIME IN NAGOLE
Address: Plot No.63P % 62 (NP) 2nd Floor, Samatha Nagar, Nagole X Road, Hyderabad - 500 068.
bptechindiapvtltd@gmail.com
www.bptechllc.in
+91 70955 35566

# బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవ శోభ

## నేటి నుండి 12 వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అనగానే భక్త జన ప్రవాహం, తన్మయత్వంతో మిన్నంటేలా వారు చేసే గోవింద నామ స్మరణ, మాడ వీధుల్లో దేవేరులతో స్వామి ఊరేగింపులు, సాటిలేని వైభవంతో సాగే వాహన సేవలు కళ్ళ ముందు కదులుతాయి. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని వివిధ రూపాల్లో, అవతారాల్లో దర్శనం చేసుకున్న వారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తి కావడంతో పాటు.. పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. తిరుమల చరిత్రలో, వందల ఏళ్ళ నుంచీ వివిధ ఉత్సవాల నిర్వహణ జరుగుతోంది. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి. పురాణాలు, శాసనాల ఆధారంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు 6వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. చక్రవర్తులు, మహరాజులు తమ విజయ పరంపరలకు గుర్తుగా తిరుమలేశుని బ్రహ్మోత్సవాల పేరుతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేవారు. నెలకొకటి చొప్పున ప్రతి ఏటా పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చరిత్ర చెబుతోంది.



క్రీ.శ.614లో పల్లవరాణి సమవాయ్(పేరిందేవి) మనవాళ పెరుమాళ్ అనే వెండి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని తిరుమల ఆలయానికి బహుకరించింది. పెరటాసి నెలలో (కన్యామాసం) జరిగే బ్రహ్మోత్సవాలకు ముందు ఈ వెండి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించేవారు. ఆ తరువాత క్రీ.శ.1254 చైత్ర మాసంలో తెలుగు పల్లవరాజు విజయ గండ గోపాల దేవుడు, క్రీ.శ.1328 ఆషాఢమాసంలో ఆడి తిరునాళ్ల పేరుతో త్రిభువన చక్రవర్తి తిరువేంకట యాదవ రాయలు, క్రీ.శ.1429 ఆశ్వయుజ మాసంలో వీర ప్రతాప దేవరాయలు, క్రీ.శ.1446లో మాసి తిరునాళ్ల పేరుత హరిహరి రాయలు, క్రీ.శ.1530లో అచ్యుతరాయ బ్రహ్మోత్సవంగా అచ్యుత రాయలు, ఉత్సవాలు నిర్వహించేవారని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.10వ శతాబ్దంలో తిరుమలలో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరిగేవి. ఉత్సవాల్లో ఉగ్ర శ్రీనివాసమూర్తిని ఉత్సవ విగ్రహంగా వినియోగించేవారు. క్రీ.శ.1339 నుంచి మలయప్ప కోనలో లభించిన మలయప్ప స్వామిని ఉత్సవ విగ్రహాలుగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఒకప్పుడు నెలకు ఒకసారి బ్రహ్మోత్సవాలు జరిగేవట. కొన్ని ఇబ్బందులు, సమస్యల కారణంగా ఏడాదికి ఒకసారి, అధిక మాసంలో రెండుసార్లకు పరిమితం అయ్యాయి. ఈ వేడుకల్లో శ్రీ వేంకట్వేరుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తకోటికి దర్శన భాగ్యాన్ని కల్పిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితులు తలెత్తినప్పటికీ శ్రీవారి బ్రహ్మోత్సవాలను రద్దు చేయడం తిరుమల క్షేత్ర చరిత్రలో లేదు. కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాలకట్ల) బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు సంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. భాద్రపదంలో నిర్వహించే ఉత్సవాలను, సాలకట్ల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 3న రాత్రి అంకురార్పణతో ప్రారంభం అయినాయి. అక్టోబర్ 4 నుండి 12 వరకు నిర్వహించ నున్నారు. బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా, లక్షలాది మంది భక్తుల మధ్య నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను ప్రారంభించే ముందు ఎటువంటి ఆటంకాలు కలగకుండా, విజయవంతంగా జరగాలని కోరుకుంటూ వైఖానస ఆగమనంలోని క్రతువులలో అంకురార్పణంతో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. శ్రీవారి సేనాధిపతి అయిన విశ్వక్సేనుల ఆలయానికి నైరుతి మూలలో ఉన్న వసంత మండపానికి ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు చేసి, ఆ మట్టిలో నవధాన్యాలను నాటడాన్ని అంకురార్పణం అంటారు.

ప్రతిరోజు ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామివారి వాహన సేవలు జరుగుతాయి. గరుడ వాహనం రాత్రి 7 నుండి తెల్లవారు జామున 2 గంటల వరకు నిర్వహిస్తారు. 4వ తేదీన మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు బంగారు తిరుచి ఉత్సవం, 6 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు పెద్ద శేష వాహన సేవ జరుగుతాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీవారు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి ఏడుతలల శేష వాహనంపై తిరుమాడ వీధులలో భక్తులకు దర్శనమిస్తారు. రెండో రోజున 5వ తేదీన ఉదయం మలయప్ప స్వామి 5 తలల చిన్న శేష వాహనంపై భక్తులను అనుగ్రహిస్తారు.

6వ తేదీ ఉదయం మలయప్ప స్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి ముత్యపు పందిరిలో శ్రీవారు తిరుమల మాడ వీధుల్లో విహరిస్తారు. 7వ తేదీన ఉదయం కల్పవృక్ష వాహనంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కనువిందు చేస్తారు. రాత్రి సర్వభూపాల వాహనంలో స్వామి వారు దర్శనమిస్తారు. 8వ తేదీ ఉదయం మోహినీ అవతారంలో దర్శనమిస్తారు. రాత్రి గరుడ వాహనంలో మలయప్ప స్వామి తిరుమల మాడ వీధుల్లో విహరిస్తారు. 9వ తేదీ ఉదయం హనుమంత వాహనంలో శ్రీరాముని అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం స్వర్ణ రథంపై ఊరేగింపులో పాల్గొని భక్తులను అనుగ్రహిస్తారు. రాత్రి గజవాహనంపై తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేస్తారు. 10వ తేదీ ఉదయం సూర్య ప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు తిరుమాడ వీధుల్లో ఊరేగింపులో భక్తులను అనుగ్రహిస్తారు. ఇదే రోజున రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరిస్తారు. 11వ తేదీ ఉదయం 7 గంటల నుంచి రథోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి 7 గంటల నుంచి అశ్వ వాహన సేవ జరుగుతుంది. 12వ తేదీ చివరిదైన తొమ్మిదో రోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటలకు వరకు చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రి 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు ధ్వజారోహణం ఘట్టంతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



### బ్రహ్మోత్సవ సేవలో అష్ట దిక్పాలకులు

బ్రహ్మోత్సవాలకు సకల దేవతామూర్తులను ఆహ్వానిస్తారు. తొలి దినం వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా గరుడ కేంద్ర ప్రతిష్ట, కంకణ ధారణ, ఆలయ ఆవరణంలోను, బయట, చుట్టూ అష్ట దిక్కులలోనూ స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా సపరివార దేవతలతో ఊరేగుతూ ఉండగా అష్ట దిక్పాలకులకులను ఆహ్వానిస్తారు. అనంతరం స్వామి ఆలయంలో ప్రవేశించి ధ్వజస్తంభం దగ్గరకు చేరుకుంటారు. మిగిలిన పరివార దేవతలైన అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంత, అంగదుడు విమాన ప్రదక్షణలో ఉన్న మండపంలోకి చేరుకుంటారు. తదుపరి శ్రీదేవి, భూదేవి, మలయప్ప స్వామి సమక్షంలో వేద గానాల మధ్య మంగళ వాయిద్యాలు మోగుతుండగా అర్చక స్వాములు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఎగురు వేస్తారు. దీనితో ధ్వజారోహణ కార్యక్రమం పూర్తవుతుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా పుణ్య స్థలిలో ఎనిమిది దిక్కులలో కొలువై ఉండి, బ్రహ్మోత్సవాల విజయవంతంలో అష్ట దిక్పాలకులదే ప్రధాన పాత్ర. తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం అనేవి నాలుగు దిక్కులు. ఆగ్నేయం, నైరుతి, వాయవ్యం, ఈశాన్యం అనేవి నాలుగు మూలలు లేక నాలుగు విదిక్కులు. ఈ ఎనిమిదింటిని కలిపి అష్ట దిక్కులని పేరు.

**అష్ట దిక్కులకు పాలకుల విశేషాలు...**

**ప్రథముడు ఇంద్రదేవుడు:** ఇంద్రుడు దేవతలకు రాజు. ఇతను తూర్పు దిక్కునకు అధిపతి. అదితి కుమారుడు. భార్య శచీదేవి. ఆయుధం వజ్రం. వాహనం ఐరావతం. నివాసం అమరావతి పట్టణం. పాలసముద్రంనుండి పుట్టిన ఐరావతమనే ఏనుగును, ఉచ్ఛైశ్రవమనే గుర్రాన్ని ఇతను తీసుకున్నాడు.

**అగ్నిదేవుడు:** అగ్ని పంచ మహాభూతాల్లో ఒకడు. ఆగ్నేయాధిపతి. తేజస్వి. సప్త హస్తములు, చతుశ్శృంగములు, ఏడు నాల్కలు, రెండు శిరములు కలిగి శుభ్రమైన చిరునవ్వులు చిందించు స్వరూపం కలవాడు. తండ్రిపేరు వైశ్వానరుడు. తల్లి శుచిష్మతి. భార్య స్వాహాదేవి. ఆయుధం శక్తి. వాహనం పొట్టేలు. నివాసం తేజోవతి పట్టణం.

**యమదేవుడు:** యముడు పితృగణాధిపతి. దక్షిణ దిక్కులో పరిపాలన ఇతనిదే. ఇతని తండ్రి సూర్యుడు. తల్లి సంజ్ఞాదేవి. భార్య శ్యామలా దేవి. ఆయుధం దండం. వాహనం మహిషం. నివాసం సంయమని పట్టణం.

**నిరృతి దేవుడు:** నిరృతి అంటేనైరుతి దిక్కునకు అధిపతి. సత్పురుషుడు. కీర్తిమంతుడు. భార్య దీర్ఘాదేవి. ఆయుధం కుంతము. వాహనం నరుడు. నివాసం కృష్ణాంగన పట్టణం.

**వరుణ దేవుడు:** యజ్ఞ సమయాల్లో హవిర్భాగములను ఇవ్వడానికి వరుణుడిని ఆహ్వానిస్తారు. పశ్చిమ దిక్పాలకుడు. జలాధిపతి. ఇతని తండ్రి కర్దమ ప్రజాపతి. భార్య కాళికాదేవి. ఆయుధం పాశము. వాహనం మొసలి. నివాసం శ్రద్ధావతి పట్టణం.

**వాయు దేవుడు:** వాయువు పంచ భూతాలలో ఒకరు. సర్వ వ్యాపకుడు. మహా బలవంతుడు. వాయవ్య దిశకు అధిపతి అయిన ఇతడు జీవకోటికి ప్రాణాధికం. ఇతని భార్య అంజనాదేవి. ఆయధం ధ్వజం. వాహనం జింక. నివాసం గంధవతి పట్టణం.

**కుబేర దేవుడు:** కుబేరుడు సకల దేవతాప్రియతముడు. ఉత్తర దిక్కునకు అధిపతి. ధనపతి. భాగ్యశాలి. కుబేరుని తండ్రి విశ్రవోబ్రహ్మ. తల్లి ఇలబిల. భార్య చిత్ర రేఖాదేవి. ఆయుధం ఖడ్గము. వాహనం గుర్రం. నివాసం అలకాపురి పట్టణం.

**ఈశానుడు:** సాక్షాత్తు ఈశాన్యాధిపతి పరమ శివుడు. జగదంబ పార్వతీదేవి ఇతని భార్య. ఆయుధం త్రిశూలము. వాహనం వృషభము. నివాసం యశోవతి పట్టణం. పార్వతీ పరమేశ్వరులకు ఆదిదంపతులని ప్రతీతి. శంకరుడు కోరినవారి కోరికలు కాదనకుండా నెరవేర్చడం చేత ఇతనికి భోళాశంకరుడని పేరు. మహాశక్తి మంతుడు. త్రిమూర్తులలో ఒకడు. సర్వస్వతంత్రుడు. భూత గణ సంసేవితుడై, తృటిలో భస్మం చేసేశక్తిగల మూడవ కన్ను కలిగిన ఇతడు లయకారకుడు. కైలాసం ఇతని నివాసం. అష్టదిక్పాలకులందరినీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో స్మరించడం పుణ్యప్రదం.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# శ్రీశైలంలో దసరా నవరాత్రి ఉత్సవాలు షురూ

## తొలిరోజు శైలపుత్రిగా దర్శనమిచ్చిన భ్రమరాంబ



ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు ఉత్సవాలు జరుగనుండగా.. దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారు ఒక్కో రూపంలో దర్శనమివ్వనున్నారు. అలాగే, ఒక్కో వాహనంపై దర్శనం ఇవ్వనున్నారు. చండీహోమం, రుద్రహోమం, జపాలు, పారాయాణలు కొనసాగనున్నాయి. గురువారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈవో పెద్దిరాజు దంపతులు, అర్చకులు, స్థానాచార్యులు, అర్చకస్వాములు, అధికారులు ఆలయ ప్రవేశం చేయగా.. ఉత్సవాలు మొదలయ్యాయి.

సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, ఫలపుష్పాదులతో ఆలయ ప్రవేశం చేశారు. ఉదయం 8 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం, గణపతిపూజ, దీక్షాసంకల్పం, కంకణపూజ, కంకణధారణ, రుత్విగ్వరణం, కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారి యాగశాలలో అఖండదీపస్థాపన, వాస్తుపూజ, మండపారాధనలు, చండీకలశస్థాపన, శ్రీచక్రార్చన, నవగ్రహజపాలు, చతుర్వేద పారాయణలు, చండీసప్తశతి, మహావిద్యా పారాయణలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. స్వామివారియాగశాలలో యాగశాలప్రవేశం, గణపతిపూజ, శివసంకల్పం, అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, మండపారాధనలు, రుద్రకలశస్థాపన క్రతువులు కొనసాగాయి. ఈ సందర్భంగా లోక సంక్షేమాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పం పటించారు. అనంతరం ఉత్సవాలు నిర్విఘ్నంగ జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అమ్మవారి యాగశాలలో పుణ్యాహవాచనం, అఖండదీపస్థాపన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధన, చండీకలశస్థాపన, శ్రీచక్రార్చన.. నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు జరిగాయి. స్వామివారి ఉత్సవాల్లో శివసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, చండీశ్వరపూజ, రుత్విగ్వరణం, అఖండదీపస్థాపన, వాస్తుపూజ, మండపారాధన, రుద్రకలశస్థాపన, జరిగాయి. అలాగే లోక కల్యాణార్థం రుద్రహోమం, చండీహోమం నిర్వహించారు. దసరామహోత్సవాలలో భాగంగా కుమారి పూజలు నిర్వహించారు. పూజలో భాగంగా రెండేళ్ల నుంచి పదేళ్లలోపు వయస్సు ఉన్న బాలికకు పూలు, పండ్లు, నూతనవస్త్రాలను సమర్పించి పూజించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇక సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. నవరాత్రి వేడుకల్లో తొలిరోజైన గురువారం అమ్మవారి శైలపుత్రి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఇక రాత్రి స్వామి, అమ్మవార్లు భృంగివాహన సేవపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అంతకు ముందు స్వామిఅమ్మవార్లకు భృంగివాహనంపై వేంచేపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# జంతు జాతులను పరిరక్షించుకోవాలి

## నేడు ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం



వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. ఇలా జంతు జాతులు అంతరించి పోకుండా, వాటిని పరిరక్షించడమే 'ప్రపంచ జంతు దినోత్సవం' ముఖ్యోద్దేశం. ఏటా అక్టోబర్ 4న ఈ జంతు సంరక్షణ దినోత్సవాన్ని అంతర్జాతీయంగా నిర్వహిస్తున్నారు. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమవుతున్న నేపథ్యంలో.. వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీ ఏటా అన్ని దేశాలు ప్రపంచ జంతు దినోత్సవాన్ని జరుపుతున్నాయి. ప్రపంచ జంతు దినోత్సవాన్ని సైనాలజిస్ట్ హెన్రిచ్ జిమ్మెర్మాన్ ప్రారంభించాడు. ఆయన మొదటి ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవాన్ని 24 మార్చి 1925 న జర్మనీలో బెర్లిన్‌లోని స్పోర్ట్ ప్యాలెస్‌లో నిర్వహించాడు. దీనికి 5,000 మందికి పైగా హాజరయ్యారు. అనంతరం దీన్ని 1929లో అక్టోబరు 4కు మార్చారు.ప్రారంభంలో జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, చెకోస్లోవేకియాలో మాత్రమే పాటించారు. చివరగా, మే 1931 లో ఫ్లోరెన్స్ (ఇటలీ)లో జరిగిన ఇంటర్నేషనల్ యానిమల్ ప్రొటెక్షన్ కాంగ్రెస్ సమావేశంలో, అక్టోబర్ 4 ప్రపంచ జంతు దినోత్సవాన్ని సార్వత్రికం చేయాలన్న ప్రతిపాదనను ఏకగ్రీవంగా అంగీకరించి తీర్మానంగా ఆమోదించారు. హీన్రిచ్ జిమ్మెర్మాన్ చేసిన కార్యక్రమాలు, ప్రచారం కారణంగా 1931, మే నెలలో ఇటలీలోని ఫ్లోరెన్స్ లో జరిగిన అంతర్జాతీయ జంతు రక్షణ సదస్సులో అక్టోబరు 4ను అంతర్జాతీయ జంతు దినోత్సవంగా ఏకగ్రీవంగా అమోదించారు. ప్రపంచ జంతు దినోత్సవం 2003 నుండి యునైటెడ్ కింగ్డమ్ ఆధారిత జంతు సంక్షేమ స్వచ్ఛంద సంస్థ నేచర్ వాచ్ ఫౌండేషన్ నేతృత్వంలో స్పాన్సర్ చేసిన జంతు సంరక్షణ ఉద్యమం ప్రపంచ కార్యక్రమంగా మారింది. జాతీయత, మతం, విశ్వాసం లేదా రాజకీయ భావజాలంతో సంబంధం లేకుండా అనేక దేశాలలో విస్తృతంగా అంగీకరించ బడింది మరియు వివిధ రకాలుగా జరుపు కుంటారు. దినోత్సవం రోజున జంతు సంక్షేమ ప్రచారంతో పాటుగా జంతు సంరక్షణ శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడంవంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్నాయి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడుకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణులు జనారణ్యంలోకి వస్తున్నాయి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడులోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102.

1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈ చట్టం అమలులోకి వచ్చాక.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి.

అంతర్జాతీయంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో.. వేటగాళ్ల చేతిలో చిరుతలు బలైపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిందంటే.. అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటి పాదముద్రలను సేకరించేవారు. అయితే ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులు ఉండేవి అని అంచనా. 2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011 లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70 శాతం పైగా మనదేశంలోనే ఉన్నాయి. కొన్నేళ్లలో ఒక్క మధ్య ప్రదేశ్‌లోనే 19 పులులు మృత్యువాత పడ్డాయి. మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా 74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడటానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు.

దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియ జేస్తుంది. ఈ రోజున జంతు సంక్షేమ ప్రచారాలతో పాటు జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశంలో అడవులు అన్యాక్రాంతమవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో ఉండే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగైపోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట సాగుతోంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. ఈరోజును జంతు ప్రేమికుల దినోత్సవంగా కూడా పిలుస్తారు.

# చేనేత కార్మికుల భారీ ధర్నా



విశ్వంభర, రాజన్న సిరిసిల్ల : కాంగ్రెస్ పాలనలో చేనేత కార్మికులు రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా సిరిసిల్ల నేత కార్మికులు ఆందోళనకు దిగారు. ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బీవైనగర్‌లో చేనేత జౌళిశాఖ ఎదుట భారీ ధర్నాచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వం ఎనిమిదేండ్లుగా బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వడం వల్ల వేలాది మంది కార్మికులకు చేతి నిండా పని లభించిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల తయారీ బంద్ చేయడం వల్ల ఉపాధి పనిలేక అనేక కుటుంబాలు పస్తులు ఉంటున్నాయన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధార పడ్డ వేలాది మంది కార్మికుల కుటుంబాలు నేడు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు.కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలని పలుమార్లు కలెక్టర్, మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. వెంటనే యారన్ సబ్సిడీ విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, కూచన శంకర్, మల్లారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన దేవీ నవరాత్రులు



**విశ్వంభర, చింతపల్లి :** దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయదశమి సమీపిస్తుండటంతో దుర్గాదేవి అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీ బాలా త్రిపురసుందరీ దేవిగా గురువారం భక్తులకు దర్శనం ఇచ్చారు. బొమ్మల అలంకరణతో పసి బాలికలా భక్తులకు అమ్మవారు కనిపించారు. శ్రీ దుర్గాదేవి అమ్మవారి దర్శనానికి రోజుకు సుమారు ఐదు వందల మంది భక్తులు దర్శించుకుంటారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు, దుర్గాదేవి కమిటీ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## 6న రంగ్ దే దాండియా నైట్ కార్యక్రమం



**విశ్వంభర, కర్మన్‌ఘాట్:** హైద్రాబాద్‌లో మరోసారి రంగ్ దే దాండియా నైట్ కార్యక్రమం అక్టోబర్ 6వ తేదీన ఆదివారం సాయంత్రం 5 గంటలకు కర్మన్ ఘాట్‌లోని చంద్ర గార్డెన్స్ లో అట్టహాసంగా నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మీడియా సమావేశంలో తెలిపారు. దాండియా నైట్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చని, చిన్న, పెద్ద తేడా లేకుండా అందరు పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభం అయ్యే ఈ నైట్ లో గేమ్స్, డాన్స్ మస్తీ, ఎంటర్టైన్మెంట్ ప్రోగ్రామ్స్, చిల్డ్రన్స్ గేమ్స్, పంజాబీ ధోల్, ఫుడ్ స్టాల్స్, ఫోటో బూత్, సర్ప్రైస్ బహుమతులు, లక్కీ డ్రాలతో మరెన్నో విశేషంగా ఆకట్టుకునే ఎన్నో కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఎంతో అద్భుతంగా దాండియా నైట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని డి. భాను ప్రకాష్, కృష్ణవేణి ఓరుగంటి, ఆర్తం శ్రీవాణి, మహేశ్వరి పాలారపు, కె నగేష్ కుమార్, అభిషేక్ కర్ధ, శ్రీ ధన్య, బాలు ఏర్పాట్లు నిర్వహించనున్నారు.

## త్రిశక్తి దేవాలయంలో భవాని మాల స్వీకరణ



**విశ్వంభర,మెట్‌పల్లి:** పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు 260 మాలాధారణ స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు విధమౌళి శర్మ ఆధ్వర్యంలో మహా గణపతి, మహాలక్ష్మి, మహా దుర్గ, సరస్వతి ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం కుంకుమాభిషేకం కలశ స్థాపన నవగ్రహ స్థాపన కార్యక్రమాలు నిర్వహించి, భవాని మాలధారణ కార్యక్రమం చేపట్టారు.

## చదువుల తల్లికి సన్మానం



**విశ్వంభర, మెట్‌పల్లి:** వేంపేట గ్రామానికి చెందిన మారు రామ్ రెడ్డి కుమార్తె మారు హైందవి ప్రభుత్వ వైద్య కళాశాల మంచిర్యాల లో సీటు సాధించిన సందర్భంగా గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మారం పెల్లి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారు హైందవి మరిన్ని ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేంపేట గ్రామానికి చెందిన అల్లూరి సురేందర్ రెడ్డి, మారు వెంకట్ రెడ్డి, జిల్లా శ్రీనివాస్ తుమ్మల నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జానపద కళాకారుడిని ఆదుకోవాలి



**విశ్వంభర,రామన్నపేట:** ఒకప్పుడు సదాశివ రెడ్డి, సర్వాయి పాపన్న లాంటి కథలను అద్భుతంగా కథాగానం చేసి జనులను ఉర్రూతలూ గించి, ప్రస్తుతం పక్షవాతంతో లేవలేని స్థితి లో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, గ్రామానికి చెందిన జానపద కళాకారుడు కల్లెం సాయులును ప్రభుత్వం ఆదుకోవలసిన అవసరం ఉందని ప్రముఖ సాహితీవేత్త, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్న పేట తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అన్నారు. అనారోగ్య కారణాల తో బాధపడుతున్న సాయులును రామన్నపేటలోని వారి ఇంట్లో ఆయన పరామర్శించారు. సాయులు ఇప్పుడు అనారోగ్య కారణాల వల్ల నిస్సహాయంగా లేవలేని స్థితిలో ఉన్నారని, ఆయనకు వచ్చే వృద్ధాప్య పెన్షన్ కాకుండా కళాకారులకు ఇచ్చే పెన్షన్ సౌకర్యం కల్పిస్తే, కొంతైనా అతని కుటుంబం ఆర్థిక సమస్యల నుండి బయటపడుతుందని అన్నారు. ఇలాంటి అరుదైన కళాకారులను గుర్తించి

## జాతీయ పోలీసు సంక్షేమ సంఘం చైర్మన్ ఎంపిక



**విశ్వంభర, హైద్రాబాద్** :డా.రామ్ తిలక్‌ని జాతీయ పోలీసు సంక్షేమ సంఘం చైర్మన్‌గా నియామకాన్ని ధృవీకరిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రామ్ తిలక్ గతంలో మానవ హక్కుల అవినీతి నిరోధక శాఖ చైర్మన్‌గా, భారత నేపాల్ శాంతి రాయబారిగా సేవలు అందించారు. ఈ సందర్భంగా రామ్ తిలక్ మాట్లాడుతూ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవ చేయడంలో పోలీసులు నిజమైన హీరోలు అనడంలో ఏమాత్రం సందేహం లేదని అన్నారు. దేశంలోని అతిపెద్ద మెట్రోపాలిటన్ పోలీసు బలగాల కుటుంబాల భౌతిక, భావోద్వేగ, మేధోపరమైన, ఆధ్యాత్మిక, ఆర్థిక అవసరాలను తీర్చడం ప్రధాన లక్ష్యంతో ఈ సంస్థ స్థాపించబడింది. వారి విధుల యొక్క కఠినమైన, ఖచ్చితమైన స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, జాతీయ పోలీసు సిబ్బంది మరియు వారి కుటుంబాల మొత్తం శ్రేయస్సు సమాజానికి అప్పగించబడిందని తెలిపారు. తన శక్తి వంచన లేకుండా కృషిచేసి పోలీసులకు వారి కుటుంబ సభ్యులందరికీ శాంతి సామంస్యతకు భంగం కలగకుండా కృషి చేస్తా అన్నారు.

## ఒక్క రైతును కూడా నష్టపోనివ్వం



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలం ఫార్మా సిటీలో భూములు కోల్పోయిన రైతులకు అందరికీ న్యాయం చేస్తామని మరోసారి స్పష్టం చేశారు మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. వీరితో పాటు రావిర్యాల జెన్నాయిగూడ రైతులు సైతం కేవీఆర్‌ను తుక్కుగూడ కార్యాలయంలో కలిశారు. టి జి ఎల్ సి సి అధికారులు స్థానిక నాయకులతో చేర్చించి ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం, గతంలో ఇచ్చిన పట్టాలు అభివృద్ధిపై పేదలకు భరోసా ఇవ్వాలని కోరారు. కందుకూరు మండలం 4 గ్రామాల్లో ఫార్మాలో భూములు కోల్పోయిన వారికి ఫ్లాట్లు, పరిహారం వచ్చేలా చూడాలని దేప భాస్కర్ రెడ్డికి సూచించారు.

## ప్రెస్ క్లబ్ ప్రారంభం

**విశ్వంభర,మహేశ్వరం:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని మహేశ్వరం సీనియర్ జర్నలిస్టు ఒత్తుల రఘుపతి అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యాలయాన్ని తోటిజర్నలిస్టులతో కలిసి మహేశ్వరం సీనియర్ జర్నలిస్టు ఒత్తుల రఘుపతి ప్రారంభించారు. సీనియర్ జర్నలిస్టు రఘుపతి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వనికి తెలియజేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా జర్నలిస్టులు పనిచేయాల్సిన అవసరం ఉందని రఘుపతి అన్నారు. మహేశ్వరం సీనియర్ జర్నలిస్టులు కృష్ణ, జగన్ రెడ్డి, కే రాజ్ కుమార్, గంజి వెంకటేష్, కబీర్, తడక నరసింహ, రాజేశ్వరి, చంద్రశేఖర్, పాల కుర్ల వెంకటేష్, నాగేష్, రాము, శేఖర్, శివ, రాజేష్, శ్రీను, బంటు వెంకటేష్, ప్రభాకర్, భాస్కర్, బీమ్ లాల్, కర్ణాకర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మర్రి వెంకటమ్మకి కే ఎల్ ఆర్ ఘన నివాళి

**విశ్వంభర, మహేశ్వరం** : కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మర్రి హనుమంతరెడ్డి తల్లి వెంకటమ్మ చిత్ర పటానికి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి నివాళి అర్పించారు. నాదర్ గుల్ తోట యట్టారెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన దశదిన కర్మలో కాంగ్రెస్ నాయకులతో కలిసి కే ఎల్ ఆర్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మర్రి లింగారెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు.

## కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

**విశ్వంభర, ఎల్బీనగర్:** చైతన్యపురి డివిజన్లోని పెయింటర్స్ అడ్డా మీద భవన నిర్మాణ కార్మిక యూనియన్ , సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక సంఘాల అంతర్జాతీయ కార్యచరణ దినోత్సవం నిరసన జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సరూర్ నగర్ సర్కిల్ సిఐటియు మల్లెపాక వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు వచ్చిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం పై దోపిడీ తీవ్రతరమైందని అన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కోవడంలో కార్మిక వర్గము మిలిటెంట్ పోరాటాల నిర్వహించారని అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా పాలకవర్గాలు కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తే చట్టాలను రద్దు చేయాలని పోరాటాలని ఉధృతం చేసింది. పెట్టుబడిదారి వర్గము వరస సంక్షోభాలతో కొత్త మార్కెట్ కొరకు సామ్రాజ్యవాద దేశాల మధ్యన తీవ్రమైన పోటీ ఏర్పడింది. వారి పోటీని తట్టుకొనుటకు మార్కెట్ కొరకు దేశాల మధ్యన యుద్ధాలు సృష్టిస్తున్నది అని అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ పెయింటర్ అడ్డా భవన నిర్మాణ కార్మిక యూనియన్ సిఐటియు నాయకులు సిహెచ్ వెంకన్న, డి మల్లేష్, ది వీరేష్, పి పాండు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం స్థానిక అంగడి బజార్‌లోని హనుమాన్ దేవాలయంలో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను పూజించి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ కోలాటాల మధ్య ఊరేగింపుగా సముద్రం చెరువులో నిమజ్జనం చేశారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించాలి



**విశ్వంభర, మేడ్చల్ జిల్లా/:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మేయర్ తోటకూర అజయ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం నాడు ముఖ్యమంత్రి నివాసంలో శాసన మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డిలతో కలిసి బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం కావాల్సిన నిధులను మంజూరు చేయాలని కోరారు. బోడుప్పల్ కార్పొరేషన్ లో ప్రధాన సమస్యలైన ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టును పూర్తి చేసి ముంపు ప్రాంతాల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.అదే విధంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దళితులకు చెందిన అసైండ్ భూములకు పరిష్కారం చూపి వారికి న్యాయం చేసేలా చోరవ చూపాలని కోరినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా బోడుప్పల్ పది వేల కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన వక్ఫ్ భూమి సమస్యకు పరిష్కారం చూపి అక్కడి ప్రజలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

## టీఎంటీయూ కార్యవర్గం ఎన్నిక



**విశ్వంభర, మహబూబాబాద్:** గాల్ రెడ్డి హర్షవ ర్ధన్ రెడ్డి నాయకత్వంలో గార్లపాటి ఉమాకర్ రెడ్డి, డా,పర్వతి సత్యనారాయణ నేతృత్వంలో నిర్వహించబడుతున్నపిఆర్టియూ –తెలంగాణకు అను బంధంగా తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యా యుల ఐక్యతతో ఆవిర్భవించిన తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్( టిఎంటియూ) సంఘ మహబుబాబాద్ జిల్లా శాఖ సక్రం రాథోడ్ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో జిల్లా శాఖ కార్యవర్గ సభ్యలను నియమించారు. తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా నెల్లికుదురు మోడల్ స్కూల్లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న తుమ్మ సతీష్, ప్రధాన కార్యదర్శిగా నరసింహుల పేట మోడల్ స్కూల్ లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న లూనావత శంకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులుగా అంజన్ సుల్తానా, మహిళా సెక్రెటరీగా జయ రేఖ, అసోసియేట్ ప్రెసిడెంట్ గా కిరణ్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, జిల్లా సెక్రెటరీగా ఫిలిప్, గోపాల్ రావు, యాకూబ్ అలీ గోవిందరావు, బాబురావుల నియమించారు.

## అన్ని గ్రామాలకు త్రాగు నీటిని అందించాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా గడపగడపకు మంచినీటిని సరఫరా చేస్తున్నామని ప్రకటించిన ప్రభుత్వం ఎక్కడ కూడా నీళ్లు సక్రమంగా సరఫరా చేయడం లేదు, కొన్ని గ్రామాలలో పైప్ లైన్ కూడా సరిగా వెయ్యలేదు, కొన్ని గ్రామాలలో ఇంకా వాటర్ ట్యాంకులు కూడా నిర్మించలేదు. కావున అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా త్రాగు నీటిను అందించాలని, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు రాపోలు రమేష్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ద్వారా మంచి నీటిని అన్ని గ్రామాలకు అందించాలని రామన్నపేట ఎంపీడీవో భూక్య యాకూబ్ నాయక్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ పరిధిలో గ్రీన్ హిల్స్ కాలనీ కమ్యూనిటీ హాల్ లోని పగిళ్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కిచెన్న గారి లక్ష్మారెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, గోవర్ధన్ రెడ్డి,తలాటి రమేష్ నేత, లింగ స్వామి గౌడ్, బొక్క భూపాల్ రెడ్డి, రాజు నాయక్,శివ, విప్లవ రెడ్డి, ఆనంద్, నగేష్, దయాకర్ రెడ్డి, సతీష్ గౌడ్, పుష్పలత, శైలజ రెడ్డి, ఊర్మిల, పాల్గొనాలి.

## వెంటమ రాజు సుదర్శన్ రావు పుస్తక ఆవిష్కరణ



**విశ్వంభర ,ఎల్బీనగర్:** స్వాతంత్ర సమరయోధులు పెంటమ రాజు సుదర్శన్ రావు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం పి.యస్. నారాయణ విశ్రాంత న్యాయమూర్తి చేతుల మీదుగా గాంధీ స్మారక భవనం సుల్తాన్ బజార్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర స్మారక నిది ప్రెసిడెంటు భూదానం సుబ్బా రావు, ప్రముఖ కవి కసిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ ఎం.ఎల్.ఏ చందా లింగయ్య, డాక్టర్ లయన్, ఛైర్మెన్ యస్. యస్ ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ఎస్. రామచంద్రరావు ,ప్రొఫెసర్ సుబ్రమణ్యం, కోదాటి రంగారావు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్, పలిమెల మండలాల్లోని వివిధ గ్రామాల్లో తెలంగాణకే ప్రత్యేకమైన బతుకమ్మ సంబరాలను బుధవారం నుండి ప్రారంభమయ్యాయి. ప్రకృతి మాత ప్రసాదించిన పువ్వులనే పూజించే తెలంగాణ సాంప్రదాయం ఈ బతుకమ్మ పండుగ అని అన్నారు.

## మార్కండేయ దేవాలయంలో దేవి శరన్నవరాత్రులు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని మార్కండేయ దేవస్థానంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీ బాలత్రిపుర సుందరిదేవి అవతారం ఎరుపు రంగు చీరలో దర్శనం ఇచ్చిన అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పద్మశాలి సంఘం సభ్యులు మొదటి రోజు పూజ కార్యక్రమం నిర్వహించారు. హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగల్లో దసరా ఒకటి. విజయ దశమి, దసరాగా పిలవబడే ఈ పర్వదినం ముందు తొమ్మిది రాత్రులు దేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. శరన్న వరాత్రుల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో రూపంలో అలంకరించి పూజిస్తారు. దశమి రోజున రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిస్తారని ఆలయ పూజారి చెరుకు శివ తెలియజేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు బాలకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి శివలింగం, కోశాధికారి సత్య రాములు, ఎంగలి రఘు, అప్పం శీను, ఎంగలి రమేష్,భాస్కర్ యువజన సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

## రాపల్లికోటలో పోలీసుల తనిఖీలు



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** మహాదేవపూర్ మండలం రాపల్లికోట గ్రామంలో గురువారం ఎస్ఐ పవన్ కుమార్, కాళేశ్వరం ఎస్ఐ చక్రపాణి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాపల్లికోట గ్రామంలో ఇంటింటా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. వారి ఇళ్లల్లో గల వాహనాలను తనిఖీ చేసి వాటి పత్రాలను పరిశీలించారు.నెంబరు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. గ్రామంలోని ప్రధాని కూడలి వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి చట్ట విరుద్ధమైన పనులకు చోటు ఇవ్వద్దని, నిషేధిత గుడుంబా ఎవరు అమ్మొద్దని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజే యాలని కోరారు. మహాదేవపూర్ కానిస్టేబుల్ కిషన్, తిరుపతి, అనంత్, చంద్రమోహన్, హోంగార్డ్ మట్టి బాబు, భూపాలపల్లి జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళం పాల్గొన్నారు.

## మస్జీద్ ఎన్నికల తేదీని ప్రకటించాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** జామియా మస్జీద్ ఎన్నికల తేదీని ప్రకటించాలని కోరుతూ గురువారం అమనగల్లు ముస్లిం నాయకులు జామియ మస్జీద్ ఇమామ్ అబ్దుల్ వాహేద్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ జామియా మస్జీద్ పాత కమిటీ సమయం పూర్తయినా సందర్భంగా నూతన కమిటీ కొరకు ఎన్నికల తేదీని ప్రకటించాలని వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఖలీల్, మహ్మద్ అల్తాఫ్, మహ్మద్ మహబూబ్,సయ్యద్ షరీఫ్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ ఫారుక్, మహ్మద్ రఫిక్,అబ్దుల్ కలీమ్,యంఏ అజీమ్, మహ్మద్ హనీఫ్,అక్బర్,అప్సర్,యంఏ హాఫిజ్, అసద్, అహ్మద్, అక్బర్, ముసా,ముస్తఫా,తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా



**విశ్వంభర, మహబూబాబాద్** : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా అక్టోబర్ 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు గార్ల, బయ్యారం సీఐ బి రవి నాయక్ వెల్లడించారు. ఏజెన్సీ యువత జాబ్ మేళా అవకాశాన్ని వినియోగించుకుని, ఉద్యోగులుగా మారాలన్న కాంక్షతో జిల్లా ఎస్పీ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. అర్హతలు, ఆసక్తిగల అభ్యర్థులు గార్ల, బయ్యారం పోలీస్ స్టేషన్ లలో పేర్లను నమోదు చేసుకోవాలని, నమోదు అభ్యర్థులకు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు.

## ఆమనగల్లులో డిజిటల్ సర్వే



**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేటి నుండి ఏడో తారీఖు వరకు ఐదు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి వన్ కార్డు వన్ స్టేట్ అనే డిజిటల్ కార్డు సర్వే కొనసాగుతుంది. ఇదే నేపద్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల్లు 10 వ వార్డు విటాయిపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసి సర్వేను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం ప్రారంభించారని ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ లోని 10వ వార్డు విటాయిపల్లి లో రోజుకు 50 కుటుంబాల చొప్పున సర్వే చేసుకునేందుకు ప్రణాళిక చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వసంత, ఎమ్మార్వో లలిత, సర్వే అధికారులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, ఖాదర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉద్యమించాలి




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న ఆదాని అంబూజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పరిశ్రమ నిర్మిస్తే ఉపేక్షించేది లేదని, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సింగిరెడ్డి మల్లారెడ్డి, టిఆర్ఎస్ మండల కార్యదర్శి పోచబోయిన మల్లేశం, బిజెపి మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ అన్నారు. రామన్నపేట మండల కేంద్రంలో అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం జల్లెల పెంటయ్య అధ్యక్షతన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీలు పాల్గొని మాట్లాడుతూ, రామన్నపేట మండలంలోని గ్రామాలను, వాటి పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని ధ్వంసం చేసే ఆదాని అంబుజా సిమెంటు పరిశ్రమను అన్ని గ్రామాల్లోని ప్రజలు ప్రతిఘటించాలని, ఇప్పటికే మూసీ కాలుష్యంతో ప్రజారోగ్యం దెబ్బతింటున్న తరుణంలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయడంతో, భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, పర్యావరణం ధ్వంసం అవుతుందని అన్నారు. పరిశ్రమ ఏర్పాటు ఆలోచన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మేక అశోక్ రెడ్డి, టిడిపి నాయకులు ఫజల్, బీఎస్పీ నాయకులు గూని రాజు, డి.ఎస్.పి నాయకులు నకిరెకంటి నరేందర్, మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృద్విరాజ్, సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, అఖిలపక్షాల నాయకులు, జమీరుద్దీన్, అప్పం లక్ష్మీనర్సు, మేడి రవిచంద్ర, మామిడి వెంకటరెడ్డి, కందుల హనుమంతు, ఎండి రెహాన్, పోచబోయిన మల్లేశం, పున్న వెంకటేశం, బాలరాజు, భాస్కర్, లెనిన్ పాల్గొన్నారు.

## బాలా త్రిపురసుందరి దేవిగా అమ్మవారి దర్శనం



**విశ్వంభర, షాద్‌నగర్:** దసరా నవరాత్రులలో భాగంగా గురువారం మున్సిపాలిటీ 8వ వార్డు, ఆర్టీసీ కాలనీలో దుర్గామాతను ప్రతిష్టించారు. తొలి రోజు బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ప్రకాష్ చారీ, పరమేష్, జయ ప్రకాష్, నారాయణ అమ్మవారికి పూజలు నిర్వహించారు.

## డ్రైనేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి



**విశ్వంభర, సరూర్ నగర్:** ప్రజలకు అసౌకర్యం కలగకుండా డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం డాక్టర్స్ కాలనీ రోడ్డునెంబర్ 4లో సెవరేజ్ బోర్డు, డ్రైనేజీ లైన్ పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ ఉపాధ్యక్షులు జనార్దన్ రెడ్డి, సూర్యనారాయణ, ఆచార్యులు, ఉమాపతీ, సత్యనారాయణ, అధికారులు ప్రవీణ్, సూపర్ సూపర్ వైజర్ శంకర్‌లు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కారం చేస్తా

### ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** పూలు, పండ్లు వ్యాపారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం వనస్థలిపురం రైతు బజార్ దగ్గర పూలు,పండ్లు తదితర వ్యాపారం చేసుకునే వర్తకులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని వారి ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మేము దాదాపు 30 సంవత్సరాలుగా అక్కడే వ్యాపారం చేసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. మూడు రోజుల క్రితం అధికారులు వచ్చి మా షాప్ లు కులగొట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మా డబ్బాలు, షాప్ లు, తోపుడుబండ్లు కులగొట్టడం జరిగిందని రోదిస్తూ సుధీర్ రెడ్డిని విన్నపించుకున్నారు. ఇప్పుడు మా బతుకులు రోడ్డు మీద పడ్డాయి. మాకు న్యాయం చేయండి అని కోరారు. మీరు లేని సమయంలో మాకు అన్యాయం జరిగిందని గోడు వెళ్ళబుచ్చుకున్నారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని పలకరిస్తూ నేను గత మూడు నెలల నుంచి అస్వస్థతకు గురై హాస్పిటల్ నందు చేరిక కావడం వల్ల నియోజకవర్గనికి రాలేక పోవడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, చిరంజీవి, సత్తిరెడ్డి, ముద్దగోని సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధితో ఎదగాలి



**విశ్వంభర, ఆమనగల్లు :** ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకుండా స్వయం ఉపాధి వైపు యువత ఆసక్తి కనబర్చడం హర్షణీయమని కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం అమనగల్లు మండలం మేడిగడ్డ తాండ గేటు సమీపంలో శ్రీశైలం, హైదరాబాద్ జాతీయ రహదారి హైవే ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ దాబా ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మేడిగడ్డ తాండ యువకులు, విజయ్ రాథోడ్, రమేష్, సాయి కుమార్, తావుర్య, హర్యా, నరేష్, మల్లేష్, సిద్ధు, సీతారాం, జైరాం, రాజ్ కుమార్, రాజ, సోంల్ల, పవన్, శంకర్, రఘు, సికిందర్, పాల్గొన్నారు.

## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ ద్విశక్తి ఆలయంలో మొదటిరోజు శైలపుత్రి దేవి భువనేశ్వరి అలంకరణలో గురువారం అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు. విజయదశమి వరకు అమ్మవారు తొమ్మిది రూపాలతో భక్తులకు దర్శనమిస్తుందని ఆలయ పూజారులు తెలియజేశారు. ఆలయధర్మకర్త ఆకిటి సుధాకర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** గ్రామాలలో ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డి ఆర్ డి ఓ పిడి శ్రీనివాస్ అన్నారు. పెద్ద శంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ టిఏ లు ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే సంవత్సరానికి గాను గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులను ప్రణాళిక రూపంలో తయారు చేసుకోవాలన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ ద్వారా హార్టికల్చర్ అగ్రి ఇతర పనులను చేపట్టాలన్నారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

## వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో హెూమం



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం శరన్నవరాత్రుల సందర్భంగా మొదటిరోజు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. అధ్యక్షుడు వీరబ్రహ్మ రామ్మోహన్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి హెూమ కార్యక్రమంలో బికుమాండ్ల రమేష్, వాసవి నరసింహ, సుజాత దంపతులతో పూజారులు సీనయ్య శర్మ, దినేష్‌శర్మ నిర్వహించారు. బిక్కుమాండ్ల శ్రీనివాస్, అర్థం లక్ష్మయ్య,కొరివిరమేష్,తేజ,మణికంఠ,సిద్ధు,నటరాజ్, యాదయ్య, సామలవెంకటేష్,పెండ్యాలనాగరాజు,కండేలింగయ్య, పాల్గొన్నారు.

## క్రైస్తవులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



**విశ్వంభర, బషీర్ బాగ్:** క్రైస్తవులపై దాడులు చేసిన హిందూ వాహిని కార్యకర్తలను అరెస్టు చేయాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరి రక్షణ సమితి అధ్యక్షులు జెరుషలేము మత్తయ్య డిమాండ్ చేశారు. గత నెల 28న ఇబ్రాహీంపట్నంలో క్రిస్టియన్ ఎడ్యుకేషనల్ కౌన్సిలింగ్ సెంటర్ పై హిందూ మతోన్మాదుల దాడిని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఐఎఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ తదితర ఉన్నత పదవుల కోసం కెరీర్ గైడెన్స్ ఇస్తూ, విద్యతో పాటు క్రమశిక్షణ, మానసిక, ఆధ్యాత్మిక మెడిటేషన్ గురించి అవగాహన సదస్సులు నిర్వహించి, వారి భవిష్యత్తు కొరకు పనిచేస్తున్న సంస్థపై మత ప్రచారం చేస్తున్నారని హిందూ వాహిని, విశ్వ హిందు పరిషత్ చేస్తున్న ఆరోపణలు పలు క్రైస్తవ సంఘాల నాయకులం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సంఘటన జరిగి 5 రోజులు అవుతున్నా పోలీసులు కేసు నమోదు చేయకుండా బాధితులపై కౌంటర్ కేసు పెడతానని బెదిరిస్తూ రాజీ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. పలు క్రైస్తవ సంఘాల డిమాండ్ తో గురువారం ప్రభుత్వ హాస్పిటల్ లో పరిక్షలకు పంపడం విచారకరం అని జెరుషలేము మత్తయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాపల్లికోటలో కార్డెన్ సెర్చ్



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం రాపల్లికోట గ్రామంలో గురువారం మహదేవపూర్ ఎస్సై కే. పవన్ కుమార్, కాళేశ్వరం ఎస్ఐ చక్రపాణిల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రాపల్లికోట గ్రామంలో ఇంటింటా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఇళ్లల్లో గల వాహనాలను తనిఖీ చేసి వాటి పత్రాలను పరిశీలించారు. నెంబరు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాని కూడలి వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎస్సై కే. పవన్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి చట్ట విరుద్ధమైన కార్యక్రమాలకు, పనులకు చోటు ఇవ్వద్దని, నిషేధిత గుడుంబా ఎవరు అమ్మొద్దని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. యువత బాగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆశించారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్న పోలీసులకు తెలపాలని సూచించారు. ఇంకా సీసీ కెమెరాలు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ కానిస్టేబుల్ కిషన్, తిరుపతి, అనంత్, చంద్రమోహన్, హెూంగార్డ్ మట్టి బాబు, భూపాలపల్లి జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులు, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళం పాల్గొన్నారు.

## పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ పథకం



**విశ్వంభర, నారాయణఖేడ్:** ఎమ్మెల్యే సంజీవ రెడ్డి పేదలకు సీఎంఆర్ ఎఫ్ పథకం వరం లాంటిదని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం అర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని ముఖ్యంగా విద్య వైద్య రంగాన్ని పటిష్టపరుస్తూ ప్రజలకు అందుబాటులోకి నాణ్యమైన వైద్యం అందించాలని ఆసుపత్రులను ఆధునికరించారని అన్నారు.

## వైభవంగా దేవి ఉత్సవాలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేటలోని దుర్గాభవాని మందిరంలో భవాని మాత ఆలయంలో గడికోటలో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా దేవాలయాలలో అమ్మవారిని అలంకరించడంతో పాటు అభిషేకాలు పూజలు నిర్వహిస్తున్నారు. గడికోటలో తిరుమలాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ్ సేన, గంగపుత్ర యూత్, అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా చేపట్టారు.

## ఘనంగా దేవి నవరాత్రులు ప్రారంభం



**విశ్వంభర,మూసాపేట:** మూసాపేట మండలంలోని ఆయా గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ట చేశారు. మూసాపేట సంకల మద్ది వేముల జాలంపేట చక్రాపూర్ పోల్కంపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జానంపేటలో గ్రామానికి చెందిన శ్రీనివాసులు విగ్రహాదాత అమ్మవారిని అందించారు. గ్రామస్తులు ఆయనను అభినందించారు.

## దేవి నవరాత్రులు ప్రారంభం

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవములు గణపతి పూజతో ప్రారంభం చేశారు. నవగ్రహ, రుద్ర, చండీ హెూమం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.మారుతీ, సూపరిం టెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీధర్మకర్త అశోక్, మాజీ సర్పంచ్ మాధవి, కాళేశ్వరం గ్రామస్తులు, దేవస్థానం సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## కుల సంఘాలకు ప్రభుత్వం అండ



**విశ్వంభర,కల్వకుర్తి:** కుల సంఘాలకు కాంగ్రెస్ పాలనలోనే ఆత్మగౌరవం దక్కిందని మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ అన్నారు. గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణంలోని 24 కుల సంఘాల భవనాలకు కాంపౌండ్ వాల్, సిసి రోడ్, పనులకు ప్రొసీడింగ్స్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి (ఎస్‌డిఎఫ్) స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద పట్టణంలోని 24 కుల సంఘాలకు వివిధ పనుల అభివృద్ధి కోసం 107 లక్షల రూపాయలను నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు.

## నేటి యువత సేవా గుణం కలిగి ఉండాలి

**విశ్వంభర,షాద్ నగర్:** నేటి యువత సామాజిక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్య యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామంలో గ్రామ యువ నాయకులు కానం ప్రేమ్ కుమార్ గౌడ్ దసరా కానుకగా చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు అందజేశారు. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ నేటి యువత తన సంపాదనలో కొంత మేర సామజిక కార్యక్రమాలకు వెచ్చించాలని సూచించారు. కానం ప్రేమ్ కుమార్ గౌడ్ చేస్తున్నా సేవ కార్యక్రమాలను అభినందించారు.

## ప్రత్యేక బృందాల సర్వే



**విశ్వంభర, మహబూబాబాద్ :** పట్టణంలోని రజాల్ పెట్, సలార్ తండాలలో జరుగుతున్న డిజిటల్ ఫ్యామిలీ సర్వేను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు. పట్టణంలోని 14, వార్డులలో డిజిటల్ సర్వే చేపట్టారు. ఇంటింటికి తిరిగి ప్రత్యేక బృందాలు సర్వే నిర్వహించడం జరుగుతుందని, ఒకరికి ఒక డిజిటల్ ఐడి, మొత్తం ఫ్యామిలీకి డిజిటల్ ఐడి ద్వారా పూర్తిగా డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వ హించాలని సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారులను ,ప్రత్యేక బృందాలను కలెక్టర్ ఆదేశించారు.

## సివిల్ సప్లై గోదాం తనిఖీ



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** మండల కేంద్రమైన పెద్ద శంకరంపేట లోని సివిల్ సప్లై గోదాంను గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖ డిఎం హరికృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలోని స్టాకు వివరాలు, రేషన్ షాపులకు బియ్యం సరఫరాను ఆయన పరిశీలించారు. గోదాం నిర్వాణ తీరు పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట గోదాం ఇన్చార్జి దత్తా రెడ్డి ఉన్నారు.

## కేటీఆర్‌పై ఆరోపణలను వెనక్కి తీసుకోవాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువ నగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామంలో బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షురాలు నాయిని శశికళ నర్సింహారెడ్డి నివాస గృహం లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మచ్చలేని నాయకుడు మాజీ మంత్రి కేటిఆర్ అని అన్నారు. అధికారంలో ఉన్నామని ఏది మాట్లాడిన చెల్లుబాటు అయితుంది అని మాట్లాడితే ఊరుకునేది లేదు అని అన్నారు . కేటిఆర్ పై చేసిన ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోని మాజీ మంత్రి కేటిఆర్ కి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## కూరెళ్ళ పంచాయతీకి ఫ్రీజర్ బహూకరణ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ళ గ్రామంలో చనిపోయిన వ్యక్తులను దహన సంస్కారాలు ఆలస్యం అయిన వ్యక్తుల శవం పాడవకుండా భద్రపరచడానికి శవ పేటికను ప్రజల సౌకర్యార్థం కోసం కీర్తిశేషులు ఇరుకుల్లా రామలింగయ్య జ్ఞాపకార్థం కోసం వారి కుమారులు ఇరుకుల్ల వెంకన్న గుప్తా, శ్రీనివాస్ గుప్తా, రాంబాబు గుప్తాలు గ్రామపంచాయతీకి శవ పేటికను గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## బునాదిగాని కాలువ పనులను పూర్తి చేయాలి



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** బునాదిగాని కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేసింది. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐదు మండలాల కార్యదర్శుల, జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశంలో సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు(ఎం) మండలం,మోత్కూరు, మోటకొండూరు,వలిగొండ, అడ్డగూడూరు మండలాల్లో బునాది కాల్వ పనుల ద్వారా త్రాగు సాగునీరు అందేలా బునాదికాలువలో పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఆనాడు రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2005లో వారు ప్రారంభి%శీ%చి కాల్వ ఎస్టిమేషన్ ప్రకారం14 కోట్లు కేటాయించినారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడినంక రీ ఎస్టిమేషన్ వేసి 71 కోట్లు ప్రకటించి అందులో 31 కోట్లు విడుదల చేసినారు అందుకు పూర్తి కాకుండా నిలిచిపోయింది బునాది కాలువ పనులకు 269 కోట్ల నిధులతో పనులు పూర్తికావని, 400 కోట్ల వరకు బునాది కాల్వ పనులకు నిధులు పెంచాలని కోరారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట



**విశ్వంభర, వర్ధన్నపేట :** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామంలో సుమారు 2కోట్లతో నిర్మించిన సొసైటీ భవనం, గోదాం ప్రారంభోత్సవం, 12కోట్ల 43లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లతో కలిసి వరంగల్ ఎంపీ డా. కావ్య పాల్గొన్నారు. ఆపేక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి, డీఆర్ డీవో కౌసల్య, డిసివో నీరజ, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ ఆంగోత్ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్ నగర్ నూతన అధ్యక్షునిగా భూపతి సారయ్య



విశ్వంభర, మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13 డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీ నూతన అధ్యక్షుడిగా భూపతి సారయ్యను ఎన్నుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫెడరేషన్ చైర్మన్ రాపోలురాములు ఆదేశానుసారం 13వ డివిజన్ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి ఆధ్వర్యంలో నూతన అధ్యక్ష కార్యదర్శులను కాలనీవాసులు అంతా కలిసి ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలలో జనరల్ సెక్రటరీగా ఎండి. గఫర్, ఉపాధ్యక్షులుగా ఇరుగల్లా ముత్యాలు, ట్రెజరర్‌గా వరికుప్పల వెంకటేష్, బొక్కి దుర్గయ్యను ఎన్నుకున్నారు. కార్పొరేటర్ భూపతి సారయ్యను సాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గౌతమ్ నగర్ కాలనీ బిక్షపతి, అంజి, సాయిలు, డిసిఎం అంజన్న, వెంకటేష్ ,దేవేందర్ నగర్ కాలనీ పేస్–2 మాజీ అధ్యక్షులు బైరవకొండ మల్లేష్, మాజీ ప్రధాన కార్యదర్శి చిన్నం గణేష్, డివిజన్ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ బూసి భగవంతు, కాలనీ మాజీ ఉపాధ్యక్షులు బైరుగొండ భూపాల్, మాజీ జనరల్ సెక్రెటరీ నరసింహ చారి, ఇంద్రాల వెంకటేష్, నాగరాజు కురాకుల రాజు, హరిబాబు, కాలనీ పెద్ద మేతరి మాచర్ల రాజు ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పాలలాంటి మంజీరా నీళ్లల్లో విషపు చుక్కలు కలుపుతారా?



## న్యాల్‌కల్‌లో ఫార్మాసిటీ ఏర్పాటుపై హరీశ్ రావు మండిపాటు

**విశ్వంభర, సంగారెడ్డి :** జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని న్యాల్ కల్‌లో ఫార్మా సిటీ ఏర్పాటు చేసి పాలలాంటి మంజీరా నీళ్లల్లో విషపు చుక్కలు కలుపుతారా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. న్యాల్ కల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో హరీశ్ రావు పాల్గొని ప్రసంగించారు. న్యాల్కల్‌లో ఫార్మా సిటీ పేరిట 2 వేల ఎకరాలు గుంజుకుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హరీశ్‌రావు హెచ్చరించారు. జేసీబీ, పొక్లెయిన్ వస్తే మీ ఎమ్మెల్యే, నేను అడ్డం పడతాం. మా మీద ఎక్కినంకనే మీ వద్దకు అవి రావాలి. మీ కోసం గ్రీన్ ట్రిబ్యునల్, హై కోర్టులో కేసు వేస్తాం. ఇక్కడి భూమిని పోనివ్వం. ఒక్క మాట మీద ఉండండి. ఎవ రు..ఎట్లా వస్తారో చూస్తా అని పేర్కొన్నారు. కోహీర్ జామకా యలు, దపూరు పుదీనాకు ఫేమస్.. ఇలాంటి భూములను నాశ నం చేసే రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలి. ఇక్కడి భూముల్లో ఫార్మా చిచ్చు పెట్టకు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల భూములు లాక్కోవడమా..? ఫార్మా సిటీ పెట్టి మంజీరను నాశనం చేస్తా వా..? ఫార్మా సిటీతో ఇక్కడి నాలుగు వాగులు, పెద్ద వాగు, చెరు వులు, మంజీర కలుషితం అవుతాయి. మెదక్, హైద్రాబాద్ ప్రజలకు కలుషిత నీరు అందిస్తారా? అని రేవంత్‌ను హరీశ్‌రావు నిలదీశారు. భూములు లాక్కోనేందుకు చీకట్లో సంత కాలు పెట్టిస్తారు. జాగ్రత్తగా ఉండండి.. మోస పోకండి. ఎవరు ఏడవకండి మీకోసం మేం కొట్లాడుతం. మీరు ఐక్యంగా ఉండం డి, మీకు అండగా ఉంటాం. రాళ్లు, రప్పలు ఉన్న భూముల్లో ఫ్యాక్టరీలు పెట్టండి. ఇక్కడ కాదు. నేను, మాణిక్ రావు ఇక్కడే ఉంటాం.. ఇక్కడే పడుకుంటాం జేసీబీలకు అడ్డంగా ఉంటాం. డూప్లికేట్ ఇందిరమ్మ రాజ్యం ఇది. సీఎం కావాలని అన్ని పార్టీలు మారి కాంగ్రెస్‌లోకి జంప్ అయిండు. ఎవరన్నా వస్తే ఒక్క ఫోన్ చేయండి.. రెండు గంటల్లో వస్తాం. తాత తండ్రికి ఇచ్చిన భూమి మీరు మీ పిల్లలకు ఇవ్వాలి. రేవంత్ రెడ్డి గద్దలా తన్నుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

## మంత్రి శ్రీధర్ బాబు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణ రెడ్డి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మంథని శాసనసభ్యులు, మంత్రి శ్రీధర్ బాబు నా మీద కుట్రపూరితంగా, కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని అన్నారు. రాజకీయ విమర్శలు స్వీకరించలేక, అధికారాన్ని అడ్డు పెట్టుకొని మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ పార్టీ పక్షాన ప్రశ్నిస్తే కేసులుపెడతారా..? అని ప్రశ్నించారు. మంత్రి నా మీద ఇప్పటికి 4 కేసులు పెట్టించాడని చల్లా నారాయణ రెడ్డి తెలిపారు. సొంత మండలం అయిన కాటారం మండల కేంద్రంలో, మహాదేవపూర్ మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, మార్చురీ గది కట్టించమని అడిగితే పట్టించుకోరని అన్నారు. కాటారంలో హాస్పిటల్ ఉన్న సరైన వైద్య సిబ్బంది లేక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. హైదరాబాద్ మూసి నది ప్రక్షాళన అంటున్నవ్, మంథని నియోజకవర్గాన్ని ప్రక్షాళన చేయండి శ్రీధర్ బాబు అని అన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టించే సంస్కృతీ మానేసి అభివృద్ధి చేయండి.మేము కేసులకు భయపడేది లేదు. మీరు వంద కేసులు పెట్టిన భయపడేది లేదు అన్నారు.ఈ కార్యక్రమంలో కాటారం మండల అధ్యక్షులు బండం మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు బొమ్మన భాస్కర్ రెడ్డి, మండల ఇంచార్జి సంపత్ రెడ్డి, డోలి అర్జయ్య, రాజు యాదవ్, బీజేపీ నాయకులు ఉన్నారు.

## ఫాంహౌస్‌లు ఎక్కడున్నాయో బయటపెట్టాలి



**విశ్వంభర,బడంగ్‌పేట్ :** అక్రమంగా నిర్మించిన సబిత ఇంద్రారెడ్డి ఫాం హౌస్ ను కూల్చాలా అన్న సీఎం రేవంత్ రెడ్డికి ఇ వేదిక గా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కౌంటర్ ఇచ్చారు. తన అబ్బాయి కడుతున్న ఇల్లు మినహాయించి 3 ఫాం హౌస్ లు ఎక్కడున్నాయో ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎన్ని రకాలుగా వ్యక్తి గతంగా టార్గెట్ చేసిన ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటాను.

## డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించిన కలెక్టర్



**విశ్వంభర, భూపాలపల్లి:** డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం గణపురం మండలం బుర్రకాయలగూడెంలో జరుగుతున్న డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు, గణపురం మండలంలోని బుర్రకాయలగూడెం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో జరుగుతున్న సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారిగా ఆర్డీఓ మంగిలాల్ ను నియమించామని తెలిపారు. మున్సిపల్, బుర్రకాయలగూడెంలలో జరుగుతున్న సర్వే ప్రక్రియకు రెండు టీములు ఏర్పాటు చేశామని, ప్రతి టీముకు ముగ్గురు సిబ్బందిని నియమించి నట్లు తెలిపారు. అవసరం మేరకు సర్వేకు అదనపు టీములు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ పద్ధతిన అమలు చేయనున్న కుటుంబానికి డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియలో కుటుంబం యొక్క సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు. ప్రతి ఒక్క కుటుంబం వివరాలు డిజిటల్ కార్డు సర్వేలో తప్పకుండానమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సర్వేకు కావలసిన నోడల్ అధికారి బృందాల పనితీరును పర్యవేక్షణ చేయాలని అన్నారు. కుటుంబ గుర్తింపు కోసమే ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందని, దీనిలో భాగంగా కుటుంబంలో ఎంత మంది ఉన్నారు, వారి సమగ్ర వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఒక రాష్ట్రం ఒక కార్డు ద్వారా ప్రతి కుటుంబానికి రాష్ట్రంలో ఒక గుర్తింపు ఉంటుందని తెలిపారు. కుటుంబంలోని ఎక్కువ వయసు కలిగిన మహిళలు కుటుంబ పెద్దగా ఉంటారని అన్నారు. దీంతో పాటు ఇతర కుటుంబ సభ్యులకు కూడా గుర్తింపు సంఖ్య ఉంటుందని తెలిపారు. కుటుంబ వివరాలతో పాటు కొత్తగా కుటుంబంలోకి వచ్చిన వారు, జన్మించిన పిల్లల వివరాలను పొందుపరచడంతో పాటు చనిపోయిన, వివాహం చేసుకొని వెళ్లిన వారి వివరాలను తొలగించాలని అన్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో గ్రూప్ పరిధిలోని కుటుంబాల సంఖ్య ఆధారంగా ఫోటోలు తీయాలని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఐదు రోజుల్లో కుటుంబ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే బృందాలకు కుటుంబం యొక్క సమగ్ర వివరాలు అందచేయాలని సర్వే ప్రకీయకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ సూచించారు.నోడల్ అధికారి ఆర్డిఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ



**విశ్వంభర, మహబూబాబాద్:** నర్సింహుల పేట మండల కేంద్రంలో బతుకమ్మ విగ్రహాన్ని భూపాల్ నాయక్ ఆవిష్కరించారు. మండలం కేంద్రంలో కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్ స్వంత ఖర్చుతో ఏర్పాటుచేసిన బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నఆయన మాట్లాడుతూ నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులందరూ ఎంతో సంబురంగా జరుపుకునే బతుకమ్మ పండగ తెలంగాణ ప్రజలకు ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. గ్రామస్తులు, యువకులు, మహిళలు, భూపాల్ నాయక్ అభిమానులు, డోర్నకల్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## లాయర్‌పై పోలీసుల దాడి..!

### డీజీపీ ఆఫీసు ముందు న్యాయవాదుల బైఠాయింపు



**విశ్వంభర, హైదరాబాద్ :** మూసీ నిర్వాసితులకు కేటాయించబడిన డబుల్ బెడ్రూం ఇండ్లను గతంలోనే తమకు కేటాయించారు కొంత మంది బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఈ బాధితుల తరపున న్యాయవాది ఎంఏ కలీమ్ కోర్టులో పోరాడుతున్నారు. అయితే కలీమ్‌ను టార్గెట్ చేసిన పోలీసులు, అతని ఇంట్లోకి వెళ్లి దాడి చేశారు. అంతటితో ఆగకుండా ఓ వాహనంలో ఎక్కించుకుని బయటకు తీసుకెళ్లి హింసించారు. అసభ్యకరమైన పదజాలంతో తనను దూషించారని బాధిత న్యాయవాది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంఏ కలీమ్‌పై దాడికి పాల్పడ్డ మాదన్నపేట పోలీసులను సస్పెండ్ చేయాలని కోర్టు ముందు లాయర్లు ధర్నాకు దిగారు. లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాల యాన్ని కూడా న్యాయవాదులు ముట్టడించి నిరసన తెలిపారు. దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయవాదులు డీజీపీ కార్యాలయం వద్ద రోడ్డుపై బైటాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.గత కొంత కాలంగా న్యాయవాదులపై అనేక దాడులు జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని లాయర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకొచ్చి అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కలీమ్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని లాయర్లు హెచ్చరించారు.

## జర్నలిస్టు చిలుక ప్రవీణ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** దాడిలో గాయపడ్డ జర్నలిస్టు చిలుక ప్రవీణ్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పరామర్శించారు.హైదరాబాద్ పట్టణంలోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకొన్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. మరోవైపు చిలుక ప్రవీణ్‌పై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖండించారు.

## భారీగా అల్ఫాజోలం, క్లోరోహైడ్రేట్ పట్టివేత

**విశ్వంభర, నిర్మల్:** నిర్మల్ జిల్లా కేంద్రంలో రూ.43 లక్షల విలువ చేసే అల్ఫాజోలం(Alprazolam), క్లోరోహైడ్రేట్‌ను ఎక్సైజ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. అల్ఫాజులం, క్లోరోహైడ్రేట్ నిల్వ చేశారనే విశ్వసనీయ సమాచారం మేరకు నిర్మల్‌లోని ద్వారకా నగర్‌లో గంధం శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో సోదాలు చేపట్టారు. అతడి వద్ద నుంచి 3.3 కిలోల అల్ఫాజోలం, అలాగే శాంతినగర్‌లోని ఓ గోదాంలో నిల్వ చేసిన 728 క్లోరోహైడ్రేట్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు గంధం శ్రీనివాస్ గౌడ్‌కు సోలాపూర్ శీను అలియాస్ భాయ్ అల్ఫాజులంను, రాజస్థాన్‌కు చెందిన రూప్ సింగ్ అనే వ్యక్తి క్లోరోహైడ్రేడ్‌ను గత కొంతకాలంగా సప్లై చేస్తున్నారు. వీటితో శ్రీనివాస్ గౌడ్ కల్తీకల్లు వ్యాపారం చేయడమే కాకుండా అల్ఫాజోలం, క్లోరోహైడ్రేట్‌ను ఇతరలకు అమ్ముతున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆలయ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమావేశం

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయ అభివృద్ధిపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో భూపాల్ పల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ ఆదేశాల మేరకు కాళేశ్వర అభివృద్ధి మాస్టర్ ప్లాన్ పై ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

## వయోవృద్ధులు సమాజానికి ఎంతో విలువైన వారు

**విశ్వంభర, భూపాలపల్లి:** వయోవృద్ధులు సమాజానికి ఎంతో విలువైనవారని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడీఓసీ ఆకార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలు, విజ్ఞానం యువతకు మార్గనిర్దేశకమని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, వారికి అవసరమైన సహాయం అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. నేటి సమాజంలో ఉన్నతులుగా ఎదిగిన తరువాత సంతానం తల్లిదండ్రుల ఆలనా, పాలనా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ శాఖ పనిచేస్తుందని ఇబ్బందులకు గురయ్యే వయోవృద్ధులు తనకు కానీ సంక్షేమ అధికారికి కానీ పిర్యాదు చేయాలని లేదా టోల్ ఫ్రీ నంబర్ 14567 కు పిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వయోవృద్ధులను గౌరవించడం మన బాధ్యతని అన్నారు. వయోవృద్ధుల అనుభవాలు నేటి తరాలకు స్ఫూర్తి దాయకమని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమాన్ని విస్మరిస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంక్షేమ శాఖ ద్వారా అమృత వర్షిణి వయోవృద్ధుల ఆశ్రమానికి టివిని విరాళంగా అందచేశారు. అనంతరం వయోవృద్ధులను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమ అధికారి చిన్నయ్య, డీపీఓ నారాయణరావు, అమృత వర్షిణి వయోవృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు శ్యాం ప్రసాద్, వయోవృద్ధుల సంఘాలు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను విచారణ చేయాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** ఎల్ఆర్ఎస్ 2020లో ఇంటి స్థలాలు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసిన దరఖాస్తులు ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు విచారణ ప్రక్రియ నిర్వహణకు నియమించిన రెవెన్యూ, మున్సిపల్, గ్రామ పంచాయతి, ఇరిగేషన్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8,310 మంది ఇంటి స్థలాలు క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేయగా 982 దరఖాస్తులు విచారణ పూర్తి అయిందని పెండింగ్ ఉన్న 7,328 దరఖాస్తులు విచారణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తులలో ఎవరైనా డాక్యుమెంట్లు పోర్టల్ లో అప్లోడ్ చేయనట్లయితే ప్రభుత్వం తిరిగి మరలా మొబైల్, మీ సేవా కేంద్రాల ద్వారా రిజిస్టర్ డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయడానికి అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఓ నారాయణ రావు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

## 5వ తేదీ వరకే డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వేరిఫికేషన్

**విశ్వంభర, భూపాలపల్లి:** డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ విచారణ ప్రక్రియకు ఈ నెల 5వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్స్ విచారణ ప్రక్రియ, వానాకాలం దాన్యం కొనుగోలుపై ఎస్పీ కిరణ్ ఖరే తో కలసి విద్యా, పౌర సరఫరాలు, మార్కెటింగ్, తూనికలు కొలతలు, వ్యవసాయ, సహకార, డీఆర్డీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డీఎస్సీకి 589 మంది ఎంపికయ్యారని, 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్స్ విచారణ జరుగుతుందని ఇప్పటి వరకు 197 మంది అభ్యర్థులకు మాత్రమే వేరిఫికేషన్ జరిగిందని, 5వ తేదీ వరకు అనగా కేవలం రెండు రోజులు మాత్రమే అవకాశం ఉన్నందున వేరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీఈఓ ను ఆదేశించారు. వేరిఫికేషన్ ప్రక్రియకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంఈఓల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. దాన్యం కొనుగోలు గురించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దొడ్డు, సన్న రకం కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గత సంవత్సరం 51 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన 500 బోనస్ వల్ల 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరణ జరిగే అవకాశం ఉందని కొనుగోలు కేంద్రాలు గతం కంటే ఎక్కువగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గోనె సంచులు కొరత లేకుండా చూడాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి 2,320 రూపాయలు, బి గ్రాడ్ రకానికి 2,300 మద్దతు ధర పకటించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, మార్కెటింగ్ అధికారి కనుక శేఖర్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, డీ.ఆర్.డీ అవినాష్, సహకార అధికారి వాలియా నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ 2024 ప్రారంభోత్సవ వేడుకలు

### పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి




**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్‌పేట్ మున్సిప ల్ కార్పొరేషన్ లోని నాదర్గుల్ గ్రామం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మల్కా యశస్వి ఆధ్వర్యంలో నిర్వహించిన 38వ సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ 2024 ప్రారంభోత్సవ వేడుకల్లో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, దేశ సేవలో మన వంతు పాత్ర ఉండాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, రామోజీ అమితా శ్రీశైలం చారి, తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, అరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువ వ్యాపారి బలి

**విశ్వంభర, మిరుదొడ్డి :** ఆన్‌లైన్ బెట్టింగ్‌లో భారీగా డబ్బులు కోల్పోయి పురుగుల మందు తాగి యువ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో గురువారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్ఐ బి. పరశురా ములు వివరాల ప్రకారం..రుద్రారం గ్రామానికి చెందిన ఇదారి నవీన్ (27) వ్యవసాయ సంబంధిత రసాయన ఎరువులు గ్రామంలో రైతులకు విక్రయిస్తూ కుటుంబసభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఎలాంటి కష్టం లేకుండా సులభంగా ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడ్డాడు.బెట్టింగ్‌లకు బానిసైన నవీన్ రూ.26 లక్షల వరకు బాకీలు చేసి అప్పుల ఊబిలో కూరుకు పోయాడు. నవీన్‌కు అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనస్తాపానికి గురై గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు నవీన్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, రెండేండ్ల కుమారుడు ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ఏరియా దవాఖానకు తరలించారు.

# రాష్ట్రంలో మళ్లీ వర్షాలు

## పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ



**విశ్వంభర ,తెలంగాణ** బ్యూరో ::రాష్ట్రానికి హైదారాబాద్ వాతావరణ శాఖ మూడు రోజుల వర్షసూచన చేసింది. నేడు ,రేపు ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. నేడు ఉమ్మడి నిజామాబాద్, మెదక్, రంగా రెడ్డి, హైదారాబాద్, మహబూబ్ నగర్‌తో పాటు అదిలాబాద్, నిర్మల్, జనగాం, సిద్దిపేట జిల్లాలకు వర్ష సూచన చేసింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. హైదరాబాద్‌లో గురువారం పలు ప్రాంతాల్లో వర్షం పడింది. భారీగా కురిసిన వానతో నగరవాసులు తడిసి ముద్దయ్యారు. వర్షానికి వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బేగం బజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్ ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమ య్యా యి. రోడ్లపై వాన నీరుతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది. ఇందిరా పార్కు ధర్నా చౌక్, బాగ్ లింగంపల్లి, లోయర్ ట్యాంక్‌బండ్, ఆర్టీసీ క్రాస్ రోడ్, గాంధీ నగర్, జవహర్ నగర్, కవాడిగూడ, దోమలగూడ తదితర ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వరద నీరు నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉద్యోగం ముగించుకుని ఇంటికి బయలు దేరిన ఉద్యోగులు, విద్యార్థులు వర్షానికి తడిచిపోయారు. మరోవైపు హైదరాబాద్‌కు ఎల్లో హెచ్చరికల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అప్రమత్తమయ్యింది. రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని అధికారులు సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు రోడ్లను క్లియర్ చేయాలని, అనుక్షణం అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. నగరంలో బల్దియా యంత్రాంగమంతా వేగంగా స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## గుండెపోటుపై అవగాహన కార్యక్రమాలు



**విశ్వంభర, భూపాలపల్లి:** వరల్డ్ హార్ట్‌డే బ్యానర్ ను జయశంకర్ భూపాలపల్లి డీ ఎం ఎన్ హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ ఆవిష్కరించారు. ఈ ప్రోగ్రాం వారం రోజులపాటు నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు. గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం వలన తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేయడం యొక్క ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమని అన్నారు. మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందని డిప్యూటీ డిఎన్‌ఏ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవి రాథోడ్ తెలియజేశారు. 50 ఏళుదాటిన వారు మాంసకృతులు తీసుకోకూడదని శాకాహారం మాత్రమే తీసుకోవాలని తెలి పారు. రక్తనాళాలలో కొవ్వు పేరుకొని గుండె పోటుకు దారితీస్తుందని దీనివలన సడన్ గా హార్ట్ ఎటాక్ కానీ ఫ్రెండ్స్ తో గాని రావచ్చునని, 50 ఏళ్లు పైబడిన వారు ప్రతి ఒక్కరు లిపిడ్ ప్రొఫైల్ ద్వారా వారి శరీరంలోని కొవ్వు శాతాన్ని గుర్తించి ఇంతకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎస్సీ అభ్యర్థుల వెరిఫికేషన్‌లో గందరగోళం



**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లా డీఈఓ ఆఫీసులో జరుగుతున్న డీఎస్సీ అభ్యర్థుల వెరిఫికేషన్‌లో గందరగోళం నెలకొంది. అభ్యర్థులు తమ తమ సర్టిఫికెట్లు తీసుకొని వెరిఫికేషన్‌కు వచ్చిన వారికి సరియైన సమాచారం ఇచ్చే నాథుడే లేడని అభ్యర్థులు తెలిపారు. క్యూలో నిల్చోని ఆపసోపాలు పడి వెరిఫికేషన్ అధికారి దగ్గ రకు వస్తే ఈ సర్టిఫికెట్ లేదు ఆ సర్టిఫికెట్ లేదు అంటూ తిప్పి పంపుతున్నారని అభ్యర్థు లు ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగునీటి సౌక ర్యం లేక అభ్యర్థులు ఉదయం నుంచి సా యంకాలం వరకు సరిహద్దు భోజన సదుపా యం లేక అల్లాడుతున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులు అతి కష్టం మీద వెరిఫికేషన్ ముగించుకొని తమ ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు.

## ఆర్టీఐపై ప్రజల్లో అవగాహన పెంచాలి



**విశ్వంభర, హైదరాబాద్ ఎల్బీనగర్:** బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, బీసీ కమిషన్ మెంబర్ తిరుమలగిరి సురేందర్‌లను ఖైరతాబాద్‌లోని వారి ఆఫీసులో ఆర్టీఐ జాతీ య ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు గురు వారం కలిసారు. సమాచార హక్కు చట్టాన్ని బలోపేతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీసీ కమిషన్ చైర్మన్‌నీ కోరారు. అక్టోబర్ నెల చివరలో నిర్వహించే ఆర్టీఐ ఆవి ర్భావ వేడుకలకు అవగాహన సదస్సుకు హాజ రుకావాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో ప్రజల కు, విద్యార్థులకు ఆర్టీఐ అవగాహన సదస్సు లు పెట్టి ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాలని, దీనికి మీ సహాయ సహకారాలు కావాలని విన్నవించారు. దీనికి ఆయన ఇలాంటి అవగాహన కార్యక్రమాలు పెట్టడం ప్రజలకు ఆర్టీఐ గురించి వివరించే కార్యక్రమం పెట్టడం చాలా బాగుంటుందని ఆయన సానుకూలంగా స్పందించారు. ఆర్టీఐ బృందం ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ రహదారి విస్తరణలో జాప్యం



**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లాలో జాతీయ రహదారి విస్తరణకు మోక్షం కలగట్లేదు. మహారాష్ట్రలోని సిరంచ నుంచి తిరుపతి వరకు జాతీయ రహదారి విస్తరణ ప్రతిపాదన ఉండగా జిల్లాలోని మహాదేవపూర్ నుండి కాళేశ్వరం జాతీయ రహదారి విస్తరణ పను లు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. 15.8 కిలో మీటర్ల జాతీయ రహదారి పనులకు ప్రభుత్వ అనుమతులు ఉన్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. ఫారెస్ట్ అధికారులు చెట్లకు మార్కింగ్ చేసి ఆ వివరాలు డీఎఫ్ ఓకు పంపగా ఇప్పటివరకు అనుమతులు మంజూరు కాలేదు. 2022 నవంబర్ 12న రామగుండంకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా 163 కోట్లతో రహ దారి విస్తరణ పనులు చేపట్టాలని ప్రధాని శంకుస్థాపన చేశారు. రెండేళ్లు కావస్తున్న పనులు ప్రారంభం కాలేదు.

## లడ్డూ వివాదంపై సుప్రీం విచారణ నేటికి వాయిదా



**ఢిల్లీ:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించారనే ఆరోపణలపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ ప్రారంభమయ్యింది. ధర్మాసనం మరో కేసులో బిజీగా ఉండడం వల్ల సొలిసిటర్ జనరల్ విజ్ఞప్తి మేరకు కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. భక్తుల మనోభావాలను, తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు చేశారంటూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి, టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో పాటు మరో ఇద్దరు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ధర్మాసనానికి మరో ముఖ్య కేసు ఉన్నందున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుంది. రేపు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విచారణ చేపడుతామని న్యాయమూర్తులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు దర్యాప్తునకు ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం కొనసాగించాలా లేంటే స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలా అని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది.

# ధాన్యం సేకరణ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

**విశ్వంభర, భూపాలపల్లి** :ధాన్యం సేకరణ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లు ను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ సచివాలయం నుండి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి వానాకాలం ధాన్యం కొనుగోలుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలక్టర్లతో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 60.73 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నదని 7 వేలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ కోసం ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం కొనుగోలు కేంద్రాల పెంపు కోసం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి 500 బోనస్ ఇస్తుందని కాబట్టి సన్న రకం, దొడ్డు రకాలకు వేరు వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి కోనుగోలు కేంద్రానికి క్రమ సంఖ్య కేటాయించాలని పేర్కొన్నారు. క్రమ సంఖ్య కేటాయించడం వల్ల ఎక్కడైనా అవకతవకలు జరిగితే సులువుగా గుర్తించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. దొడ్డు రకాలను సన్న రకాల్లో కలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గన్ని బ్యాగులపై కొనుగోలు కేంద్రాల సీరియల్ నెంబర్స్ తప్పని సరిగా వ్రాయాలని ఆదేశించారు. ఏదేని తప్పు జరిగితే గుర్తించడానికి అనువుగా ఉంటుందని తదుపరి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. గన్ని బ్యాగుల కొరత లేకుండా ముందస్తుగా జిల్లాలకు ఎన్ని అవసరం ఉంటాయో అంచనాలతో సిద్ధం కావాలని తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్స్, మాయిచ్చర్స్, తూకపు యంత్రాలు తదితర పరికరాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తూ కార్యచరణ రూపొందించుకోవాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం నిలువ లేకుండా కేటాయించిన. మిల్లులకు ఎప్పటికప్పుడు రవాణా చేసేందుకు వాహనాలు కొరత లేకుండా చూడాలని అన్నారు. నిల్వ ఉంచడం వల్ల అకాల వర్షాలకు తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొనుగోలులో దొడ్డు, సన్న రకం ధాన్యాలను వేరు వేరుగా నిల్వ చేయాలని తెలిపారు. ప్రతి రోజు కలక్టర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని ఏదేని సమస్య వస్తే తక్షణమే ప్రభుత్వం దృష్టికి తేవాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలోను, అన్ని కలెక్టర్ కార్యాలయాల్లోను 24 గంటల పని చేయు విధంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సన్న రకం ధాన్యానికి 500 బోనస్ ఇస్తునందున పక్క రాష్ట్రాల నుండి ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంతర్రాష్ట్ర చెక్ పోస్టు లు ఏర్పాటు చేసి పటిష్ఠ తనిఖీలు చేపట్టాలని అన్నారు. వ్యవసాయ, పౌర సరఫరాల అధికారులను సమన్వయం చేయాలని అన్నారు. జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ టీములు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వాతావరణ సమాచారం



6 గంటల ముందే రైతులకు తెలియజేయాలని అన్నారు. 62 వేల టీచర్ల భర్తీకి అన్ని జిల్లాలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగుతుందని ఈ నెల 5 వరకు వేరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. దసరా పండుగకు ముందే 9 అక్టోబర్ 2024 న ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేస్తామని అన్నారు. సర్టిఫికెట్స్ వేరిఫికేషన్‌కు ఇంకా రెండు రోజులు మాత్రమే సమయం ఉన్నందున వేగవంతం చేయాలని అన్నారు. ఈ ప్రక్రియను 10 ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఏదేని సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, కలెక్టర్ లు మంచిగా పని చేసి అటు రైతులకు, ఇటు డీఎస్పీ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చేస్తే రాష్ట్రానికి మంచి పేరు వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరె న్స్‌లో ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఎస్‌ఓ శ్రీనాథ్, పౌర సరఫరాల శాఖ డిఎం రాములు, మార్కెటింగ్ అధికారి కనక శేఖర్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, డీఆర్డీఓ అవినాష్, డీసీఓ వాల్యా నాయక్,లీగల్‌మెట్రాలజీ శ్రీలత పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న ఇంద్రేశం ఈవో

### మాజీ సర్పంచ్ బండి శంకర్ ఆరోపణ



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్ గ్రామ అభివృద్ధి మరిచి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని , గ్రామ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారని ఇంద్రేశం మాజీ సర్పంచ్ బండి శంకర్ తెలిపారు. ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్ జి ప్లస్ టు అనుమతులు ఇచ్చి నాలుగు ఐదు అంతస్తులు నిర్మించుకునే అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారని గతంలో పనిచేసిన కార్యదర్శుల హయాంలో తేదీలను వేసి అనుమతులు ఇచ్చి అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని, చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు అడిగితే నిధులు లేవని చెబుతున్నారని మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలపై ఉన్న శ్రద్ధ గ్రామ అభివృద్ధిపై లేదని అనేక భవనాలకు అనుమతులు ఇచ్చిన పంచాయతీలో నిధులు లేవని చెప్పడం సరికాదని అధికారులు తగిన విచారణ చేసి గ్రామ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని బండి శంకర్ కోరారు.

## వైభవంగా ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**విశ్వంభర, అమరావతి:** శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఏపీలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఇంద్రకీలాద్రి , శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇంద్రకీలాద్రిలో తొలిరోజున గురువారం దుర్గామాత బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల మొదటిరోజునే భక్తులు ఆలయాలకు వచ్చి భవానీ దీక్షలను ప్రారంభించారు. ఏపీ మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, పార్థసారథి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి ఆనంరాంనారాయణ రెడ్డి సామాన్య భక్తులు సులువుగా దర్శనం చేసుకునేందుకు వీలుగా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సుమారు 5వేల మంది పోలీసులతో బందోబస్తు, 200 సీసీ కెమెరాల ఏర్పాటు, వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సమయం కేటాయింపు తదితర చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

## వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు రిమాండ్ పొడిగింపు

### మంగళగిరి కోర్టు ఆదేశం



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మంగళగిరి కోర్టు షాకిచ్చింది. ఆయన రిమాండ్‌ను మరో 14 రోజులు పొడిగించింది. ఈ నెల 17వ తేదీ వరకు సురేశ్ రిమాండ్‌ను పొడిగిస్తూ మంగళగిరి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన కేసులో ఇటీవల నందిగం సురేశ్ అరెస్టయ్యారు. 2021 అక్టోబర్ 19వ తేదీన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడికి తెగబడ్డాయి. కార్యాలయం ఆవరణలోని వాహనాలు, అద్దాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశాయి. అడ్డుకున్న వారిని వైసీపీ శ్రేణులు దాడికి తెగబడ్డాయి. దీనిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ఆఫీసు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. టీడీపీ ఆఫీసులోని సీసీ కెమెరాల రికార్డుల ద్వారా పలువురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## అమాయకుడిలా నటిస్తున్న జగన్

### కోర్టులను అవమానించిన వ్యక్తి

### డిప్యూటీ సీఎం పవన్ విమర్శలు



**విశ్వంభర, తిరుపతి:** మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రస్తుతం అమాయకుడిలా నటిస్తున్నాడని.. గత ఐదేళ్లలో ఆయన చేసిన పనులను.. గతంలో ఉన్న అవినీతి కేసులను జాతీయ మీడియా ఓసారి గుర్తు చేసుకోవాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తిరుపతిలో నిర్వహించిన వారాహి డిక్లరేషన్ సభలో జగన్‌పై విమర్శలు గుప్పించారు. జగన్ కోర్టులను అవమానించిన వ్యక్తి, జడ్జిలపై అసభ్యకర వ్యాఖ్యలు చేయించిన వ్యక్తి అని విమర్శించారు. ఎన్నికల అధికారిని దూషించిన దూషిం చారని.. వ్యవస్థలంటే ఆయనకు గౌరవం లేదన్నారు. కోర్టులతో ఎన్నోసార్లు చీవాట్లు తిన్నార న్నారు. జగన్‌పై ఉన్న కేసులన్నీ చాలా తీవ్రమైనవని.. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయ న్నారు. జగన్‌పై 32 కేసులు ఉన్నాయన్న పవన్.. 16 నెలలు జైలు జీవితం అనుభవిం చారన్నారు. బెయిల్‌పై బయట ఉన్న వ్యక్తి అని వ్యక్తిని నమ్ముతామా? అంటూ ప్రశ్నించారు. మాజీ సీఎంపై ఉన్న కేసులను త్వరగా విచారణ జరిపి.. చర్యలు తీసుకోవాలని న్యాయస్థా నాలను కోరుతున్నానన్నారు. ఉదయనిధిపై విమర్శలు.. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉద యనిధి స్టాలిన్‌పై పవన్ కల్యాణ్ పరోక్షంగా మండిపడ్డారు. సనాతన ధర్మానికి భంగం కలిగితే తాను బయటకు వచ్చి పోరాడుతాన్నారు. అవసరమైతే ప్రాణత్యాగం చేస్తానని.. పదవి పోయినా భయపడనన్నారు. ఆ మహమ్మారిని నిర్మూలించాలని ఈ మధ్య ఓ యువ నాయకుడు మాట్లాడుతున్నాడని.. సనాతన ధర్మాన్ని ఎవరూ ఏమీ చేయలేరన్నారు. ఎవరైనా సరే దాన్ని నిర్మూలించాలకుంటే, వారే తుడిచి పెట్టుకుని పోతారన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామి సాక్షిగా ఈ మాటలు చెబుతున్నానన్నారు. సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులను న్యాయస్థానాలు సమర్థిస్తున్నాయని.. ధర్మంపై దాడులు చేస్తున్న వారిని కోర్టులు కాపాడడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

## ఖజానా నింపుకొనేందుక మూసీ ప్రక్షాళన

### వంటేరు ప్రతాప్‌రెడ్డి

**విశ్వంభర, గజ్వేల్:** మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం జేబుల్లో ఖజానా నింపుకోవడానికే భారీగా బడ్జెట్‌ను పెంచిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు ఖాజానాను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రాజెక్టు ముందుకు తెచ్చిందన్నారు. మంత్రి కొండా సురేఖ సభ్య సమాజం తలదించుకునేలా మహిళ అన్న విషయాన్ని మరిచి సినీనటి సమంతపై అనుచిత వ్యాఖ్యలు చేవారని విమర్శించారు.మహిళా మంత్రి సురేఖకు మహిళలపై ఏమాత్రం గౌరవం లేదని, సమంతపై చేసిన వ్యాఖ్యలపైఖండి స్తున్నట్లు తెలిపారు. పదినెలల కాలంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.90వేల కోట్ల అప్పు చేసిందని, కానీ.. రాష్ట్రంలో ఎలాంటి కొత్త పథకాలను ప్రారంభిం చలేదన్నారు. ప్రభుత్వం గాలిలో నడుస్తుందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆదాయం పెంచుతామని చెప్పిన రేవంత్‌రెడ్డి పెంచడం ఏమోకాని ఆదాయాన్ని మాత్రం దించుతున్నడన్నారు. రుణమాఫీపై రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తామని వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల గజ్వేల్ ఆర్ అండ్‌ఆర్ మైనంపల్లి హన్మంతరావు మాజీ



మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై పెట్రోల్ పోసి తగలబెడతాని మాట్లాడడంపై వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. హన్మంతరావుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# అన్ని రంగాలను గాడినపెట్టి ఆర్థిక వృద్ధి సాధించాలి



**విశ్వంభర, అమరావతి:** నూతన పాలసీలతో అన్ని రంగాలను గాడిన పెట్టి మళ్లీ ఆర్థిక వృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు అన్నారు. 15శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో ప్రభుత్వం పనిచేయాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవలరంగంలో వృద్ధిపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయా శాఖల అధికారులు గత పదేళ్లలో పరిస్థితులను వివరించారు. గత ప్రభుత్వం విధ్వంసకర విధానాలతో అన్ని రంగాలు తిరోగమనంలోకి వెళ్లాయని దీంతో ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందని సీఎం అన్నారు. ప్రతి శాఖలో కొత్త పాలసీలు తీసుకొస్తున్నామని, వీటిని సమర్థంగా అమలు చేసి ఆర్థిక పురోగతి సాధించాలని సీఎం అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు ప్రజలపై అదనపు భారం లేకుండా ప్రభుత్వ ఆదాయం పెంచే విధానాలను అమలు చేయాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ రంగంలో సమగ్ర యంత్రీకరణ ద్వారా సాగు ఖర్చులు తగ్గించవచ్చన్నారు. ప్రభుత్వం అంటే పథకాలు ఇవ్వడం మాత్రమే కాదని, ఆయా రంగాలను బలోపేతం చేసి ప్రజల ఆదాయాలను పెంచడం ముఖ్యమన్నారు. 2014 తరువాత విభజన కష్టాలు ఉన్నా.. నాడు తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం 13.7 శాతం గ్రోత్ రేట్ సాధించిందని గుర్తు చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ రివర్స్ నిర్ణయాలతో వృద్ధి రేటు 10.59 శాతానికి తగ్గిందని సీఎం అన్నారు. 2019లో తెలంగాణతో పోల్చితే ఏపీ జీఎస్‌డీపీలో వ్యత్యాసం కేవలం 0.20 శాతం ఉండేదని, ఆ వ్యత్యాసం 2024కు 1.5 శాతానికి పెరిగిందని వివరించారు. 2014-15 మధ్య ఏపీ ప్రజల తలసరి ఆదాయం రూ.93,903 ఉండగా నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో తలసరి ఆదాయం 2019 నాటికి రూ.1,54,031కి పెరిగిందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో ..ఏపీ తలసరి ఆదాయంలో 5వ స్థానంలో ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ శాఖలు విజన్ సిద్ధం చేసుకుని నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేయాలని అధికారులకు సూచించారు. జనవరి నుంచి పీ4 విధానాన్ని ఆచరణలోకి తెస్తున్నామన్నారు. ఈ విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారు ఆర్థికంగా అట్టడుగున ఉన్న 10 శాతం మందిని పైకి తెసుకువచ్చేందుకు సహాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు..సంపన్నులు, సంస్థలు సీఎస్ఆర్ ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచడానికి, వారికి అవకాశాలు కల్పించడానికి మెంటార్ లా దోహదపడాలన్నారు.

# లడ్డూ వివాదంలో బయటకొస్తున్న నిజాలు

## పాపాలు చేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్



**విశ్వంభర, అమరావతి:** మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో టీటీడీకి సరఫరా చేసిన కల్తీ నెయ్యి అంశంలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరాం కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో పట్టాభి మీడియాతో మాట్లాడుతూ.. సంచలన విషయాలు తెలిపారు.ఏఆర్ ఫుడ్స్ కంపెనీకి నెలకు వెయ్యి టన్నుల నెయ్యి సరఫరా చేసే కెపాసిటీ లేదని తెలిపారు. ఏఆర్ సంస్థ ఉత్పత్తి చేసే నెయ్యి నెలకు కేవలం 16 టన్నులు మాత్రమేనని టీటీడీ టెక్నికల్ కమిటీ గత ఏడాది నవంబరులో నిర్ధారించిందని పేర్కొన్నారు. ఇలాంటి కంపెనీ నెలకు వెయ్యి టన్నులు ఎలా సరఫరా చేయగలదో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీవారి ప్రసాదాలకు వాడే నెయ్యిలో కూడా వైసీపీ నేతలు దోపిడీ చేసేందుకు ఏఆర్ ఫుడ్స్ డెయిరీ అడ్డుపెట్టుకున్నారని ఆధారాలు నిరూపిస్తున్నాయని పట్టాభి అన్నారు. టీటీడీ టెక్నికల్ టీమ్ రిపోర్టులను కూడా ట్విట్టర్, ఇతర సోషల్ మీడియాలో జగన్ పోస్టు చేయాలని సూచించారు. సత్యమేవ జయతే అని చెబుతున్న జగన్.. తాము చూపించే ఆధారాలను ప్రజలకు చూపించగలరా అని ప్రశ్నించారు. రూ.39 కోట్ల నెయ్యి కాంట్రాక్టులో టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, వాళ్లకు మద్దతు పలికే అధికారులు పాపాలు చేశారని ఆరోపించారు. వైసీపీ చేసిన పాపాలను నిగ్గు తేల్చడానికి కూటమి ప్రభుత్వం సిట్ వేసిందని పట్టాభి తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో త్వరలోనే నెయ్యి కల్తీకి పాల్పడిన దుర్మార్గులను ప్రజల ముందు నిలబెడతామని పేర్కొన్నారు. జీడిపప్పు, కిస్మిస్, నెయ్యి, శ్రీవారి ప్రసాదాల్లో ఎవరెవరు ఎంత దోచుకున్నారో అన్నీ త్వరలోనే కక్కిస్తానని పేర్కొన్నారు. వైసీపీ నేతలు తమ పాపాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజలను, శ్రీవారి భక్తులను పక్కదారి పట్టించేలా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. వైసీపీ పాపాలను ప్రక్షాళన చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన నందిని నెయ్యితో శ్రీవారి ప్రసాదాలను తయారు చేయిస్తున్నామని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో అపశృతి..

### ప్రియాంక మోహన్‌కు తప్పిన ప్రమాదం



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో స్టేజ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో పలువురికి గాయాలయ్యాయి.వివరాల్లోకి వెళ్తే..కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సినీనటి ప్రియాంక మోహన్, పాలకుర్తి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి విచ్చేశారు. ఈ క్రమంలో షాపింగ్ మాల్ ముందు ఏర్పాటు చేసిన వేదిక పైకెక్కి ప్రజలకు అభివాదం చేస్తుండగా ఒక్క సారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదం నుం సినీనటి ప్రియాంక మోహన్ సురక్షితంగా బయటపడ్డారు. ఝాన్సీ రెడ్డికి తీవ్ర గాయలవడంతో వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

# వందేళ్ల నాటి దేవతా విగ్రహం చోరీ..

## క్షమాపణ లేఖతో తిరిగి ఇచ్చిన దొంగ



లక్నో: ఒక ఆలయంలోని వందేళ్ల నాటి పురాతన దేవతా విగ్రహం చోరీ అయ్యింది. దీని గురించి ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విగ్రహం దొంగతనంపై మనస్తాపం చెందిన ఆలయ పూజారి నిరాహార దీక్ష చేపట్టారు. అయితే దొంగిలించిని వ్యక్తికి చెడు జరుగడంతో క్షమాపణ లేఖతోపాటు ఆ విగ్రహాన్ని తిరిగి ఇచ్చాడు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సెప్టెంబర్ 23న నవాబ్‌గంజ్‌లోని రామ్ జానకి ఆలయంలో వందేళ్ల నాటి అష్టధాతువు రాధా కృష్ణ విగ్రహం చోరీ అయ్యింది. ఈ సంఘటనపై ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కాగా, పురాతన దేవతా విగ్రహం దొంగతనం పట్ల ఆలయ పూజారి తీవ్ర మనస్తాపం చెందారు. నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్నారు. అయితే చోరీ జరిగిన పది రోజుల తర్వాత, జాతీయ రహదారిలోని గౌఘాట్ లింక్ రోడ్డు వద్ద గోనె సంచి ఉండటాన్ని కొందరు గమనించారు. దానిని తెరిచి చూడగా చోరీ విగ్రహంతో పాటు ఒక లేఖ కూడా అందులో ఉంది. ఆ విగ్రహాన్ని గుర్తించి గౌఘట్ ఖల్సా ఆశ్రమానికి తీసుకెళ్లారు.మరోవైపు విగ్రహాన్ని చోరీ చేసిన దొంగ ఆ లేఖలో క్షమాపణ కోరాడు. 'అయ్యా పూజారి నేను పెద్ద తప్పు చేశాను. నా అజ్ఞానం కారణంగా గౌఘాట్ నుంచి రాధా కృష్ణ విగ్రహాన్ని దొంగిలించాను. అప్పటి నుంచి నాకు చెడు కలలు వస్తున్నాయి. నా కుమారుడి ఆరోగ్యం కూడా క్షీణించింది. కొంత డబ్బు కోసం నేను నిజంగా తప్పు చేశా. క్షమించమని కోరుతూ విగ్రహాన్ని తిరిగి ఇస్తున్నా. నన్ను, నా పిల్లలను క్షమించమని పూజారిని వేడుకుంటున్నా. విగ్రహాన్ని గుడిలో తిరిగి ఉంచాలని కోరుతున్నా' అని ఆ లేఖలో పేర్కొన్నాడు. దీంతో పూజారి ఆ విగ్రహాన్ని ఆలయంలో తిరిగి ప్రతిష్టించారు.కాగా, విగ్రహాన్ని దొంగిలించిన వ్యక్తి కోసం పోలీసులు వెతుకుతున్నారు. అతడ్ని గుర్తించేందుకు ఆలయం సమీపంలోని ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

## జర జాగ్రత్తగా మాట్లాడండి..

### పీసీసీ చీఫ్ సూచన



**విశ్వంభర, హైదరాబాద్:** జర జాగ్రత్తగా మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు, మంత్రులకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. సమాజంలో ఒకరి గురించి ఒకరు చెడుగా మాట్లాడొద్దన్నారు. సమంత పై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యల్ని భేషరతుగా ఉపసంహరించుకున్నారు. ఇరు వైపులా మహిళలు ఉన్నారు.. అందువల్ల ఈ వివాదాన్ని ఇంటితో ముంగించాలని సినీ ప్రముఖులకు విజ్ఞప్తి చేశారు. మనోభావాలను కించపరచాలని ఆమె ఉద్దేశం కాదని చెప్పారు.

## పగలు రోడ్లపై అడుక్కుని, రాత్రుళ్లు హొటల్స్‌లో బస.

### 22 మందిని వారి రాష్ట్రానికి పంపివేత

**భోపాల్:** కొందరు వ్యక్తులు పగలు రోడ్లపై అడుక్కుంటున్నారు. రాత్రి వేళ హొటల్స్‌లో బస చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు 22 మందిని వారి రాష్ట్రానికి తిరిగి పంపారు. అలాగే అడుక్కునే వారికి వసతి కల్పించ వద్దని హొటల్స్ నిర్వాహకులను హెచ్చరించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. రాజస్థాన్‌కు చెందిన 22 మంది ఇండోర్ నగరంలో అడుక్కుంటున్నారు. వారిలో 11 మంది పిల్లలు కూడా ఉన్నారు. వీరంతా హొటల్స్‌లో ఉంటున్నారు. రోజంతా నగరంలో పలు ప్రదేశాలలో భిక్షాటన చేస్తున్నారు. రాత్రికి హొటల్స్‌కు తిరిగి వెళ్తున్నారు.కాగా, ఇండోర్‌లో అడుక్కుంటున్న ఈ బృందాన్ని మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారులు గుర్తించారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. వారి రాష్ట్రమైన రాజస్థాన్‌కు తిరిగి పంపారు. అలాగే భిక్షాటన చేసే వారికి వసతి కల్పించ వద్దని అన్ని హొటళ్లు, లాడ్జీలు, షెల్టర్ల నిర్వాహకులకు సూచించారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మరోవైపు దేశంలోని పది నగరాలను యాచకుల రహితంగా మార్చేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పది నగరాల్లో ఇండోర్ కూడా ఒకటి. ఇండోర్‌లో భిక్షాటనను అధికారులు నిషేధించారు. యాచకులను ఆ నగరం నుంచి పంపేస్తున్నారు.

## మున్సిపల్ కార్మికులకు ఎస్సై సన్మానం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో గత నెలలో వినాయక చవితి సందర్భంగా సరసముద్రం చెరువులో గణేష్ నిమజ్జనానికి అద్భుతమైన కృషి చేసినందుకు మున్సిపాలిటీ కార్మికుల బృందానికి ఆమనగల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటేష్ శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మున్సిపాలిటీ సిబ్బంది కృషి వలననే గణేష్ నిమజ్జనం విజయవంతం అయ్యిందని వారు రాత్రి పగలు సమర్థవంతంగా పనిచేసే పోలీసులకు అండగా నిలిచినందుకు అభినందనలు తెలియ వేశారు. వారి అంకితభావం మరియు కృషి వలనే కార్యక్రమం విజయవంత మయ్యిందని ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఏఎస్ఐలు యాదయ్య, లక్ష్మణ్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## బాల త్రిపుర సుందరి అవతారంలో దుర్గామాత

### అన్నపూర్ణేశ్వరి అశ్రమంలో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఆశ్రమ నిర్వాహకులు శ్రీ శంకరనంద స్వామీజీ ఆధ్వర్యంలో గురువారం నుండి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలలో జనగాం అంజయ్య లక్ష్మమ్మ కుమారులు, కల్లెట్ల యాదయ్య నాగమణి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి కార్యక్రమం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆగమన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో స్థానిక గాంధీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్యఅతిథిగా హాజరై కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి అమ్మవారిని శ్రీనివాస కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్టించారు. మున్సి పాలిటీ చైర్మన్ రాం పాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు,కమిటీసభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అధికార దుర్వినియోగం

## మోసాలుగా మారిన చంద్రబాబు అబద్ధాలు

## కార్యకర్తలతో మాజీ సీఎం వైఎస్ జగన్



**విశ్వంభర,అమరావతి:** రాష్ట్రంలో అధికార దుర్వినియోగం అవుతోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. రాజకీయా ల్లో వ్యక్తిత్వం, విశ్వసనీయత చాలా ముఖ్యమని తెలిపారు. కష్టం వచ్చినప్పుడు అండగా నిలబడగాలని వ్యాఖ్యానించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జడ్పీటీసీ, ఇతర నాయకులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యకర్తలకు వైఎస్ జగన్ భరోసా కల్పించారు. గత ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చామని వైఎస్ జగన్ తెలిపారు. ప్రతి ఏడాది సంక్షేమ క్యాలెండర్ విడుదల చేశామని.. ఏ పథకానికి ఎంత బడ్జెట్ కేటాయించామో స్పష్టంగా చెప్పామని గుర్తుచేశారు. క్యాలెండర్ ప్రకారం వాటిని విడుదల చేసి అండగా ఉండేవాళ్లమని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. వైసీపీ పాలనకు, టీడీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించారని పేర్కొన్నారు. రెండు ప్రభుత్వాల్లో ఎవరికి ఎంత మంచి జరిగిందనే దానిపై ప్రతి కుటుంబంలోనూ చర్చ జరుగుతుందని చెప్పారు. చంద్రబాబు అబద్ధా లు ఇప్పుడు మోసాలుగా మారాయని విమర్శించారు. చంద్రబాబు మోసాలపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతుందని అన్నారు. నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఓపికతో ముందుకు సాగాలని.. ప్రజలకు అండ గా ఉండాలని సూచించారు. ప్రజల తరఫున పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. వైసీపీ కార్యకర్తలు కేసులకు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. గొంతులు నొక్కడానికి, అణచివేయాలన్న ధోరణితో కేసులు పెడుతున్నారని.. వీటికి భయపడాల్సిన అవసరం లేదని వైసీపీ కార్యకర్తలకు జగన్ సూచించారు. తనను 16 నెలలు జైలులో పెట్టారని.. తనను హింసించినట్లుగా ఎవ్వరినీ కూడా హింసించి ఉండరని అన్నారు. అయినా ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగామని చెప్పారు. కేసులు పెట్టడం మినహా వారు చేసేదేమీ ఉండదని ఎద్దేవా చేశారు. రెడ్ బుక్ ఏదైనా పెద్ద విషయమా? అదేదో గొప్ప విషయం అన్నట్లు వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులపై మండిపడ్డారు. ఇలా అయితే ప్రతి ఒక్కరూ రెడ్‌బుక్ రాసుకుంటారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇప్పుడు అన్యాయమైన పాలన కొనసాగుతోంది.. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే అని స్పష్టం చేశారు.

## అంగరంగ వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**విశ్వంభర, మూసాపేట్** :మూసాపేట్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవం ప్రారంభించారు. మూసాపేట జానంపేట పోల్కంపల్లి, చక్రాపూర్, వేముల, నిజాలాపూర్ తదితర గ్రామాలలో దుర్గామాత అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. జానంపేటలో మూసాపేట్ స్వర్ణ కవచ దుర్గామాత దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వాసవి దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి పట్టణ ఆర్యవైశ్య సంగం ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు మైలారపు రాంబాబు జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి రవి సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్ వాసవి దేవాలయం అధ్యక్షులు చాడ సురేష్ పాల్గొని ప్రత్యేక పంచామృతాభిషేకం కలస పూజా నవగ్రహ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్, పుల్లూరి నవీన్, బండారి గోపి, చిట్టి మిల్లి శ్రీనివాస్, జొన్న శ్రీనివాస్, బండారి శివ, వాసవి సేవాదళ్ అధ్యక్షులు దొంతుల సంతోష్, చింతల కుమార్, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి దొంతుల లక్ష్మీనారాయణ, గంప శ్రీనివాస్, జిల్లా నాయకులు గంప శ్రీనివాస్, కట్కం శంకర్, వెలగందుల జలంధర్, యువజన సంఘం అధ్యక్షులు చకినం కేదార్నాథ్, మహిళా సంఘం అధ్యక్షురాలు పుల్లూరి మధుమిత సాయిరాం, అక్కినపల్లి సందీప్, బండారి ప్రసాద్, చిన్న రమేష్, తాటిపాముల లక్ష్మీపతి పాల్గొన్నారు.

## విద్యుత్ తీగల ఉచ్చు కి మహిళా రైతు మృతి



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామం లో వేటగాళ్ల విద్యుత్ తీగల ఉచ్చు కి సుక్కక్క అనే మహిళ మృతి చెందింది.గ్రామ శివారులోని పత్తి చేనుకి కాపలా వెళ్లిన మహిళ రైతు గుర్తుతెలియని వ్యక్తులు జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగ కు బలి అయింది.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేత



**విశ్వంభర, మంచిర్యాల :** హైదరాబాద్ తరహాలో జిల్లాల్లో సైతం కట్టడాల కూల్చివేత ప్రక్రియ ఊపందుకున్నది. తాజాగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అధికారులు కూల్చివేశారు. ఆ స్థలంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేపడుతామని స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. అలాగే మంచిర్యాల పట్టణంలో సెట్ బ్యాక్ లేకుండా కట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చి వేశారు.

# అబార్షన్ హక్కును సమర్థించిన మెలానియా

- మహిళ శరీరంపై హక్కు ఆమెకే ఉండాలన్న ట్రంప్ సతీమణి
- అమెరికా ఎన్నికలను ప్రభావితం చేసే అబార్షన్ హక్కు



**వాషింగ్టన్:** అబార్షన్ హక్కులపై అధికారం రాష్ట్రాలకే ఉండాలని ట్రంప్ వాదిస్తుండగా.. ఆయన సతీమణి మెలానియా మాత్రం అబార్షన్ హక్కును సమర్థించారు. అగ్రరాజ్య అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసే కీలకాంశాల్లో అబార్షన్ హక్కు ఒకటి. అధ్యక్ష అభ్యర్థులు కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ మధ్య గత నెల జరిగిన డిబేట్‌లో గర్భవిచ్ఛిత్తి అంశంపై ఇరువురు వాడీవేడిగా వాదించారు. ఈ క్రమంలో ట్రంప్ సతీమణి మెలానియా నుంచి కీలక స్పందన వచ్చింది. అబార్షన్ హక్కులపై అధికారం రాష్ట్రాలకే ఉండాలని ట్రంప్ వాదిస్తుండగా.. మెలానియా మాత్రం అబార్షన్ హక్కును సమర్థించారు. 'మెలానియా' పేరుతో అక్టోబర్ 8న విడుదల కానున్న మెమోర్‌లో ఈ అంశం గురించి ఆమె తన అభిప్రాయాన్ని పొందుపరిచారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ''ఆమె శరీరం గురించి నిర్ణయాలు తీసుకునే హక్కు ఆమెకుగాకుండా ఇంకెవరికో ఎందుకు ఉండాలి..? అవాంఛిత గర్భానికి సంబంధించి ఒక మహిళ తీసుకునే నిర్ణయాన్ని పరిమితం చేయడం..ఆమె సొంత శరీరంపై నియంత్రణను నిరాకరించడం కిందికే వస్తుంది'' అని ఆమె రాసుకొచ్చారు. నవంబర్ 5న ఎన్నికలు జరగనుండగా.. దానికి కొన్ని వారాల ముందు ఈ పుస్తకం విడుదల కానుంది.

గత నెల జరిగిన డిబేట్‌లో కమల మాట్లాడుతూ.. ''మహిళల అభివృద్ధి ట్రంప్‌నకు గిట్టదు. అబార్షన్లపై ఆయన నిషేధం విధించాలనుకుంటున్నారు. అత్యాచారాల వంటి కేసుల్లోనూ మహిళలకు ఎలాంటి మినహాయింపు ఇవ్వాలనుకోవడం లేదు. ఇది మహిళలను అవమానించడమే..! ఆయన అధ్యక్షుడిగా ఎన్నికైతే జాతీయ అబార్షన్ల నిషేధంపై సంతకం చేస్తారు. గర్భవిచ్ఛిత్తిపై మహిళలే నిర్ణయం తీసుకోగలరు. సరైన నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం వారికి ఉంటుంది. అమెరికా ప్రజలు స్వేచ్ఛాప్రియులు'' అని వ్యాఖ్యానించారు. దీనికి ట్రంప్ ఘాటుగా బదులిచ్చారు. ''ఆమె అబద్ధం చెబుతున్నారు. గర్భవిచ్ఛిత్తిపై నిషేధానికి నేను అనుకూలం కాదు. ఆ బిల్లుపై సంతకం చేయబోను'' అని చెప్పారు. అయితే, ఎనిమిది, తొమ్మిది నెలల్లో గర్భవిచ్ఛిత్తి ఎలా చేస్తారని, దానికి మాత్రం తాను అనుకూలం కాదని స్పష్టంచేశారు. ఆ బిల్లుపై అమెరికా కాంగ్రెస్ చట్టం చేయాలని కమల పిలుపిస్తున్నారు. ఆ విషయంలో అధికారం రాష్ట్రాలకే ఉండాలని మాజీ అధ్యక్షుడు వాదిస్తున్నారు.



## ఈషా ఫౌండేషన్‌పై పోలీసు చర్యలకు బ్రేక్

### సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు సుప్రీంలో ఊరట

**న్యూఢిల్లీ:** సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు చెందిన ఈషా ఫౌండేషన్‌పై పోలీసుల చర్యలకు బ్రేక్ వేస్తూ గురువారం సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈషా ఫౌండేషన్‌తో లింకున్న అన్ని క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించాలని మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తమిళనాడు పోలీసులు చర్యలకు దిగారు. ఈ నేపథ్యంలో ఈషా ఫౌండేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే ఇచ్చింది. కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్ ఆశ్రమంలో ఉన్న తన ఇద్దరు కూతుళ్లకు బ్రెయిన్‌వాష్ చేశారని, దాంతో వాళ్లు ఇంటికి రావడం లేదని ఓ తండ్రి దాఖలు చేసిన పిటీషన్ ఆధారంగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఇవాళ ఈ కేసులో వాదనలు విన్నది. ఆ ఇద్దరు మహిళలతో ధర్మాసనం మాట్లాడింది. తమ ఇష్టపూర్వకంగానే ఆశ్రమంలో ఉంటున్నట్లు ఆ ఇద్దరు మహిళలు వెల్లడించారు. తమను ఎవరూ నిర్బంధించడంలేదని పేర్కొన్నారు. ఈషా ఫౌండేషన్‌పై నమోదు అయిన కేసును మద్రాసు హైకోర్టు నుంచి సుప్రీం కోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. తమిళనాడు పోలీసులు ఇచ్చే స్టేటస్ రిపోర్టును సుప్రీంకు సమర్పించాలని ఆదేశించారు.

### యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ రాజకీయ పక్షపాత సంస్థ

## భారత్‌పై అవాస్తవాల ప్రచారం

### "అంతర్జాతీయ మత స్వేచ్ఛపై యూఎస్ కమిషన్" నివేదికకు ఖండన




**ఢిల్లీ:** భారత్‌లో మతస్వేచ్ఛపై దాడి జరుగుతోందని ''అంతర్జాతీయ మత స్వేచ్ఛపై యూఎస్ కమిషన్'' విడుదల చేసిన తాజా నివేదికను భారత్ ఖండించింది. 'యూఎస్‌సీఐఆర్‌ఎఫ్' అనేది రాజకీయ ఎజెండాతో కూడిన పక్షపాత సంస్థగా పేర్కొంది. భారత్‌కు సంబంధించిన వాస్తవాలను ఆ సంస్థ తప్పుగా ప్రచారం చేస్తోందని, తమ దేశంపై ప్రేరేపిత కథనాలను కొనసాగిస్తోందని మండిపడింది. ''అంతర్జాతీయ మత స్వేచ్ఛపై యూఎస్ కమిషన్ పై మా అభిప్రాయమేంటో తెలుసు. అది రాజకీయ ఎజెండాతో కూడిన పక్షపాత సంస్థ. భారత్ గురించి అవాస్తవాలను, ప్రేరేపిత కథనాలను వ్యాప్తి చేయడం కొనసాగిస్తూనే ఉంది'' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ తాజాగా విడుదల చేసిన ఆ ప్రమాదకరమైన నివేదికను భారత్ తిరస్కరిస్తోందన్నారు. తాజా నివేదిక ఆ సంస్థను మరింత దిగజార్చేందుకే ఉపయోగపడుతుందన్నారు.

ఇకనైనా అటువంటి ఎజెండాపూరిత నివేదికలకు యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ దూరంగా ఉండాలని రణ్‌ధీర్ జైశ్వాల్ విజ్ఞప్తి చేశారు. అమెరికాలో అంతర్గతంగా ఉన్న మానవ హక్కుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. ఇదిలాఉంటే, మత స్వేచ్ఛపై యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని భారత్ కొంతకాలంగా ఆరోపిస్తోన్న సంగతి తెలిసిందే.

## తమిళనాడులో దళితులపై నేరాలు 40 శాతం పెరిగాయి

### : గవర్నర్ ఆర్ఎన్ రవి



**చెన్నై:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి మరోసారి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ రాష్ట్రంలో దళితులపై నేరాలు 40 శాతం పెరిగాయని తెలిపారు. దళితులపై కొనసాగుతున్న సామాజిక వివక్షను ఆయన విమర్శించారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా చెన్నైలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్ఎన్ రవి మాట్లాడారు. 'ఆయన (గాంధీ) చరఖాను ఉపయోగించినప్పుడు, అది స్వదేశీ గర్వకారణం, స్వావలంబన, ఆర్థిక వ్యవస్థపై విదేశీ నియంత్రణ నుంచి విముక్తికి చిహ్నంగా ఉంది. బ్రిటీష్‌వారు వెళ్లిపోయారు. అయినా దళితులు ఇంకా స్వతంత్రంగా లేరు' అని అన్నారు. కాగా, దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షను ఈ సందర్భంగా గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రస్తావించారు.

కొన్ని వీధుల్లో నడవడానికి, దేవాలయాలలోకి ప్రవేశించడానికి దళితులకు అనుమతి లేదని తెలిపారు. మానవ వ్యర్థాలు కలిసిన నీటి ట్యాంకులు కలిగిన క్రూరమైన చర్యలకు వారు గురైనట్లు చెప్పారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలను ఉటంకించారు. గత మూడేళ్లలో రాష్ట్రంలో దళితులపై నేరాలు 40 శాతం పెరిగాయని అన్నారు. తమిళనాడులో దళిత మహిళలపై అత్యాచారం కేసుల్లో శిక్షా రేటు జాతీయ సగటులో సగం అని వివరించారు. మరోవైపు కళ్లకురిచిలో జరిగిన కల్తీ మద్యం దుర్ఘటనలో 60 మందికి పైగా దళితులు మరణించడం సామాజిక, ఆర్థిక వివక్షకు స్పష్టమైన ఉదాహరణ అని గవర్నర్ రవి తెలిపారు. మద్యం మాఫియాలో దళితులు కూడా బాధితులేనని అన్నారు. తమిళనాడు పాఠశాలల్లోని దళిత వంట మనుషులు వండిన భోజనం తినడానికి కొందరు విద్యార్థులు నిరాకరించడాన్ని గుర్తు చేశారు. ఈ చర్యలు బాధాకరమైనవి, ఆమోదయోగ్యం కానివి అన్నారు. 'తమిళనాడులో దళితులపై జరుగుతున్న తీరు చాలా ఎక్కువ స్థాయిలో ఉంది' అని వ్యాఖ్యానించారు. అయితే గవర్నర్ రవి వ్యాఖ్యలను తమిళనాడు న్యాయశాఖ మంత్రి ఎస్ రేగుపతి ఖండించారు. రాష్ట్రంలో కులం కారణంగా ఒక వర్గాన్ని టార్గెట్ చేశారన్న భావనకు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. 'అందరినీ సోదరులుగా చూస్తాం. రాష్ట్ర ప్రజలను కులం లేదా మతం పరంగా విభజించలేదు' అని అన్నారు.

### 2028 ఒలింపిక్స్‌లో

## తెలంగాణ అథ్లెట్లు పతకాలు సాధించాలి

- యువత మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రత్యేక రాష్ట్రం వచ్చాక క్రీడలను నిర్లక్ష్యం చేశారని, పదేళ్లలో యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు అయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించినవారికి తాము ఉన్నత ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. నిబంధనలు సవరించి బాక్సర్ నిఖత్ జరీన్‌కు పోలీసు శాఖలో ఉద్యోగం ఇచ్చామని గుర్తుచేశారు. ఇంటర్మీడియట్ చదివిన క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ అథ్లెట్లకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదని వెల్లడించారు. హైదరాబాద్ క్రీడలకు వేదికగా కావాలని, 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అండర్ 17 ఫుట్‌బాల్ జట్టును దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 25 ఏళ్ల క్రితం క్రీడల నిర్వహణలో దేశానికే తలమానికంగా నిలిచామని అన్నారు. చదువే కాదని, క్రీడల్లో రాణించినా మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. గురువారం ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ 2024 క్రీడలు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి సీఎం కప్ క్రీడల లోగో, మస్కట్‌ను విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఇటీవల పలు క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రెండు లక్షల నగదు బహుమతిని అందజేశారు. బాక్సర్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇవ్వగా ఆమెకు లాఠీని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### దేశ ప్రతిష్ఠ పెంచేది క్రీడాకారులే

మతాలకు అతీతంగా దేశ ప్రతిష్ఠతను పెంపొందించేది క్రీడాకారులే అని రేవంత్‌రెడ్డి కొనియాడారు. త్వరలో ఎల్బీ స్టేడియాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. 2018లో కొడంగల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి తాను ఓడిపోయానని, 2019లో ఎంపీగా గెలిచానని, ప్రస్తుతం సీఎంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. యువత వ్యసనాల జోలికి వెళ్లవద్దని, వ్యసనాల వల్ల ఏం సాధించలేరని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో క్రీడల సలహాదారులు జితేందర్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్, తెలంగాణా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, డీజీపీ జితేందర్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## హరియాణా ఎన్నికల ప్రచారానికి తెర

- ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీల ప్రయత్నాలు
- 5న పోలింగ్ నిర్వహణ



**చండీఘర్:** హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. అగ్రనేతల సభలు, వాడీవేడి ప్రసంగాలు, తిరుగుబాటుదారులపై చర్యలు, బుల్డోజర్ల ర్యాలీలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీలు తీవ్రంగా యత్నించాయి. ప్రచారంలో భాగంగా కొందరు అభ్యర్థులు నోట్ల వర్షం కురిపించడం గమనార్హం. కాంగ్రెస్, భాజపాల మధ్యే కీలక పోరు ఉంటుందని భావిస్తున్నారు. ఇరు పార్టీలకు చెందిన అనేకమంది రెబల్స్.. స్వతంత్రులుగా పోటీలో దిగడం ఆసక్తిగా మారింది. 5న నిర్వహించనున్న పోలింగ్‌లో ఏ పార్టీ వైపు ఓటర్లు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది.

### స్వతంత్రుల సవాల్..

గతంలో బీజేపీతో కలిసి ఉన్న జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఇప్పుడు ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్)తో కలిసి పోటీ చేస్తోంది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తో కలిసిముందుకెళ్తోంది. సీపీఎం, హరియాణా లోక్‌హిత్ పార్టీలు కూడా పోటీలో ఉన్నాయి. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు విషయంలో విఫలమైన ఆమ్‌ఆద్మీ పార్టీ కూడా దాదాపు అన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇటీవల కాంగ్రెస్, భాజపా నుంచి అనేక మంది రెబల్స్ పోటీలో నిలబడ్డారు. ఈ పరిణామాలు అన్ని పార్టీలకు సవాల్‌గా మారాయి.

### దళిత ఓటు ఎటో..?

పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీమరోసారి పైచేయి సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈ క్రమంలో మూడింట ఒకవంతు ఉన్న ఓబీసీ ఓటర్లను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు యత్నించడంతోపాటు దళిత ఓట్లనూ పొందేందుకు తీవ్రంగా కృషి చేసింది. రాష్ట్రంలో దాదాపు 20 శాతంగా ఉన్న దళితులను తమవైపు ఆకర్షించేందుకు కాంగ్రెస్ కూడా యత్నించింది. బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు, అగ్నిపథ్, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేసింది. హరియాణాలో 90 అసెంబ్లీ స్థానాలుండగా.. అందులో 17 ఎస్సీ రిజర్వుడు సీట్లు. వీటిలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఐదు కైవసం చేసుకోగా, కాంగ్రెస్ ఏడు, జేజేపీ నాలుగు, ఇతరులు ఒక చోట గెలుపొందారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఎస్సీ ఓట్లలో బీజేపీ 40 శాతం పొందగా.. కాంగ్రెస్‌కు 51 శాతం వచ్చినట్లు అంచనాలు వెలువడ్డాయి. మొత్తంగా రాష్ట్రంలో కీలక ఓటు బ్యాంకుగా ఉన్న జాట్‌లు, దళితులను ఈ రెండు పార్టీలే కాకుండా జేజేపీఏఎస్పీ, ఐఎన్ఎల్‌డీబీఎస్పీలు కూటమిలు ప్రభావితం చేసే అవకాశాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

## దాడుల్లో ముగ్గురు హమాస్ సీనియర్ నేతల మృతి

- వెల్లడించిన ఇజ్రాయెల్ సైన్యం




**జెరుసలాం:** మూడు నెలల క్రితం జరిగిన దాడిలో ముగ్గురు హమాస్ సీనియర్ నేతలు మరణించినట్లు ఇజ్రాయిల్ మిలిటరీ గురువారం పేర్కొన్నది. గాజాలో జరుగుతున్న పోరులో గత ఏడాది నుంచి పాలస్తీనా ఆపరేటివ్స్‌తో ఇజ్రాయిల్ యుద్ధం సాగిస్తున్నది. వైమానిక దాడిలో హమాస్ ప్రభుత్వ నేత రాహి ముష్తాహ ప్రాణాలు కోల్పోయినట్లు మిలిటరీ తెలిపింది. హమాస్ పొలిటికల్ బ్యూరోలో సెక్యూర్టీ హోదాలో ఉన్న సమేహ్ అల్ సిరాజ్ కూడా మృతి చెందినట్లు తెలిపారు. కమాండర్ సామి ఖుదె కూడా ఆ దాడుల్లో మృతి చెందాడు. హమాస్‌లో ముష్తాహ్.. సీనియర్ ఆపరేటివ్‌గా ఉన్నాడు. హమాస్ ఫోర్స్‌కు చెందిన నిర్ణయాలను ఆయనే తీసుకునేవారు. హమాస్ టాప్ లీడర్ యాహ సిన్వార్‌కు రైట్ హ్యాండ్‌గా ముష్తాహ్‌ను గుర్తించారు. 2015 నుంచి ముష్తాహ్‌ను గ్లోబల్ ఉగ్రవాదిగా అమెరికా పరిగణించింది. హమాస్ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా సిరాజ్, అంతర్గత సెక్యూర్టీ ఏజెన్సీ నేతగా ఓదేహ్ ఉన్నట్లు ఈసీఎఫ్ఆర్ పేర్కొన్నది.



## హత్యాచార బాధితురాలి విగ్రహం ఆవిష్కరణ

### బాధితురాలిని అగౌరవ పరిచేలా ఉందని కొందరి విమర్శలు

### మరోమారు చెలరేగిన వివాదం

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో హత్యాచారానికి గురైన బాధిత ట్రైనీ డాక్టర్ విగ్రహాన్ని అక్కడ ఆవిష్కరించారు. 'క్రై ఆఫ్ ది హవర్' పేరుతో దీనిని ఏర్పాటు చేశారు. దీంతో ఈ అంశంపై మరో వివాదం చెలరేగింది. కళాకారుడు అసిత్ సైన్ 'క్రై ఆఫ్ ది హవర్' పేరుతో ఒక విగ్రహాన్ని రూపొందించారు. ఒక మహిళ ఏడుస్తున్నట్లుగా ఉన్న ఈ విగ్రహం జీవితంలోని చివరి నిమిషాల్లో బాధితురాలు పడిన వేదన, భయానక స్థితిని ప్రతిబింబిస్తున్నదని పేర్కొన్నారు. ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం ఉన్న భవనం సమీపంలో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాగా, హత్యాచార బాధితురాలి విగ్రహం ఏర్పాటుపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. బాధితురాలిని అగౌరవ పరిచేలా, చాలా అసహ్యకరంగా ఈ విగ్రహం ఉందని కొందరు విమర్శించారు. అత్యాచార బాధితురాలి విగ్రహాన్ని దేశంలో ఎక్కడైనా, ఎప్పుడైనా ఏర్పాటు చేశారా? అని ఒకరు ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేత కునాల్ ఘోష్ కూడా ఈ విగ్రహంపై స్పందించారు. బాధితురాలి పేరు, గుర్తింపును వెల్లడించ కూడదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు ఇది విరుద్ధమని అన్నారు. 'బాధ్యతాయుతులైన వారెవరూ అలా చేయరు. కళ పేరుతో కూడా చేయలేరు. నిరసనలు, న్యాయం కోసం డిమాండ్లు ఉన్నాయి. కానీ బాధతో కూడిన అమ్మాయి ముఖంతో విగ్రహం సరైనది కాదు. బాధితురాలి ఫొటోలు లేదా విగ్రహాలు వినియోగించకూడదని మార్గదర్శకాలు ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.

## సింగపూర్ మాజీ మంత్రి సుబ్రమణియం ఈశ్వరన్‌కు జైలుశిక్ష



**ఢిల్లీ:** సింగపూర్ ప్రభుత్వంలో సీనియర్ క్యాబినెట్ మంత్రి సుబ్రమణియం ఈశ్వరన్‌కు ఓ కేసులో 12 నెలల జైలుశిక్ష పడింది. ప్రభుత్వంలో ఉన్న సమయంలో గిఫ్ట్‌లు స్వీకరించినట్లు 62 ఏళ్ల ఈశ్వరన్ కోర్టులో అంగీకరించారు. సుమారు 4 లక్షల డాలర్ల విలువైన బహుమతుల్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫార్ములా వన్ గ్రాండ్ ప్రి, బ్రాంప్టన్ టీలైన్ బైస్కిల్, మద్యం, ప్రైవేటు విమానంలో ప్రయాణం లాంటి గిఫ్ట్‌స్‌ను స్వీకరించినట్లు నిర్ధారించారు. సింగపూర్ హైకోర్టులో జస్టిస్ విన్సెంట్ హూంగ్ ఈ కేసులో తీర్పునిచ్చారు. రవాణాశాఖ మాజీ మంత్రిగా చేసిన సుబ్రమణియం.. అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్టోబర్ 7వ తేదీన మంత్రి ఈశ్వరన్ జైలులో లొంగిపోనున్నారు. గత 50 ఏళ్లలో జైలుశిక్ష పడిన రాజకీయవేత్తగా మంత్రి ఈశ్వరన్ నిలిచారు.

### వైవాహిక అత్యాచారాన్ని

## నేరంగా పరిగణించలేం

### 'సుప్రీం'లో కేంద్రం అఫిడవిట్..!

**ఢిల్లీ:** వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ మేరకు కేంద్రం సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే, ఆయా పిటిషన్లు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించడం సుప్రీంకోర్టు పరిధిలో లేదని చెప్పింది. ఇది చట్టపరమైన సమస్య కంటే.. సమాజానికి సంబంధించిన సమస్యగా పేర్కొంది. ఇది మొత్తం సమాజంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుందని.. ఇప్పటికే చట్టంలో పలు శిక్షలు సైతం ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. ఈ విషయంలో రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోకుండా.. అభిప్రాయానికి రాలేమని స్పష్టం చేసింది. అయితే, ప్రతీ వివాహం మహిళ సమ్మతితో జరగడం లేదన్న విషయాన్ని మాత్రం కేంద్రం అంగీకరించింది. ఏదైనా ఉల్లంఘనలకు పాల్పడితే చట్టరీత్యా శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని.. వివాహంలో జరిగే.. జరిగే ఉల్లంఘనలకు తేడా ఉంటుందని చెప్పింది. దాంపత్య జీవితంలో తమ జీవిత భాగస్వామి నుంచి శారీరక సంబంధాన్ని కోరుకోవడం సహజమేనని.. అయితే, భార్య ఇష్టానికి వ్యతిరేకంగా ఒత్తిడి చేసే హక్కు భర్తకు లేదని పేర్కొంది. అత్యాచార నిరోధక చట్టాల కింద శిక్ష విధించడం ఎక్కువని.. వివాహంలో మహిళ సమ్మతిని రక్షించేందుకు పార్లమెంట్ ఇప్పటికే చర్యలు తీసుకుందని.. ఇందులో వివాహితలపై క్రూరత్వానికి పాల్పడే వారిని శిక్షించే చట్టాలు సైతం ఉన్నాయని తెలిపింది. మహిళల స్వేచ్ఛ, గౌరవం, హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపింది.

## రోహిత్ అత్యుత్తమ సారథి: హర్భజన్ సింగ్



**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కంటే రోహిత్ శర్మ అత్యుత్తమ సారథని మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. రోహిత్ శర్మ ఆటగాళ్లతో సన్నిహితంగా ఉంటాడని, ధోనీ మాత్రం అలా కాదని తెలిపాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హర్భజన్ సింగ్.. రోహిత్, ధోనీ కెప్టెన్సీ మధ్య ఉన్న తేడాను వివరించాడు.

'ధోనీ కంటే రోహిత్ శర్మ కెప్టెన్సీనే నాకిష్టం. ఎందుకంటే రోహిత్ శర్మ ఆటగాళ్లకు ప్రాధాన్యత ఇస్తాడు. వారి దగ్గరకు వెళ్లి మాట్లాడుతాడు. వారికేం కావాలో అడుగుతాడు. అందుకే ఆటగాళ్లంతా రోహిత్ శర్మతో సన్నిహితంగా ఉంటారు. కానీ ధోనీ అలా కాదు. అతని కెప్టెన్సీ శైలి భిన్నంగా ఉంటుంది. ఎవరితోనూ ఏ మాట్లాడడు. బౌలర్ దగ్గరకు వెళ్లి కనీసం ఎలాంటి ఫీల్డ్ కావాలని కూడా అడగడు. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలని భావిస్తాడు.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ గొప్ప ఆటగాడని హర్భజన్ సింగ్ ప్రశంసించాడు. మెగా టోర్నీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని కొనియాడాడు. 'విరాట్ కోహ్లీ గొప్ప ఆటగాడు. మెగా టోర్నీలు, కీలక ఫైనల్లో ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తాడు. గత టీ20 ప్రపంచకప్ ఫైనల్లోనూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టీ20 ఫార్మాట్‌లో పరుగులు ఎలా చేయాలో కోహ్లీకి బాగా తెలుసు. 'అని భజ్జీ చెప్పుకొచ్చాడు.

ఐపీఎల్ 2024 సీజన్‌లో ఆర్‌సీబీతో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో సీఎస్‌కే ఓటమిపాలవ్వడంతో ధోనీ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడని, డ్రెస్సింగ్ రూమ్‌కు సమీపంగా ఉన్న టీవీని పగలగొట్టాడని కూడా హర్భజన్ సింగ్ తెలిపాడు. 'సంచలన విజయంతో ఆర్‌సీబీ సంబరాలు చేసుకుంది. ఈ మ్యాచ్‌కు నేను కామెంటేటర్‌గా వ్యవహరించాను. మ్యాచ్ అనంతరం ఆర్‌సీబీ సంబరాలను పై నుంచి చూశాను. ఓవైపు బెంగళూరు ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా.. మరోవైపు సీఎస్‌కే ఆటగాళ్లు వారికి కరాచలనం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. కానీ, ఆర్‌సీబీ ఆటగాళ్లు వారిని పట్టించుకోలేదు. దాంతో అసహనానికి గురైన ధోనీ.. అక్కడి నుంచి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాడు. అలా వెళ్లే క్రమంలో బయట ఉన్న ఓ స్క్రీన్‌ను చేతిలో బలంగా బాదాడు. ప్రతీ ఆటగాడికి భావోద్వేగాలు ఉంటాయి. క్రీడల్లో ఇలాంటి ఘటనలు సహజం.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

## టీమిండియా మాజీ కెప్టెన్‌కు ఈడీ నోటీసులు



**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా మాజీ కెప్టెన్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్ చిక్కుల్లో పడ్డినట్లు తెలుస్తోంది. మనీలాండరింగ్ కేసులో అజారుద్దీన్ కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట హాజరు కావాలని ఆయనకు అందజేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) అధ్యక్షులుగా ఉన్న సమయంలో అవినీతి జరిగినట్లు అజారుద్దీన్ పై ఆరోపణలు వచ్చాయి. దీంతో అసోసియేషన్ లో జరిగిన అక్రమాలపై ఈడీ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసు ఆధారంగా ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసింది. ఇందులో భాగంగా అజారుద్దీన్‌కు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అజహర్ పై దాదాపు 20కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ క్రికెట్ స్టేడియం కోసం డీజిల్ జనరేటర్లు, అగ్నిమాపక యంత్రాలు, తదితరాల సేకరణలో రూ. 20 కోట్లు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరిలో అజారుద్దీన్ ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి సుప్రీంకోర్టు తప్పించింది. సంస్థ పనితీరును పరిశీలించేందుకు రిటైర్డ్ జస్టిస్ ఎల్ నాగేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించారు. క్రికెట్ బాడీలో అవినీతి, ఎన్నికల సమస్యలను పరిష్కరించే పనిని నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టు అప్పగించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అజహారుద్దీన్ పోటీ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి గోపీనాథ్ పై ఓటమిపాలయ్యాడు. అజహారుద్దీన్ టీమిండియా జట్టులో సుదీర్ఘకాలం రాణించాడు. కొంతకాలం కెప్టెన్ గానూ జట్టును నడిపించాడు. తన కెరీర్ లో మొత్తంగా 99 టెస్టులు, 334 వన్డేలు ఆడాడు.. టెస్టుల్లో 6,215 పరుగులు చేయగా.. యాబై ఓవర్ల ఫార్మాట్ లో 9,378 పరుగులు సాధించాడు. అయితే, ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొన్నాడు. హెచ్ సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ అజహరుద్దీన్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

## ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా యూవీ..!




**విశ్వంభర, క్రీడావిభాగం :** ఐపీఎల్ 2025 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ సమాయాత్తం అవుతోంది. తమ జట్టు ప్రక్షాళనకు పూనుకున్న ఢిల్లీ మేనేజ్‌మెంట్.. ముందుగా హెడ్ కోచ్ రికీ పాంటింగ్‌పై వేటు వేసింది. తదుపరి హెడ్ కోచ్‌గా టీమిండియా దిగ్గజ ఆటగాళ్లను నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే వరల్డ్ కప్ విన్నర్స్ యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలతో ఢిల్లీ మేనేజ్‌మెంట్ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐపీఎల్ 2025 మెగా వేలానికి సంబంధించిన రిటెన్షన్ రూల్స్‌ను బీసీసీఐ ప్రకటించింది. అక్టోబర్ 31లోగా తమ రిటెన్షన్ జాబితాలను సమర్పించాలని 10 ఫ్రాంచైజీలను బీసీసీఐ అదేశించింది. ఐదుగురిని నేరుగా రిటైన్ చేసుకోవడంతో ఒక ఆర్‌టీమ్ కార్డ్‌కు అవకాశం కల్పించింది. పర్స్ వాల్యూను రూ. 120 కోట్లకు పెంచింది.

ఇక రికీ పాంటింగ్‌ను తొలగించిన అనంతరం రాహుల్ ద్రవిడ్‌తో ఆ స్థానాన్ని భర్తీ చేయాలని ఢిల్లీ క్యాపిటల్స్ భావించింది. కానీ అతను రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఢిల్లీ.. కొత్త కోచ్ కోసం అన్వేషణ మొదలుపెట్టింది. విదేశీ కోచ్‌ల కంటే స్వదేశీ ఆటగాళ్లనే నియమించుకోవాలని భావిస్తోంది. ప్రతిభ కలిగిన ఇండియన్ ప్లేయర్లను జట్టులోకి తీసుకురావాలంటే స్వదేశీ కోచ్‌లే ఉండాలని నమ్ముతోంది. ఈ క్రమంలోనే యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఢిల్లీ డైరెక్టర్ సౌరవ్ గంగూలీకి యువరాజ్ సింగ్‌తో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో అతనే హెడ్ కోచ్‌గా ఎంపికవుతాడనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఇప్పటికే యువరాజ్ సింగ్.. కొంతమంది కుర్రాళ్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. అభిషేక్ శర్మ, దేవదత్ పడిక్కల్ వంటి కుర్రాళ్లకు స్పెషల్ ట్రైనింగ్ ఇచ్చాడు. సపోర్ట్ స్టాఫ్ కూడా పూర్తిగా స్వదేశీ ఆటగాళ్లే ఉండాలని ఢిల్లీ క్యాపిటల్స్ భావిస్తోంది. టీమిండియా మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే, మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్, ఇర్ఫాన్ పఠాన్‌లను అసిస్టెంట్ కోచ్‌లుగా నియమించుకోవాలనుకుంటోంది. లక్నో సూపర్ జెయింట్స్, పంజాబ్ కింగ్స్, కేకేఆర్, రాజస్థాన్ రాయల్స్ ఇప్పటికే కోచ్‌లను నియమించుకోగా.. ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం ఇంకా జాప్యం చేస్తోంది. హెడ్ కోచ్ ఖరారు అయితేనే.. రిటెన్షన్ జాబితాను సిద్ధం చేసుకోవడాని ఆస్కారం ఉంటుంది. లేకుంటే సౌరవ్ గంగూలీపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తమ కెప్టెన్ రిషభ్ పంత్‌ను రిటైన్ చేసుకుంటామని ఇప్పటికే ఢిల్లీ మేనేజ్‌మెంట్ స్పష్టం చేసింది.

## సెంచరీతో అదరగొట్టిన అభిమన్యు



**విశ్వంభర, క్రీడావిభాగం :** ప్రతిష్టాత్మక ఇరానీ కప్ 2024లో రెస్టాఫ్ ఇండియా పోరాడుతోంది. ముంబైతో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెస్టాఫ్ ఇండియా.. తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 4 వికెట్లకు 289 పరుగులు చేసింది. అభిమన్యు ఈశ్వరన్(212 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 151 బ్యాటింగ్) అజేయ శతకంతో రాణించాడు. అతనికి తోడుగా క్రీజులో ధ్రువ్ జురెల్(30 బ్యాటింగ్) ఉన్నాడు. రెస్టాఫ్ ఇండియా ఇంకా 248 పరుగుల వెనుకంజలో ఉంది. ముంబై బౌలర్లలో మోహిత్ అవాస్థి(2/66) రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ జునేద్ ఖాన్, తనుష్ కోటియన్ తలో వికెట్ తీసారు. 536/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన ముంబై మరో మూడు ఓవర్లు మాత్రమే ఆడి ఒక పరుగు మాత్రమే జోడించి తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. 141 ఓవర్లలో 537 చేసింది. సర్ఫరాజ్ ఖాన్(286 బంతుల్లో 25 ఫోర్లు, 4 సిక్స్‌లతో 222 నాటౌట్) అజేయ ద్విశతకంతో రాణించగా.. అతనికి తనూష్ కోటియన్(124 బంతుల్లో 6 ఫోర్లతో 64) అండగా నిలిచాడు. రెస్టాఫ్ ఇండియా బౌలర్లలో ముఖేష్ కుమార్(5/110) ఐదు వికెట్లతో సత్తా చాటగా.. యశ్ దయాల్(2/89), ప్రసిధ్ కృష్ణ(2/102) రెండేసి వికెట్లు పడగొట్టారు. సరాన్ష్ జైన్(1/82)కు ఓ వికెట్ దక్కింది.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్టాఫ్ ఇండియా ఆదిలోనే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(9) వికెట్ కోల్పోయింది. క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్(32)తో కలిసి అభిమన్యు ఈశ్వరన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కీలక భాగస్వామ్యం అనంతరం సాయి సుదర్శన్ ఔటవ్వగా.. క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్(16) కూడా నిరాశపరిచాడు. ఈ క్రమంలో అభిమన్యూ ఈశ్వరణ్ 117 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. ఇషాన్ కిషన్(38) నిలకడగా ఆడినా భారీ స్కోర్ చేయలేకపోయాడు.

## ధోనీ టీవీ పగలగొట్టలేదు.. అంతా ఫేక్: సీఎస్‌కే




**విశ్వంభర, క్రీడావిభాగం :** ఐపీఎల్ 2024 సీజన్ సందర్భంగా టీమిండియా దిగ్గజం, చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ సహనం కోల్పోయి టీవీ పగలగొట్టాడని మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలను ఆ జట్టు వర్గాలు ఖండించాయి. ఈ వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని, అంతా ఫేక్ న్యూస్ అంటూ సీఎస్‌కే ఫిజియోథెరపిస్ట్ టామ్మీ సిమ్‌సెక్ సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో ఆర్‌సీబీతో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో సీఎస్‌కే ఓటమిపాలవ్వడంతో ధోనీ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడని, డ్రెస్సింగ్ రూమ్‌కు సమీపంగా ఉన్న టీవీని పగలగొట్టాడని హర్భజన్ సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. ఆ మ్యాచ్‌కు తాను కామెంటేటర్‌గా వ్యవహరించినట్లు కూడా చెప్పుకొచ్చాడు.

దాంతో ఈ వార్త నెట్టింట చర్చనీయాంశమైంది. ప్రశాంతంగా ఉండే ధోనీ సహనం కోల్పోయి టీవీ పగలగొట్టాడా? అని ఫ్యాన్స్ ఆశ్చర్యపోయారు. అయితే ఈ వార్తలను చూసి అవాక్కైన సీఎస్‌కే ఫిజియోథెరపిస్ట్ టామ్మీ సిమ్‌సెక్.. ఇదంతా చెత్త అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ వార్తలను ఖండించాడు.'ఇదంతా చెత్త. ధోనీ దేన్ని పగలగొట్టలేదు. ఏ మ్యాచ్ తర్వాత కూడా అతను నాకు కోపంగా కనిపించలేదు. ఇవన్నీ ఫేక్ న్యూస్'అని పేర్కొన్నాడు.



## 102 డిగ్రీల జ్వరంతో శార్దూల్ బ్యాటింగ్

### లక్నో వేదికగా ముంబయి, రెస్టాఫ్ ఇండియా మ్యాచ్

### మ్యాచ్ తర్వాత లక్నోలోని ఆసుపత్రికి తరలింపు

**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా స్టార్ క్రికెటర్ శార్దూల్ ఠాకూర్ తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాడు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ముంబయి ఆల్‌రౌండర్‌కు లక్నోలోని ఓ స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తెలిపింది. కాగా, 102 డిగ్రీల జ్వరంతో బాధపడుతూనే బుధవారం ఇరానీ కప్‌లో భాగంగా లక్నో వేదికగా రెస్టాఫ్ ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో ముంబయి తరపున ఆడాడు. అజేయ ద్విశతకంతో మెరిసిన సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి శార్దూల్ (36) తొమ్మిదో వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యం అందించాడు.

మ్యాచ్ మొదటి రోజే శార్దూల్ తేలికపాటి జ్వరంతో బాధపడుతున్నాడు. అయితే, రెండో రోజు (బుధవారం) దాదాపు రెండు గంటలపాటు బ్యాటింగ్ చేసిన తర్వాత అతని ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారింది. దాంతో ఈ ఆల్‌రౌండర్ ఇన్నింగ్స్ మధ్యలో రెండుసార్లు విరామం తీసుకోవలసి వచ్చింది. జ్వరంతోనే బ్యాటింగ్ చేసి ఆటపై తనకు ఉన్న ప్రేమను చాటాడు. ఇక శార్దూల్ ఇన్నింగ్స్ ముగిసిన వెంటనే ముంబయి టీమ్ మేనేజ్‌మెంట్ అతన్ని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లింది. రాత్రి అక్కడే వైద్యుల బృందం అతని ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించింది. ఇప్పటికే అతనికి మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు.

### శ్రీలంక స్పిన్నర్

## ప్రవీణ్ జయవిక్రమపై ఐసీసీ నిషేధం




**విశ్వంభర, క్రీడావిభాగం :** శ్రీలంక లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రవీణ్ జయవిక్రమపై ఐసీసీ కొరడా ఝుళిపించింది. ఈ లంక స్పిన్నర్ ను ఏడాది పాటు అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి బ్యాన్ విధించారు. ఐసీసీ అవినీతి నిరోధక కోడ్‌ను ఉల్లంఘించినట్లు జయవిక్రమ అంగీకరించడంతో ఆయనపై నిషేధం విధించారు. ఇందులో భాగంగా కోడ్‌లోని ఆర్టికల్ 2.4.7ని జయవిక్రమ ఉల్లంఘించినట్లు తేలింది. జయవిక్రమ చివరిసారిగా 2022లో శ్రీలంక తరపున ఆడాడు. అంతకముందు జయవిక్రమపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అవినీతి నిరోధక కోడ్‌ను ఉల్లంఘించిందని అభియోగాలు మోపింది. 25 ఏళ్ల జయవిక్రమ మూడు వేర్వేరు కోడ్‌లను ఉల్లంఘించారని ఐసీసీ ఆరోపించింది. అంతర్జాతీయ క్రికెట్ తో పాటు 2021 లంక ప్రీమియర్ లీగ్ సీజన్ లో అతనిపై అభియోగాలు మోపింది. జయవిక్రమ లంక ప్రీమియర్ లీగ్ లో 2021 లో జఫ్న కింగ్స్ తరపున ఆడగా.. ఆ జట్టు టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత 2024 సీజన్ లో జయ విక్రమ దంబుల్లా సిక్సర్ తరపున ఆడాడు. తనపై వచ్చిన ఆరోపణలపై స్పందించేందుకు ఆగస్ట్ 6 నుంచి 20 వరకు ఈ గడువు ఇచ్చింది. ఆర్టికల్ 2.4.4 మరియు ఆర్టికల్ 2.4.7 ప్రకారం ICC అతనిపై నేరం మోపింది. ఆర్టికల్స్ 1.7.4.1 అదేవిధంగా 1.8.1 ప్రకారం.. అంతర్జాతీయ మ్యాచ్ ఛార్జీలతో పాటు లంక ప్రీమియర్ లీగ్ ఛార్జీకి సంబంధించి ఐసీసీ చర్యలు తీసుకోనున్నట్టు వార్తలు వచ్చాయి. జయవిక్రమ రెండేళ్లుగా శ్రీలంక తరపున ఆడలేదు. శ్రీలంక తరపున మూడు ఫార్మాట్ లలో ఆడిన ఈ స్పిన్నర్ ఖాతాలో మొత్తం 32 అంతర్జాతీయ వికెట్లు ఉన్నాయి.

### మహిళల టీ20 వరల్డ్ కప్‌లో

## బోణీ కొట్టిన బంగ్లాదేశ్




**షార్జా :** ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2024 గురువారం ప్రారంభమైంది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ vs స్కాట్లాండ్ తలపడ్డాయి. షార్జా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు విజయం సాధించింది. బంగ్లాదేశ్ జట్టు దశాబ్దం తర్వాత మహిళల టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో గెలుచింది. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 16 పరుగుల తేడాతో స్కాట్‌లాండ్‌ను ఓడించింది. దీంతో.. పదేళ్ల తర్వాత టీమ్ విజయం సాధించడంతో జట్టులోని ఆటగాళ్లంతా భావోద్వేగానికి గురయ్యారు.

దీని వెనుక రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి.. టీ20 వరల్డ్‌కప్‌ను 10 ఏళ్ల తర్వాత గెలుచుకోవడం, రెండో కారణం ఈ టీ20 వరల్డ్‌కప్‌ను బంగ్లాదేశ్‌లో నిర్వహించాల్సి ఉండగా, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అక్కడ నిర్వహించలేకపోయారు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ కెప్టెన్ నిగర్ సుల్తానా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. బంగ్లాదేశ్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. బంగ్లాదేశ్‌లో శోభనా మోస్త్రి 36, షాతి రాణి 29, కెప్టెన్ సుల్తానా 18 పరుగులతో రాణించారు.

స్కాట్లాండ్ తరఫున సస్కియా హోర్లీ మూడు వికెట్లు తీసింది. 120 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ జట్టు 20 ఓవర్లు ఆడి ఏడు వికెట్లు కోల్పోయి 103 పరుగులు మాత్రమే చేసింది. ఓపెనర్ సారా బ్రీస్ 49 పరుగులు చేసినప్పటికీ, ఇతర బ్యాట్స్‌మెన్లు రాణించలేకపోయారు. బంగ్లాదేశ్‌లో రీతూ మోని రెండు వికెట్లు పడగొట్టింది. 2023, 2020, 2018, 2016 టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. జట్టు చివరి విజయం 2014 టీ20 ప్రపంచకప్‌లో ఉంది. బంగ్లాదేశ్.. శ్రీలంక, ఐర్లాండ్‌లను ఓడించినప్పుడు ప్రపంచ కప్‌కు బంగ్లాదేశ్ ఆతిథ్యం ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ.. బంగ్లాదేశ్ జట్టుకు విజయం నమోదు కాలేదు.

## భారత స్టాక్ మార్కెట్ భారీ పతనం



**విశ్వంభర, బిజినెస్ :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నడుమ స్టాక్ మార్కెట్ సూచీలు కుప్పకూలాయి. దేశీయ స్టాక్ మార్కెట్‌లు గురువారం భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,729.77 పాయింట్లు లేదా 2.05% పతనమై 82,536.52 వద్ద ముగిసింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ 529.95 పాయింట్లు లేదా 2.05% క్షీణించి 25,266.95 వద్దకు పడిపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో ఒక్క జేఎస్‌డబ్ల్యూ స్టీల్ మాత్రమే గ్రీన్‌లో ట్రేడవుతోంది. మిగిలిన షేర్లు స్టాక్‌లు ఎరుపు రంగులో ఉన్నాయి. లార్సెన్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటర్స్, రిలయన్స్, మారుతీ సుజుకీ టాప్ లూజర్స్‌గా ఉన్నాయి.

అదేవిధంగా నిఫ్టీ 50లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఓఎన్‌జీసీ మాత్రమే లాభపడగా, బీపీసీఎల్, శ్రీరామ్ ఫైనాన్స్, లార్సెన్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటర్స్ భారీ నష్టాలను చవి చూశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ఫలితంగా భారత్ వాణిజ్యంపై ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న భయాలకు తోడు ముడి చమురు ధరలు పెరగడం కూడా స్టాక్ మార్కెట్ పతనానికి మరో కారణం అయింది.

భౌగోళిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తమైన మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో భారతీయ స్టాక్ మార్కెట్లు భారీ పతనంలో కొనసాగుతున్నాయి. 7071 డాలర్ల వద్ద కొనసాగిన బ్యారెల్ ముడి చమురు ధర ప్రస్తుతం 75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అలాగే ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌కు సంబంధించి నిబంధనలను ఇటీవల సెబీ కఠినతరం చేయడం కూడా మార్కెట్ నష్టాలకు మరో కారణం అని చెప్పుకోవచ్చు. ఈ రోజు చమురు, గ్యాస్, ఉక్కు, బ్యాంకింగ్‌తో పాటు అన్ని ఇతర రంగాల షేర్లలో అమ్మకాల జోరు కనిపిస్తోంది.

## ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ బంపర్ ఆఫర్



**విశ్వంభర, బిజినెస్ :** దసరా పండగ సీజన్ పురస్కరించుకొని.. దిగ్గజ ఎలక్ట్రిక్ వెహికిల్ తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ స్పెషల్ సేల్ ప్రకటించింది. బిగ్గెస్ట్ ఓలా సీజన్ సేల్‌ను (BOSS) అక్టోబర్ 3 (గురువారం) నుంచి మొదలు పెట్టింది. దీంట్లో భాగంగానే తాజాగా ప్రముఖ మోడల్ ఎస్1 ఎక్స్ స్కూటర్‌ను రూ. 49,999 కే అందిస్తున్నట్లు ప్రకటించింది కంపెనీ. ఇది లిమిటెడ్ యూనిట్లకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది. ఇంకా.. హైపర్ ఛార్జింగ్ క్రెడిట్స్, మూవ్‌ఓస్ ప్లస్ అప్‌గ్రేడ్, యాక్సెసరీస్‌లపై డీల్స్ వంటి సుమారు రూ. 40 వేల విలువైన బెనిఫిట్స్‌ను ఫెస్టివ్ ఆఫర్ కింద అందిస్తుంది ఓలా ఎలక్ట్రిక్. పండగ సీజన్ సందర్భంగా.. కస్టమర్ల కోసం ఈ ఆఫర్‌ను తీసుకురావడం సంతోషం ఉందని చెప్పారు ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ అండ్ ఎండీ భవీశ్ అగర్వాల్. ఇప్పటివరకు తాము ప్రకటించినటువంటి ఆఫర్లలో ఇదే అత్యుత్తమైనదని వివరించారు.

ఓలా S1X 2 కిలో వాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యం కలిగిన స్కూటర్‌ను రూ. 49,999 కే అందించనున్నట్లు ఓలా ప్రకటించింది. ఈ స్టాక్ ఉన్నంత వరకు ఇది వర్తిస్తుంది.

S1 ఎక్స్ 2kwh బ్యాటరీపై రూ. 25 వేల ఫ్లాట్ డిస్కౌంట్ అందిస్తుంది. ఇంకా.. ఎస్ 1 పోర్ట్ ఫోలియోపై రూ. 15 వేల వరకు క్యాష్ డిస్కౌంట్ అందించనున్నట్లు తెలిపింది కంపెనీ. రూ. 7 వేల విలువైన 8 ఏళ్లు లేదా 80 వేల కిలోమీటర్ల బ్యాటరీ వారెంటీ కూడా ఫ్రీ. ఎంపిక చేసిన కొన్ని క్రెడిట్ కార్డు ఈఎంఐలపై రూ. 5 వేల వరకు తగ్గింపు ఉంది.

రూ. 6 వేల విలువైన మూవ్ OS+ అప్‌గ్రేడ్, రూ. 7 వేల విలువైన హైపర్ ఛార్జింగ్ క్రెడిట్స్ ఉచితంగా అందించనుంది ఓలా ఎలక్ట్రిక్. ఓలా ఎస్1 పోర్ట్‌ఫోలియోలో పలు రకాల స్కూటర్లను కంపెనీ విక్రయిస్తోంది. S1 ప్రో రూ. 1.34 లక్షలు, ఎస్1 ఎయిర్ రూ. 1.07 లక్షలకు అందుబాటులో ఉన్నాయి.

ఇక S1 ఎక్స్ పోర్ట్‌ఫోలియోలో 2,3,4 కిలో వాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంతో ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయిస్తోంది కంపెనీ. వీటి ధరలు వరుసగా రూ. 74,999; రూ. 87,999; రూ. 1.01 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. గత కొంతకాలంగా ఎలక్ట్రిక్ వాహనాలపై భారతీయులకు మోజు పెరిగిందని చెప్పొచ్చు. పెట్రోల్, డీజిల్ ధరల ఖర్చు తగ్గించుకునేందుకు ఎలక్ట్రిక్ వాహనాలవైపు మొగ్గుచూపుతున్నారు. ఇక్కడ సింగిల్ ఛార్జ్‌తో మంచి రేంజ్ వస్తుండటం, మంచి మంచి ఫీచర్లతో వస్తుండటం వంటివి కారణాలుగా చెప్పొచ్చు.

# పవన్ కళ్యాణ్‌కు యోగిబాబు థ్యాంక్స్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. ఇక తాజాగా పవన్ తమిళ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో సినిమాల గురించి ప్రస్తావన వచ్చింది. ఈ క్రమంలో తమిళంలో ఫేవరేట్ కమెడియన్, డైరెక్టర్ గురించి పవన్‌కు ప్రశ్న ఎదురైంది. తమిళంలో తనకు యోగి బాబు అంటే ఇష్టం అని పవన్ చెప్పారు. ఆయన నటన చాలా బాగుంటుందన్నారు. ఇటీవల ఆయన నటించిన ఓ సినిమా చూశానని, బాగా నటించారన్నారు. బాగా నవ్వుకున్నట్లు చెప్పారు. ఇక డైరెక్టర్ గురించి మాట్లాడుతూ.. లోకేష్ కనగరాజ్ ఫిలిం మేకింగ్ నచ్చుతుందన్నారు. లియో, విక్రమ్ సినిమాలను చూశానని, అతడి ఫిలిం మేకింగ్ బాగుందన్నారు. పవన్ వ్యాఖ్యలపై యోగిబాబు స్పందించారు. పవన్ కు ధన్యవాదాలు తెలియజేశారు. "ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి ధన్యవాదాలు. మీరు చెప్పిన మాటలు.. నన్ను ఎంతో ఉత్సాహపరిచాయి." అని యోగిబాబు ట్వీట్ చేశారు. లోకేష్ కనగరాజ్ సైతం పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. "ఈ మాటలు వినడం నిజంగా గర్వంగా ఉంది. మీరు నా పనిని ఇష్టపడ్డారని తెలిసి ఎంతో సంతోషపడిపోయాను. మీకు పెద్ద కృతజ్ఞతలు సార్. "అని లోకేష్ అన్నారు.

# ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు నాగవంశీ క్షమాపణలు



ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి రోజు రికార్డ్ స్థాయి ఓపెనింగ్స్ ను రాబట్టి, మొదటి మూడు రోజుల్లో రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన 'దేవర' సినిమాకు విజయోత్సవ వేడుక నిర్వహించాలని ఫ్యాన్స్ తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు భావించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ప్లాన్ చేసినప్పటికీ ఫ్యాన్స్ పెద్ద ఎత్తున హాజరు కావడంతో గందరగోళ పరిస్థితి కారణంగా వేడుక రద్దు అయింది. ఆ సమయంలోనే సినిమా విజయం సాధించడం ఖాయం, రిలీజ్ తర్వాత విజయోత్సవ సభను నిర్వహించుకుందాం అంటూ యూనిట్ సభ్యులు ఫ్యాన్స్ కి హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే దేవర సినిమాకు మంచి స్పందన రావడంతో తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడైనా ఓపెన్ ప్లేస్ లో భారీగా విజయోత్సవ వేడుక జరుపాలని మేకర్స్ భావించారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో ఒకవైపు దేవి నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి, మరో వైపు దసరా వేడుకలు జరుగుతున్న కారణంగా సినిమా ఫంక్షన్ కు అనుమతులు వచ్చే పరిస్థితి లేదు. దాంతో దేవర సినిమా విజయోత్సవ సభ జరపడం సాధ్యం కావడం లేదు అంటూ నిర్మాత నాగ వంశీ అధికారికంగా ప్రకటించారు. సోషల్ మీడియా ద్వారా ఆయన చేసిన ప్రకటన ఫ్యాన్స్ కి నిరుత్సాహంను కలిగిస్తుంది. సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ ద్వారా నిర్మాత నాగవంశీ 'దేవర' విజయోత్సవ వేడుక సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఆయన ఎక్స్‌లో... దేవర సినిమాకు భారీ విజయాన్ని కట్టబెట్టిన ప్రేక్షకులకు, ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి ధన్యవాదాలు. సినిమా విడుదలకు ముందు జరగాల్సిన ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగక పోవడంతో తెలుగు రాష్ట్రాల్లోని తారక్ అన్న అభిమానులు విజయోత్సవ వేడుక కోసం చాలా ఆసక్తిగా ఉన్నారు. అందుకోసం మేము చాలా ప్రయత్నాలు చేశాం. కానీ దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాల కారణంగా, 'దేవర' సినిమా విజయోత్సవ వేడుకల కోసం తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ కూడా ఓపెన్ ప్లేస్ ల్లో అనుమతులు వచ్చే పరిస్థితి లేదు. ఇలాంటి సమయంలో మేమూ ఏం చేయలేక పోతున్నాం. ఈవెంట్ ను నిర్వహించలేక పోతున్నందుకు ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులకు క్షమాపణలు కోరుతున్నాము అంటూ ట్వీట్ చేశారు. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న విజయోత్సవ వేడుక సైతం రద్దు కావడంతో ఫ్యాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. సినిమా విడుదల అయినప్పటి నుంచి ఫ్యాన్స్ ఇంకా ఎప్పుడు విజయోత్సవ వేడుక అన్నట్లు ఎదురు చూస్తున్నారు. వారు అందరికీ నిర్మాత నాగవంశీ ప్రకటన నిరుత్సాహం కలిగించింది. నందమూరి కళ్యాణ్ రామ్, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్మించిన దేవర సినిమాను తెలుగు రాష్ట్రాల్లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నాగ వంశీ భారీ ఎత్తున విడుదల చేసిన విషయం తెల్సిందే. ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ తర్వాత నటించిన సినిమా అవ్వడంతో అంచనాలు మొదటి నుంచి భారీగా పెరిగాయి. అంచనాలకు తగ్గట్లుగానే సినిమా భారీ ఓపెనింగ్స్ సొంతం చేసుకుంది.

## 'వేట్టయన్- ద హంటర్' ట్రైలర్ విడుదల

రజనీకాంత్ అభిమానులంతా ఇప్పుడు 'వేట్టయన్' సినిమా కోసం వేయికళ్లతో వెయిట్ చేస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మించారు. జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 10వ తేదీన పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి ట్రైలర్ ను రిలీజ్ చేశారు. నేరస్తులు .. కోర్టులు .. పోలీసుల నేపథ్యంలో సాగే సన్నివేశాలను ట్రైలర్ లో ఎక్కువగా టచ్ చేశారు. ఈ సినిమాలో ప్రధానమైన పాత్రలను పోషించిన అమితాబ్ .. ఫహాద్ ఫాజిల్ .. రానా .. రావు రమేశ్ .. రితికా సింగ్ .. మంజు వారియర్ .. అభిరామి పాత్రలను కవర్ చేస్తూ ఈ ట్రైలర్ వదిలారు. రజనీ మార్క్ డైలాగ్స్ తో .. ఫైట్లతో ట్రైలర్ ఆకట్టుకుంటోంది. యథార్థ సంఘటన నేపథ్యంతో అల్లుకున్న కథ ఇది అనే టాక్ ఉంది. సామాజికపరమైన అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ కథ కొనసాగుతుందని అంటున్నారు. 'జైలర్' కథకు పూర్తి భిన్నంగా ఉంటుందని, రజనీ ఇమేజ్ కి దూరంగా అనిపిస్తుందని చెబుతున్నారు. దాంతో ఈ సినిమాపై సహజంగానే అంచనాలు పెరుగుతున్నాయి. అనిరుధ్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా కొత్త రికార్డులను నమోదు చేస్తుందేమో చూడాలి.

## ఎన్టీఆర్ సినిమాలో హీరోయిన్‌గా కన్నడ బ్యూటీ!

ప్రస్తుతం యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా థియేటర్లలో బ్లాక్ బస్టర్ టాక్‌తో దూసుకెళ్తోంది. బాక్సాఫీస్ ముందు అదిరిపోయే వసూళ్లను అందుకుంటోంది. అయితే ఈ చిత్రం తర్వాత తారక్ ప్రశాంత్ నీల్‌తో కలిసి ఓ సినిమా చేయనున్నారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. పక్కా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌తో రానుంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఓ హీరోయిన్ కన్ఫార్మ్ అయినట్లు తెలుస్తోంది. ఆమె కన్నడ ఇండస్ట్రీకి చెందిన బ్యూటీ అని అంటున్నారు. ఆమె మరెవరో కాదు కన్నడతో పాటు తెలుగులోనూ మంచి టాక్ అందుకున్న 'సప్త సాగరాలు దాటి' మూవీ హీరోయిన్ రుక్మిణి వసంత్. ఇప్పటికే రుక్మిణి వసంత్‌తో చర్చలు కూడా జరిపారంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. దీనికి ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు కనిపిస్తున్నాయి. అయితే ఇందులో నిజమెంతో పక్కాగా తెలీదు. దీనిపై ఓ స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి ఉండాల్సిందే. కాగా, ఇప్పటికే సప్త సాగరాలు దాటి చిత్రాన్ని చూసిన తెలుగు ప్రేక్షకులంతా రుక్మిణి అందానికి ఫిదా అయిపోయారు. అలానే తెలుగు దర్శకనిర్మాతలు ఆమెను తెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని ఆ మధ్య ప్రచారం సాగింది. ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్ చేయాల్సిన సినిమాకు మైత్రీ మూవీకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. కేజీఎఫ్, సలార్ సినిమాల భారీ హిట్లతో ఫుల్ జోష్ మీదున్న ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్‌ను ఈ చిత్రంలో ఎలా చూపిస్తారా అని ఆయన ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.





## 'భారతీయుడు 3' థియేటర్స్‌లో రిలీజ్ కాదా?

ఎన్నో అంచనాల మధ్య ఈ జూలైలో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ డిజాస్టర్‌గా నిలిచిన చిత్రం భారతీయుడు 2. కమల్ హాసన్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ మూవీని పొన్నియన్ సెల్వన్ వంటి భారీ చిత్రం తర్వాత అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్.. రెడ్ జెయింట్ బ్యానర్‌తో కలిసి హై బడ్జెట్‌తో నిర్మించారు. విడుదలకు ముందు ప్రచార కార్యక్రమాలతో హడావుడి చేసినప్పటికీ సినిమాలోని అసలు లైన్‌ను ప్రమోట్ చేయకపోవడంతో ప్రేక్షకుల అంచనాలను అందుకోవడంలో ఘోరంగా విఫలమైంది. అయితే ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు రెడీగా ఉన్న మూడవ భాగం భారతీయుడు 3 (వార్ మోడ్) చిత్రం విషయంలో తీవ్ర సందిగ్ధం నెలకొంది. అయితే తాజాగా ఈ పార్ట్3పై సోషల్ మీడియాలో ఆసక్తికర విషయాలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ సినిమాను థియేటర్లలో కాకుండా డైరెక్ట్ ఓటీటీలో రిలీజ్ చేయడానికి నిర్మాతలు సిద్ధమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మామూలుగా అయితే ఈ సినిమాను జనవరి 2025లో థియేటర్లలో విడుదల చేయాలని ముందుగానే ప్లాన్ చేసుకున్నప్పటికీ ఇప్పుడు ఆ నిర్ణయాన్ని రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. భారతీయుడు 2 రిలీజ్ అయినప్పుడే మూడో భాగం ట్రైలర్ విడుదల చేసినప్పటికీ ప్రేక్షకుల నుంచి ఆశించిన స్పందన రాలేదు. దీంతో ఈ సినిమా విడుదల విషయంలో మేకర్స్ సందిగ్ధంలో పడ్డట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికే భారతీయుడు 2 సినిమా నెట్ ఫ్లిక్స్ కొనుగోలు చేసి ఉండడంతో ఇప్పుడు ఈ పార్ట్ 3ని తిరిగి అదే సంస్థతో ఓ ఫ్యాన్సీ రేటుకు లైకా సంస్థ ఒప్పందం చేసుకుందని, అధికార ప్రకటన రావడమే తరువాయి అని న్యూస్ వైరల్ అవుతోంది. కాగా ఈ సినిమాను 2025 జనవరి నెలలో సంక్రాంతికి గానీ రిపబ్లిక్ డే సమయంలో గానీ ఓటీటీలో సౌత్‌లోని అన్ని భాషల్లో ఒకేసారి డైరెక్ట్‌గా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో నేషనల్ వైడ్‌గా టాప్‌లో ట్రెండింగ్ అవడం విశేషం. అయితే ఇప్పటి వరకు మేకర్స్ గానీ సదరు ఓటీటీ ప్లాట్ ఫాం గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరికొద్ది రోజుల్లోనే ఈ వార్తపై క్లారిటీ రానుంది.

# గాంధీజీ వెబ్ సిరీస్!




జాతిపిత మహాత్మా గాంధీపై వెబ్ సిరీస్ రాబోతుంది. ఇప్పటివరకు గాంధీజీపై ఎన్నో సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లు వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు మహాత్ముడి జీవిత కథతో మరో వెబ్ సిరీస్ రాబోతుంది. స్కామ్ 1992, అలీఘర్, షాహిద్, స్కూప్ వంటి సంచలన చిత్రాలు తెరకెక్కించిన బాలీవుడ్ దర్శకుడు హన్సల్ మెహతా ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించబోతుండగా.. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియో నిర్మించబోతుంది. ఈ సినిమాలో గాంధీజీ పాత్రలో స్కామ్ 1992 నటుడు ప్రతీక్ గాంధీ నటించబోతున్నాడు. అయితే ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను మేకర్స్ పంచుకున్నారు. ఈ సిరీస్‌కు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే ఈ వెబ్ సిరీస్ గురించి ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ చేయబోతున్నా. ఈ చిత్రంలో గాంధీజీ జీవితం, సౌత్ ఆఫ్రికాలో ఆయన గడిపిన క్షణాలు, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం గురించి ఉండబోతున్నట్లు తెలిపాడు. హన్సల్ మెహతా దర్శకత్వంలో వస్తున్న ఈ సిరీస్‌కు సంగీతం అందించడం గౌరవంగా ఉందంటూ రెహమాన్ తెలిపాడు.

# అరటి పండ్లతో క్యాన్సర్?



**విశ్వంభర, ఫీచర్:** అరటి పండులో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీనిని పోషకాల పవర్ హౌస్ అంటారు. ఈ పండులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. కాబట్టి రోజు బ్రేక్ ఫాస్ట్ తర్వాత దీనిని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు మీ శరీరానికి అందుతాయి. ఇందులో ఎక్కువగా పొటాషియం ఉంటుంది. ఇది అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. అలాగే అరటిలో సహజ చక్కెర అధికంగా ఉంటుంది. రోజు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అరటి పండు ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. అంతేకాకుండా వ్యాయామాలు, జిమ్ చేసేవారు అరటిపండును తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందుతాయి. అరటిపండు అనేది పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ B6, ఫాస్ఫరస్ వంటి విటమిన్లు, ఖనిజాల గని. జీర్ణశక్తిని బలోపేతం చేయడం, బరువు తగ్గడం, బరువు పెరగడం, బలమైన ఎముకలు, శక్తి స్థాయిలను పెంచడం, గుండెను ఆరోగ్యంగా ఉంచడం, రక్తంలో చక్కెరను నియంత్రించడం వంటి అనేక ప్రయోజనాలను అరటిపండు అందిస్తుంది. కానీ, ఇవన్నీ పొందాలంటే.. మీరు సహజంగా పండిన అరటిపండును తినాలి. అయితే మీరు తినే అరటిపండ్లను ప్రమాదకరమైన రసాయనాలతో నిండి ఉన్నాయని మీకు తెలుసా..? మనం కేవలం రూ. 50కే డజన్ అరటి పండ్లు కొని.. మన ఇంటికి క్యాన్సర్ తెచ్చుకుంటున్నాం. పక్వానికి రాక ముందు అరటి పండ్లను తెంపేసి.. కార్బైడ్ రసాయనాన్ని ఉపయోగించి పండిస్తున్నారు. దీంతో.. మీ శరీరంలో విషం కలుస్తుంది. అసలు కార్బైడ్ అంటే ఏంటి..? దీనికి ఎలా చెక్ పెట్టాలో ఇక్కడ తెలుసుకుందాం.

**కార్బైడ్ అంటే ఏంటి..?**

అరటిపండ్లతో పాటు.. ఇతర పండ్లను పండించడానికి కార్బైడ్, ముఖ్యంగా కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. ఈ రసాయనం పండ్లలోని తేమను ఎండబెట్టి.. వాటిలో ఇథైల్ అనే వాయువును ఉత్పత్తి చేస్తుంది. ఇథైల్ పండ్ల లోపల వేడిని ఉత్పత్తి చేస్తుంది. దీంతో.. పండ్లు పక్వానికి ముందు పండిపోతున్నాయి. కాల్షియం కార్బైడ్ వాడకాన్ని చాలా ప్రాంతాల్లో నిషేధించారు. కానీ, ఎక్కువ లాభాలు ఆర్జించాలనే ఆశతో కాల్షియం కార్బైడ్‌ని వినియోగిస్తున్నరు. ఈ రసాయనం వాడటం వల్ల పండ్లు నిర్ణీత సమయానికి ముందే పక్వానికి వచ్చి త్వరగా మార్కెట్‌కు చేరుకుంటున్నాయి. ఇది భారతదేశంతో సహా అనేక దేశాలలో నిషేధించబడిన రసాయనం. దీనిని ఆరోగ్యానికి ప్రమాదంగా గుర్తించారు. ఇలా పండిన పండ్లను తినడం వల్ల క్యాన్సర్‌తో సహా అనేక తీవ్రమైన వ్యాధుల ముప్పు పొంచి ఉంది.

**ఈ రసాయనాన్ని నిషేధించారు..**

కాల్షియం కార్బైడ్‌లో సాధారణంగా ఆర్సెనిక్, ఫాస్ఫరస్ ఉంటాయి. ఈ రసాయనాల వాడకం వల్ల ఆరోగ్యానికి పెను ముప్పు కలుగుతుంది. ఈ ప్రమాదాల కారణంగా, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్ 2.3.5 ప్రకారం పండ్లను పండించడానికి కాల్షియం కార్బైడ్ వాడకాన్ని నిషేధించారు. పండ్లను పండించడానికి ఇథిలీన్ సురక్షితంగా పరిగణించబడుతుంది. సరిగ్గా ఉపయోగిస్తే ఇథిలీన్ హానికరం కాదు. భారతదేశంలో పండ్లను పండించడానికి ఇథిలీన్ వాయువును ఉపయోగించడంపై FSSAI ఆమోదించింది. ఇథిలీన్ సహజంగా పండ్ల పక్వానికి వచ్చే ప్రక్రియను నియంత్రిస్తుంది . ఈ వాయువును పంట, రకం, పక్వత నుంచి పండ్లలో 100పీపీఎం (100 l/L) సాంద్రతల బట్టి ఉపయోగించవచ్చు. కాల్షియం కార్బైడ్ ఆర్సెనిక్, ఫాస్ఫరస్ వంటి ప్రమాదకర రసాయనాలను కలిగి ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. తరచుగా దాహం, మైకము, బలహీనత, ఆహారాన్ని మింగడంలో వంటి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారు. అంతేకాదు కాలేయం, కిడ్నీ వ్యాధుల బారిన పడే ప్రమాదం కూడా ఉంది. కాల్షియం కార్బైడ్ రసాయనం కాబట్టి.. ఏ రూపంలోనైనా సరే బాడీలో చేరితే డేంజర్ అని నిపుణులు చెబుతున్నారు.

**జీర్ణ సమస్యలు..**

కార్బైడ్ వాడకం కడుపు నొప్పి, విరేచనాలు, గుండెల్లో మంట వంటి జీర్ణశయాంతర సమస్యలను కలిగిస్తుంది. ఇది మాత్రమే కాదు, కాల్షియం కార్బైడ్‌కు నాడీ వ్యవస్థపై ఎక్కువ ప్రభావం చూపుతుంది, తలనొప్పి, తల తిరగడం, గందరగోళం వంటి లక్షణాలను కలిగిస్తుంది.

**క్యాన్సర్ ప్రమాదం కూడా..**

NCBIలో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం కాల్షియం కార్బైడ్ వల్ల మైకము, తలనొప్పి, మానసిక స్థితి తగ్గడం, తీవ్రమైన సందర్భాల్లో మూర్ఛలు వంటి నరాల సంబంధిత లక్షణాలు ఏర్పడవచ్చు. ఏ రూపంలోనైనా ఎక్కువ మోతాదులో శరీరంలోకి చేరితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**పోషకాలు పోతాయి..**

కృత్రిమంగా పండిన పండ్లలో.. సహజంగా పండిన పండ్ల కంటే తక్కువ పోషక విలువలు ఉంటాయి. ఈ పండ్లు శరీరానికి కావాల్సిన చక్కెరలు, ఇతర ముఖ్యమైన పోషకాలను పూర్తిగా అందించవు. దీంతో.. వీటిని తినడం వల్ల లాభాల కంటే ముప్పే ఎక్కువగా ఉంది.

**కాల్షియం కార్బైడ్‌తో పండిన పండ్లను ఎలా గుర్తించాలి..**

- కార్బైడ్‌తో పండిన అరటిపండ్లు అసమానంగా పండుతాయి. అరటిపండులోని కొంత భాగం పసుపు రంగులోకి మారుతుంది. మరి కొంత భాగం పచ్చగా ఉండవచ్చు. ఈ తేడాలు గమనించి మీరు అరటి పండ్లను తీసుకోండి.
- కాల్షియం కార్బైడ్‌తో పండిన అరటిపండ్లు సహజంగా పండిన అరటిపండ్ల కంటే వేగంగా పాడైపోతాయి.
- కార్బైడ్ వల్ల అరటిపండ్ల తొక్క పసుపు రంగులో కనిపిస్తుంది. నిగనిగలాడుతుంది. కానీ, లోపలి పండు మాత్రం గట్టిగా ఉంటుంది. పచ్చి పచ్చిగా ఉండే అవకాశం ఉంది.
- సహజంగా పండిన అరటిపండ్లు చాలా మృదువుగా ఉంటుంది. దాని ఆకారంలో ఎటువంటి మార్పు ఉండదు. అరటిపండు పూర్తిగా పసుపు రంగులో ఉన్నప్పటికీ ఇంకా చాలా గట్టిగా ఉంటే, అది రసాయనాలతో పండించారని అర్థం చేసుకోండి.
- సహజంగా పండిన అరటిపండ్లు ఆహ్లాదకరమైన తీపి వాసన కలిగి ఉంటాయి. రసాయనాలతో పండిన అరటిపండ్లలో ఈ సహజ సువాసన ఉండదు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com